ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
శనివారం 20, సెప్టెంబరు 2025


దేవుడు చెరువులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

అక్రమాల డొంక కదులుతోంది!

వైసీపీ హయాంలో 'అవినీతి కట్టడాలకు' పునాదులు!

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒంగోలు కార్పొరేషన్‌లో అవినీతి రాజ్యమేలింది. కొందరు అధికారులు బరితెగించి అక్రమాలకు పాల్పడ్డారు. అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేయాల్సింది పోయి ప్రోత్సహించారు. కీలక అధికారుల చేతివాటంతో నగరంలో కనీస నిబంధనలు పాటించని నిర్మాణాలు అడ్డూఅదుపు లేకుండా సాగిపోయాయి. కాసులిస్తే చాలు అనుమతులు మంజూరయ్యాయి. అప్పట్లో చోటుచేసుకున్న ఈ అంతులేని అవినీతిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా ఆ సమయంలో పని చేసిన కార్పొరేషన్ కమిషనర్‌తోపాటు అందులో భాగస్వాములైన ఏసీపీ, టౌన్ ప్లానింగ్ సిబ్బందిపైన చర్యలకు పురపాలక శాఖ ఆదేశాలు జారీచేసింది.

- అక్రమ నిర్మాణాలకు నాటి కార్పొరేషన్ అధికారుల వెన్నుదన్ను
- లేబర్ సెస్.. ఎల్‌ఆర్‌ఎస్ స్కీం నిధులు స్వాహా..!
- నిబంధనలు పాటించని షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు సహకారం
- గత కమిషనర్, ఏసీపీల నిర్వాకంపై పురపాలక శాఖ సీరియస్

నిబంధనలు పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా అనుమతులు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఒంగోలు నగర పాలక సంస్థలో అవినీతి 'కట్టడాలు' పెరిగిపోయాయి. నాటి ప్రజాప్రతినిధుల ఆదేశాలకు తలూపిన అధికారులు తమ చేతివాటం చూపారు. అక్రమ కట్టడాలను నిర్మిస్తే సహించబోమంటూ పైకి హడావుడి చేస్తూ లోపల మాత్రం నగరపాలక సంస్థ టౌన్ 'ప్లానింగ్‌'ను మార్చేశారు. అధికారులతోపాటు, సిబ్బంది అనధికార నిర్మాణాలకు వెన్నుదన్నుగా నిలిచారు. నిబంధనలు

మిగతా 6వ పేజీలో

గత వైసీపీ హయాంలో ఒంగోలు కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయి. అప్పటి అధికారులు అనధికార భవనాల నిర్మాణాలను ప్రోత్సహించారు. వాటితోపాటు ఖాళీస్థలాల పన్ను (వీఎల్‌టీ)

ఆ ఐదేళ్లలో అంతా ఇష్టారాజ్యం

కట్టించకుండానే భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేశారు. దీంతో కార్పొరేషన్‌కు రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. మరోవైపు కొందరు జీ+2 నిర్మాణానికి అనుమతులు తీసుకుని ఏకంగా నాలుగు ఆపైన అంతస్థులు నిర్మించారు. ముఖ్యంగా వ్యాపార సంస్థల నిర్మాణానికి భవన నిర్మాణ ఖర్చులో 10శాతం కార్మిక శాఖకు లేబర్ సెస్ చెల్లించాల్సి ఉంది. అది సక్రమంగా చెల్లిస్తే రూ.కోట్లు అవుతుంది. అయితే కేవలం రూ.లక్ష, రూ.2లక్షలు మాత్రమే కట్టించి మిగిలిన మొత్తాన్ని అధికారులు కాజేసినట్లు సమాచారం. దీంతో కార్మిక శాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇదిలావుండగా అప్రూవల్ లేని ఖాళీ స్థలానికి లేఅవుట్ రెగ్యులేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) ద్వారా 14శాతం అపరాధ రుసుం కట్టించాల్సి ఉండగా, కొన్నింటికి తూతూమంత్రంగా కట్టించారు. మిగతా వాటిని పూర్తిస్థాయిలో దిగమింగేశారని తెలుస్తోంది.

అక్రమ కట్టడాలకు అనుమతులు

నగరంలోని ఊరచెరువు, బండ్లమిట్ట, అద్దంకి బస్టాండ్ రోడ్డులో దుకాణాలు, మాల్స్ తదితర 108 నిర్మాణాలకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చేశారు. భవన యజమానులు కార్పొరేషన్‌కు ఒక రూపాయి కూడా చెల్లించకుండానే గత కమిషనర్ వెంకటేశ్వరరావు, నాటి అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ప్రస్తుతం రిటైర్డ్) అయిన కె.వెంకటేశ్వరరావు చక్రం తిప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. దుకాణదారుల నుంచి భారీ మొత్తాలు వసూలు చేసి నిర్మాణాలకు సహకరించారని తెలుస్తోంది. అలాగే మంగమూరు రోడ్డులో ఓ మార్ట్, షాపింగ్ మాల్‌కు జీ+3 కింద అనుతులు తీసుకుని ఏకంగా జీ+4 నిర్మించారు. అలాగే ఖాళీ స్థలాల పన్ను రూ.2కోట్లు, లేబర్ సెస్ రూ.5 కోట్లు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.5లక్షలు మాత్రమే కట్టినట్లు సమాచారం.


పునాదుల స్థాయిలో నిలిచిపోయి ఉన్న మెడికల్ కాలేజీలోని వైద్యశాల విభాగం

మెడికల్ కాలేజీ పూర్తికి వేగంగా అడుగులు

టెండర్లను ఆహ్వానించిన ప్రభుత్వం

మార్కాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోంది. ఈ నెల ఆరంభంలో పీపీపీ పద్ధతిలో రాష్ట్రంలోని నాలుగు మెడికల్ కాలేజీల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపిన సంగతి విదితమే. ఈ క్రమంలో ఫేజ్-1 కింద మార్కాపురం, కర్నూలు జిల్లా ఆదోని, అన్నమయ్య జిల్లా మదనపల్లె, కడప జిల్లా పులివెందులలో అసంపూర్తిగా ఉన్న కాలేజీల నిర్మాణాలను పూర్తిచేసేందుకు ఆంధ్రప్రదేశ్ వైద్యసేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) ఈనెల 16న టెండర్లను ఆహ్వానించింది.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు

ప్రభుత్వ ప్రైవేటు పార్టనర్ షిప్ (పీపీపీ) విధానంలో నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించాలన్నది ప్రభుత్వ యోచన. అందుకనుగుణంగా వేగంగా చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం మార్కాపురం మెడికల్ కాలేజీ పనులు కేవలం 19శాతంలోపు మాత్రమే పూర్తయ్యాయి. కీలకమైన వైద్యశాల నిర్మాణం ఇంకా పునాదుల స్థాయిలోనే ఉంది. గత ప్రభుత్వం కాలేజీకి సంబంధించిన అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, విద్యార్థుల హాస్టల్స్ నిర్మాణాలపై దృష్టిపెట్టి కొంతమేర పనులు చేసింది. అంతేకాక వైద్యకళాశాలకు సంబంధించి

మిగతా 6వ పేజీలో


సింగరాయకొండ పోలీసు స్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

- పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశం
- సింగరాయకొండ, టంగుటూరు స్టేషన్ల తనిఖీ

7

వైసీపీ నిరసనకు విద్యార్థులు

పోలీసుల ఆంక్షలు బేఖాతరు

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం మండలం రాయవరం గ్రామ పరిధిలోని మెడికల్ కళాశాల వద్ద వైసీపీ శుక్రవారం నిర్వహించిన చలో మెడికల్ కళాశాల కార్యక్రమానికి కాలేజీ విద్యార్థులను తరలించారు. 30 యాక్ట్ అమలులో ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నా వైసీపీ నేతలు పట్టించుకోకుండా మెడికల్ కళాశాల ప్రాంగణంలోకి దూసుకెళ్లారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కళాశాల నిర్మాణంలో జాప్యం జరిగినా తమకేమీ తెలియదన్నట్లుగా ఆందోళనకు నాయకత్వం వహించిన నేతలు మాట్లాడటం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి జనసమీకరణకు నాయకులు ప్రయత్నించి విఫలమయ్యారు. పోలీసులు వారిస్తున్నా పట్టించుకోకుండా కొందరు కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించి నిర్మాణంలో ఉన్న కాలేజీ భవనంపైకి ఎక్కి వైసీపీ జెండాలను ఊపుతూ వాటిని అక్కడ కట్టారు. మెడికల్ కళాశాల నిర్మాణం ప్రభుత్వమే చేపట్టాలని, పీపీపీ పద్ధతిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పశ్చిమప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం కోసం మెడికల్ కళాశాలను మంజూరు చేశారని తెలిపారు. వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ పీపీపీ పేరుతో కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యేలు జంకె వెంకటరెడ్డి, కుందురు నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు పాల్గొన్నారు.


మార్కాపురంలో వైసీపీ నిరసనకు హాజరైన విద్యార్థులు


నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ వద్ద నిరసన తెలుపుతున్న వైసీపీ నాయకులు

డీసీవోగా శ్రీలక్ష్మి బాధ్యతల స్వీకరణ



ఒంగోలు విద్య, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకారాధికారిగా డి.శ్రీలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెను ఇక్కడ డీసీవోగా నియమిస్తూ రాష్ట్ర సహకారశాఖ కమిషనర్ ఎ.బాబు ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఆమె శుక్రవారం ఉదయం ఇప్పటి వరకూ డీసీవోగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించిన ఎన్.ఇందిరాదేవి నుంచి బాధ్యతలు తీసుకున్నారు. కడపకు చెందిన శ్రీలక్ష్మి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ పూర్తిచేసి పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఎంఈడీలో గోల్డ్ మెడల్ సాధించారు. 2002లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగ పర్వాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా జిల్లా అధికారి స్థాయికి ఎదిగారు. 2004లో స్కూలు అసిస్టెంట్‌గా ఎంపికైన శ్రీలక్ష్మి.. 2005లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీపీఎస్సీ ద్వారా జూనియర్ లెక్చరర్‌గా నియమితులయ్యారు. 2007లో గ్రూప్-1కు ఎంపికై సహకారశాఖలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా ప్రస్థానం ప్రారంభించారు. తొమ్మిదేళ్లపాటు సహకార శాఖలో సేవలు అందించిన ఆమె.. ఆ తర్వాత ఫారిన్ సర్వీసులో వివిధ పోస్టుల్లో పనిచేశారు. శ్రీకాళహస్తి మునిసిపల్ కమిషనర్‌గా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా, తిరుపతి మునిసిపల్ డిప్యూటీ కమిషనర్‌గా, తుడాలో అధికారిగా, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం స్పెషల్ కేడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ (ఎస్‌సీడీఆర్) హోదాలో జిల్లా సహకారాధికారిగా బాధ్యతలు స్వీకరించారు.


సొరంగం పనుల వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ రాజాబాబు

వచ్చే ఏడాది ఆగస్టుకు వెలిగొండ నీరు

- ప్రాజెక్ట్ పూర్తిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- నిర్వాసితులకు పరిహారం, పునరావాసంపై చర్యలు
- పనులను పరిశీలించిన కలెక్టర్ రాజాబాబు

పెద్దదోర్నాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ద్వారా వచ్చే ఏడాది ఆగస్టు నాటికి కృష్ణా జలాలను విడుదల చేయనున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. మండలంలోని కొత్తూరు వద్ద జరుగుతున్న ప్రాజెక్టులో కీలకమైన 2వ సొరంగం పనుల పురోగతిని ఆయన శుక్రవారం పరిశీలించారు. అక్కడ ఇంజనీరింగ్ అధికారులు పనుల వివరాలను కలెక్టర్‌కు

మిగతా 6వ పేజీలో

మహిళను హింసించిన కేసులో నలుగురు అరెస్ట్

వివరాలను వెల్లడించిన పొదిలి సీఐ వెంకటేశ్వర్లు

పొదిలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు గ్రామంలోని ఎస్టీకాలనీలో మహిళను చిత్రహింసలకు గురిచేసిన కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్లు పొదిలి సీఐ టి.వెంకటేశ్వర్లు చెప్పారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. కాలనీకి చెందిన భాగ్యలక్ష్మి చేతులను కట్టేసి ఈనెల 13వ తేదీన భర్త బాలాజీ చిత్రహింసలకు గురిచేశాడు. దీనిపై బాధితురాలు భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితులైన బాలాజీ, పోలా పద్మావతి, పిల్లి రమణమ్మ, జగన్నాథం విష్ణువర్ధన్‌లను శుక్రవారం కలుజువ్వలపాడు ఎస్టీకాలనీలో అరెస్ట్ చేశారు. సుమారు 12ఏళ్ల క్రితం భాగ్యలక్ష్మి, బాలాజీలు ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి నలుగురు సంతానం. బాలాజీ మద్యానికి బానిసై భాగ్యలక్ష్మిని తరచూ కొట్టడం, వేధించడంతోపాటు అవమానాలకు గురిచేస్తున్నాడు. ఈక్రమంలో మూడేళ్లుగా తన సమీప బంధువు పోలా పద్మావతితో బాలాజీ వివాహేతర సంబంధం పెట్టుకొని హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అప్పటి నుంచి భాగ్యలక్ష్మి కూలి పనులు చేసుకుంటూ


విలేకరులకు వివరాలను వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, తర్లుపాడు ఎస్సై బ్రహ్మనాయుడు

మిగతా 6వ పేజీలో


దర్శిలోని గడియార స్తంభం సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కొనసాగుతున్న వాన

- చల్లబడిన వాతావరణం
- పంటలకు మేలు
- ఒంగోలు జలమయం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. శుక్రవారం ఉదయం ఎండ తీవ్రత కనిపించినా మధ్యాహ్నం నుంచి వాతావరణం మారింది. కారుమబ్బులు కమ్మి పలు ప్రాంతాల్లో వర్షం పడింది. జిల్లా కేంద్రమైన ఒంగోలులో శుక్రవారం మధ్యాహ్నం తర్వాత రెండు విడతలుగా భారీ వర్షం కురిసింది. నగరంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై పారింది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తాజా వానలతో జిల్లావ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. నిన్న మొన్నటి వరకు గరిష్ఠ ఉష్ణోగ్రత 37 నుంచి 38 డిగ్రీల వరకు నమోదు కాగా శుక్రవారం 34 డిగ్రీలకు పడిపోయింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా కొంతమేర తగ్గడంతో ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. ఇప్పటి వరకూ ఎండ తీవ్రత, బెట్ట వాతావరణంతో ఎదుగుదల లేకుండా ఉన్న పలురకాల పంటలకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మేలు చేయనున్నాయి. అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా గత రెండు మూడు రోజుల నుంచి ఏదో ఒక ప్రాంతంలో భారీవర్షం కురవడంతోపాటు మిగిలిన ప్రాంతాల్లో కొద్దిపాటి జల్లులు పడుతున్నాయి.

జిల్లాలో శుక్రవారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో 17.0మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పుల్లలచెరువు మండలంలో 69.4 మి.మీ కురిసింది. దర్శిలో 59.6, దొనకొండలో 52.4, ఒంగోలు అర్బన్‌లో 52.4, ఒంగోలు రూరల్‌లో 52.4, కనిగిరిలో 52.0, ఎర్రగొండపాలెంలో 39.6, త్రిపురాంతకంలో 37.6 వర్షపాతం నమోదైంది. సింగరాయకొండలో 32.2, మర్రిపూడిలో 31.0, తాళ్లూరులో 28.4, తర్లుపాడులో 26.2, కురిచేడులో 21.4, కొండపిలో 19.4, ముండ్లమూరులో 17.6, పెద్దారవీడులో 14.6, సంతనూతలపాడులో 13.8, దోర్నాలలో 13.4, కొనకనమిట్లలో 11.0 మి.మీ కురిసింది. పలు మండలాల్లో జల్లులు పడ్డాయి.

17.0 మి.మీ సగటు వర్షపాతం

బస్సు వెళ్లని పల్లెలు.. ఏళ్ల తరబడి వెతలు

- రోడ్లున్నా రాని ఆర్టీసీ బస్సు
- ఆదాయం వచ్చే మార్గాలకే సంస్థ అధికారుల ప్రాధాన్యం

7

రేపు నేతల విగ్రహాల ప్రారంభం

● కార్యక్రమం ఏర్పాట్లు పరిశీలించిన దామచర్ల సత్య

● హాజరుకానున్న మంత్రులు, ఎంపీలు

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు నాయుడుపాలెంలో ఆదివారం జరిగే అభివృద్ధి పనులు, విగ్రహాల ప్రారంభోత్సవ కార్యక్రమాలను ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య శుక్రవారం పరిశీలించారు. మర్లపాడులో దివంగత నేతలు ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు, పరిటాల రవి విగ్రహాల ప్రారంభోత్సవాలు జరగనున్నాయి. వాహనాల పార్కింగ్, భోజన ఏర్పాట్లు, సభ జరిగే ప్రదేశాలను సత్య పరిశీలించి, ఏర్పాట్లపై నాయకులతో చర్చించారు. భారీగా జరిగే కార్యక్రమానికి వచ్చే జనం, వాహనాల రద్దీ లేకుండా ఉండే విధంగా ఏర్పాట్లను పథకం ప్రకారం నిర్వహించాలని నాయకులు, పోలీసు అధికారులతో చర్చించారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, ఎంపీలతోపాటు, ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు, కార్పొరేషన్‌ల ఛైర్మన్లు, డైరెక్టర్లు హాజరుకానుండటంతో ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్సైలు నాగమల్లేశ్వరరావు, మహేంద్ర, టీడీపీ మండల నాయకులు ఈదర ప్రభాకర్, రామా గోపి, మక్కెన వెంకటరావు మర్లపాడు గ్రామ టీడీపీ నాయకులు హరిబాబు, వేణు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



చిన్నకాశయ్య (ఫైల్)

కంభం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గేదెలను మేపేందుకు వెళ్తున్న రైతు విద్యుత్ షాక్‌తో మరణించిన సంఘటన అర్ధవీడు మండలం చింతమల్లెలపాడు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే... అర్ధవీడు మండలం చింతమల్లెలపాడు గ్రామానికి చెందిన యేషపోగున్న కాశయ్య (45) తన గేదెలను మేపుకునేందుకు కొండలవైపు తోలుకొని వెళ్తున్నాడు. గేదెలు రోడ్డు పక్కన ఉన్న ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లాయి. ఇది గమనించిన కాశయ్య వాటిని పక్కకు తోలే క్రమలో షాక్‌కు గురై మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మ్యాజిక్ డ్రెయిన్ పనులను పరిశీలించిన పీడీ



అధికారులతో మాట్లాడుతున్న పీడీ జోసెఫ్ కుమార్

రాచర్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మ్యాజిక్ డ్రెయిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధిహామీ పథకం పీడీ జోసఫ్ కుమార్ చెప్పారు. మండలంలోని గౌతవరం గ్రామంలో జరుగుతున్న మ్యాజిక్ డ్రెయిన్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కేవలం 6గ్రామాలు మాత్రమే ఈ కార్యక్రమానికి ఎంపికయ్యాయని, అందులో గిద్దలూరు నియోజకవర్గంలో గౌతవరం మాత్రమే ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట రామిరెడ్డి, ఉపాధి హామీ ఏపీఏ మహాలక్ష్మీ, ఈసీ నాగేశ్వరరావు, టీఏ కోటిలింగారెడ్డి, కార్యదర్శి అనిల్ కుమార్, సొసైటీ బ్యాంక్ ఛైర్మన్ జీవనేశ్వరరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కె.యోగానంద్, సనవుల్లా ఖాన్, మురళి పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష

సింగరాయకొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో నిందితుడికి స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి వి.లీలాశ్యాంసుందరి శుక్రవారం ఏడాది జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. గత ఏడాది డిసెంబర్ 22వ తేదీన శ్రీకాకుళం జిల్లా పలసా గ్రామానికి చెందిన గొల్లంగి ప్రవీణ్‌కుమార్ సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని కందుకూరు రోడ్డు సెంటర్‌లోని పాత ఇనుము దుకాణం షెట్టర్ పగలకొట్టి క్యాష్ కౌంటర్‌లోని రూ.5వేలు అపహరించాడు. దుకాణానికి చెందిన షేక్ ముజీబ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. దుకాణంలో సీసీ కెమెరాల్లో నమోదైన సీసీఫుటేజ్ ఆధారంగా నిందితుడిని గుర్తించి గత ఏడాది డిసెంబర్ 25 తేదీన అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా నిందితుడికి న్యాయస్థానం రిమాండ్ విధించింది. విచారణలో భాగంగా నిందితుడు దొంగతనానికి పాల్పడిపట్లు నిర్ధారణ కావడంతో న్యాయాధికారి నిందితుడికి ఏడాది జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

రెండు పార్టీలూ బీజేపీ తొత్తులే

● కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, వైసీపీ రెండూ.. బీజేపీ తొత్తులుగానే పనిచేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి విమర్శించారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో జరిగిన మీడియా సమావేశంలో మస్తాన్‌వలి మాట్లాడుతూ ప్రజల ప్రయోజనాలు కాపాడటంలో టీడీపీ, వైసీపీ విఫలం అయ్యాయని విమర్శించారు. రాజ్యాంగ స్ఫూర్తితో సంపాదించుకున్న శక్తివంతమైన ఆయుధం ఓటు హక్కు అన్నారు. ఓట్ల చోరీకి పాల్పడుతూ బీజేపీ ప్రజల గొంతు నొక్కేస్తుందన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ప్రకాశం జిల్లా ఇన్‌చార్జి గౌతు సత్యేంద్రబాబు మాట్లాడుతూ బీహార్ ఎన్నికల తరువాత దేశంలో అనేక రాజకీయ మార్పులు వస్తాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం సంతరించుకుంటుదని అన్నారు. డీసీసీ అధ్యక్షుడు షేక్‌సైదా మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కైపు వెంకట కృష్ణారెడ్డి, బీఆర్.గౌస్, శ్రీపతి సతీష్ పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

కొత్తపట్నం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలోని అల్లూరులో జరిగింది. కొత్తపట్నం పోలీసులు అందించిన వివరాల మేరకు.. అల్లూరు గ్రామానికి చెందిన ముప్పాళ పిచ్చయ్య(74) కొంత కాలంగా సక్రమంగా చూసే వారు లేక ఇబ్బందులు పడుతున్నాడు.ఈ నేపథ్యంలో ఆయన కొడుకు రామకృష్ణ పిచ్చయ్యను ఆహారం తీసుకోవాలని కోరాడు. కొడుకు ఆహారం తెచ్చే లోగా పురుగుమందు తాగేశాడు. దీన్ని గుర్తించిన రామకృష్ణ 108 ద్వారా చికిత్స కోసం ఆసుపత్రికి తరలించే లోగా పిచ్చయ్య మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.346

ఒంగోలు (రూరల్),సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలంకేంద్రం రెండులో శనివారం జరిగిన పొగాకు వేలంలో పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.346 లకు వ్యాపారులు కొనుగోలు చేశారు. వేలంకు మొత్తం 1,130 బేళ్ల రాగా 757 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు, 244 బేళ్ల నోబిడ్ అయ్యాయి.

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

● మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు ● పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న కమిషనర్

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం పనిచేసే పారిశుధ్య కార్మికులు విధులతోపాటు వ్యక్తిగత ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని నగర కమిషనరు కే. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్, ఈఎస్ఐ సంయుక్త నిర్వహణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కమిషనరు మాట్లాడుతూ ప్రతి కార్మికుడు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. మత్తుపానీయాలకు దూరంగా ఉండాలని, అలాగే ఆహారపు అలవాట్లలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దేందుకు నిరంతరం కాలుష్యంలోనూ పనిచేస్తున్న కార్మికుల సేవలు అభినందనీయం అన్నారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసినా, చెత్తా, చెదారం మధ్య పనిచేస్తున్న కార్మికులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజారోగ్యం పనిచేసే కార్మికులు, వ్యక్తిగత ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చూపడకూడదన్నారు. ఈ శిబిరంలో శానిటరీ విభాగం కార్మికులతోపాటు, పలు సెక్షన్‌ల సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకోగా, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంతః ఐశయ్యతోపాటు, కార్పొరేటర్లు ఆదిపూడి గిరిజా శాండిల్య, చింతపల్లి గోపితోపాటు శానిటరీ సూపర్ వైజర్ షేక్ బాబ్జి, ఎన్. పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.



పొన్నలూరులో పొగాకు నారుమడిని పరిశీలిస్తున్న వేలం నిర్వహణాధికారి కిరణ్

పొగాకు నర్సరీల రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

పొన్నలూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పొగాకు నర్సరీల రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కొండపి వేలం నిర్వహణాధికారి ఎం.కిరణ్ సూచించారు. ఆయన శుక్రవారం పొన్నలూరులో పొగాకు నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు బోర్డు అనుమతించిన మేరకే పంట సాగు చేయాలని సూచించారు. అధికంగా పండించడం వలన నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐటీసీ బయ్యర్ చంద్రారెడ్డి, జీపీఐ ప్రతినిధి రబ్బాని, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రత్యూష, సూర్యప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

మద్దిపాడు, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి):వెల్లంపల్లిలో గంజాయి అమ్ముతున్నారన్న సమాచారం మేరకు ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ బాబు, మద్దిపాడు ఎస్సై వెంకట సైదులు సిబ్బందితో కలిసి దాడులు చేశారు.ఈ దాడుల్లో వెల్లంపల్లి ఆవాస్ హోటల్ ఎదురుగా గంజాయిని పట్టుకున్నారు. చీమకుర్తి మండలం మరిచెట్లపాలెంకు చెందిన బండారి ఎస్తేరమ్మ, ఒడిస్సాకు చెందిన దీపకుమార్ మాలిక్‌లు ఒడిస్సా నుంచి రెండు కేజీల గంజాయి తెచ్చి వెల్లంపల్లి పరిసర ప్రాంతాలలో అమ్ముతున్నారన్నారు. తమకు అందిన సమాచారం మేరకు వారిరువురిని మద్దిపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి సమక్షంలో అరెస్ట్ చేసినట్లు శ్రీకాంత్ బాబు తెలిపారు.

విద్యార్థులు లక్ష్యాలతో ముందుకు పోవాలి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జీవిత లక్ష్యాలను నిర్ణయించుకుని, ఎదురైయే సవాళ్లను అధిగమిస్తూ ముందుకు పోవాలని, జిల్లా పోలీస్ కళాశాల ప్రిన్సిపల్ జి. రాధిక అన్నారు. శుక్రవారం స్థానిక కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం, సీజీసీ ఎస్‌డీసీ, మహిళ సాధికారక విభాగం, ఇన్‌క్లూజివ్ సెంటర్, ఎస్ఎస్ఎస్-1, 2 విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల భవిషత్ లక్ష్యాలను నిర్ణయించుకొనేలా స్ఫూర్తి కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. మోహనరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఐపీఎస్ జి. రాధిక మాట్లాడుతూ లైంగిక వేధింపులు, సైబర్ నేరాలు, మత్తుమందుల వినియోగం, ఇతర అసాంఘిక కార్యక్రమాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కళాశాలల్లో జరుగుతున్న ర్యాగింగ్ వంటి దుశ్చర్యలు, ఫలితంగా విద్యార్థుల జీవితాలు ఎలా వినాశనమవుతున్నాయో తెలియజేశారు. ప్రతి రోజు జరుగుతున్న కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రానైట్ ఫ్యాక్టరీలో క్రేన్ వైరు తెగి పడి కూలీ మృతి

బల్లికురవ, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఉప్పుమాగులూరు గ్రామ సమీపంలోని గ్రానైట్ ఫ్యాక్టరీలో ప్రమాదవశాత్తు ఎక్స్‌కవేటర్ తీగ తెగి పనులు చేస్తున్న కూలీ రాకేష్‌కుమార్(29) మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు ఉప్పుమాగు లూరు గ్రామ పరిధిలో ఉన్న హర్షిత గ్రానైట్ ఫ్యాక్టరీకి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీర్జాపూర్ జిల్లా చున్నుర్ గ్రామానికి చెందిన రాకేష్‌కుమార్ ఇటీవల ఎక్స్‌కవేటర్ అపరేటర్ పనుల నిమిత్తం వచ్చాడు. రోజు మాదిరిగానే పనులు చేస్తుండగా శుక్రవారం ఉదయం ఒక్కసారిగా ఎక్స్‌కవేటర్ తీగ తెగింది. దీంతో పక్కనే ఉన్న గ్రానైట్ స్లాబు లు కూలీ కాలిపై పడ్డాయి. వెంటనే క్షతగాత్రుడిని వైద్యం కోసం చిలక లూరి పేట వైద్యశాలకు తరలి స్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాద ఘటనపై గ్రామ రెవెన్యూ అధికారి ఆశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలిరెడ్డి ఎత్తిపోతలను త్వరగా పూర్తి చేయాలి



కొరిశపాడు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

మేదరమెట్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): యర్రం చిన్నపోలిరెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం త్వరగా పూర్తి చేయాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని యర్రం చిన్నపోలిరెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన కొరిశపాడు రిజర్వాయర్‌ను సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మోంగ్రు ఆంజనేయులు, సీనియర్ నాయకులు దశరథ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ 2007లో 177 కోట్ల అంచనాలతో ప్రారంభమైన ఎత్తిపోతల పథకం 17 ఏళ్లు పూర్తయినా, ఇప్పటికి పూర్తి కాలేదన్నారు. 12 గ్రామాలలోని భూములకు సాగునీరు అందించే ఈ పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కోరారు. ఈ అసెంబ్లీ సమావేశాలల్లో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి నిధులు మంజూరుచేయించి పనులు పూర్తి చేయించాలని కోరారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం, పునరావాసాన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటి సభ్యులు రవీంద్రబాబు, సుధాకర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● న్యాయవాది టి.అనూషా



న్యాయవాది అనుషాను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళల కోసం ఏర్పాటు చేసిన చట్టాలు, వాటి అమలుపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని, న్యాయవాది టి.అనూషా అన్నారు. శుక్రవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్నేహిత కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయవాది అనుషా పాల్గొని మహిళల కోసం కేటాయించిన చట్టలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల యాజమాన్యం సన్మానించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు, డాక్టర్ ఎస్.షర్మిలారాణి, డి. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ)లకు పే స్కేల్ అమలు చేయాలని ప్రకాశం జిల్లా వీఆర్ఏల సంఘం కార్యదర్శి పాలడుగు వివేకానంద డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వివేకనంద మాట్లాడుతూ నామినీలను వీఆర్ఏలుగా నియమించాలని, అర్హులకు ప్రమోషన్లు, కారుణ్య నియమకాలు వంటి సమస్యలు నేటి పరిష్కారం కాలేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం దశల వారి పోరాటాలకు వీఆర్ఏలు సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీచరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు మర్రిపూడి నరసింహరావు, కార్యదర్శి కనపర్తి స్వాములు, ఎం. ఆదినారాయణ, రుద్రు శ్రీనివాసరావు, జే.నాగేశ్వరరావు, వీరయ్య, కోటేశ్వరరావు, మండలంలోని అన్ని గ్రామాల వీఆర్ఏలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న డాక్యుమెంట్ రైటర్లు

డాక్యుమెంట్ రైటర్లు పెన్‌డౌన్

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో ప్రవేశపెట్టిన 2.0 విధానంలో ప్రజలకు ఎదురౌతున్న సమస్యలను పరిష్కరించాలని డాక్యుమెంట్ రైటర్లు రెండురోజుల పాటు పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా శుక్రవారం స్థానిక జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. దస్తావేజులేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మోపర్తి హరిబాబు మాట్లాడుతూ ఆస్తులు రిజిస్ట్రేషన్ సమయంలో కక్షిదారులు పేర్లు నమోదులో భాగంగా పలు దశల్లో ఓటీపీ నమోదు చేయడం సమస్యగా మారుతుందన్నారు. క్రయవిక్రయదారులు అనారోగ్య కారణాల వల్ల కార్యాలయాలకు రాకపోతే గతంలో వారి ఇంటికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసే అవకాశం ఉండేదని అన్నారు. అయితే ప్రస్తుతం అలాంటి అవకాశం లేక పోవడం వల్ల సమస్యలు వస్తున్నాయని చెప్పారు. ఈ సమస్యలు ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు వీరబ్రహ్మాచారి, కార్యదర్శి నాగేశ్వరరావు, గోపిశెట్టి శ్రీనివాసరావు, బ్రహ్మానందరావు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

● ఎస్పీ హర్షవర్ధనరాజు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. ఒంగోలు నగరంలోని ఒంగోలుతాలుకా, ఒంగోలు వన్‌టౌన్, ఒంగోలు రూరల్ సర్కిల్ ఆఫీసులను ఎస్పీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. పోలీసుస్టేషన్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. పలుకేసులకు సంబంధించి ఏళ్ల తరబడి ఉన్న వాహనాలను అనుమతి తీసుకొని వేలం వేయాలని కోరారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే అల్లరి మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో విజిబుల్ పోలీసింగ్ ఉండేలా చూడాలని కోరారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే ప్రాంతాలపై డ్రోన్‌ల ద్వారా నిఘా పెట్టాలని అన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరించి చట్టపరిధిలో సత్వర న్యాయం అందించాలని, తద్వారా పోలీసుశాఖ ప్రతిష్ఠ పెరుగుతుందని చెప్పారు. ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్ బయిట ఉన్న ఫిర్యాదిదారులతో ఎస్పీ మాట్లాడి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ కే.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఉన్నారు.

ఎన్‌హెచ్‌వీ అప్‌లోడ్ చేయని హెచ్‌ఎంలపై చర్యలు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛహరిత విద్యాలయ(ఎన్‌హెచ్‌వీ) వివరాలు లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయని పాఠశాల ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని పాఠశాల విద్యా గుంటూరు ఆర్‌జేడీ బి.లింగేశ్వరరెడ్డి హెచ్చరించారు. అందుకు సంబంధించి 60 ప్రశ్నలకు సమాధానాలు రాసి వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. శుక్రవారం ఎంఈవోలు, హెచ్‌ఎంలతో నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలకు హాజరవుతూ ఆన్‌లైన్‌లో పేరులేని విద్యార్థుల పేర్లు వెంటనే ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈనెలాఖరుకు హైస్కూళ్లలో ఖాళీల వివరాలు తెలియజేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేసిన విద్యా కిట్లకు పాఠశాలలకు అందజేసిన కిట్ల సంఖ్యలో తేడా ఉంటే సంబంధిత హెచ్‌ఎంలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్‌శాఖలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● జేఏసీ నాయకుల పిలుపు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రపవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు డిమాండ్ చేశారు. గత ఐదు రోజులుగా స్థానిక విద్యుత్ భవన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి రిలేదీక్షలు చేస్తున్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఇలా 21 డిమాండ్ల పరిష్కారం కోసం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్యారంలో రిలే దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ఛైర్మన్ శ్రీహరికృష్ణ, కన్వీనర్ కె.వెంకటరవి, రాఘవరెడ్డి, దుర్గాప్రసాద్, జబ్బార్‌తోపాటు అనేక సంఘాల నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనర్థాలు

మద్దిపాడు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):మత్తు పదార్థాలు వినియోగిస్తే ఆరోగ్యానికి చేటుచేస్తుందని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు అన్నారు. శుక్రవారం వెల్లంపల్లి యాదవ బజార్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా కొత్త వ్యక్తులు గంజాయి వంటి మత్తు పదార్థాలు తీసుకువస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎస్సై సైదులు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

అక్రమాల డొంక కదులుతోంది!

(5వ పేజీ తరువాయి)

తుంగలో తొక్కి.. ప్రతి ఫైలుకు నాకేంటి? అంటూ భారీగా బొక్కేశారు. అలాంటి అవినీతి అధికారులపై పురపాలక శాఖ చర్యలకు సిద్ధమైంది. కాగా ఆయా అక్రమ నిర్మాణాలవైపు ప్రస్తుత కార్పొరేషన్ అధికారులు కన్నెత్తిచూడకపోవడం గమనార్హం.

ఏసీబీ, విజిలెన్స్ తనిఖీలతో వెలుగులోకి..

హైకోర్టు న్యాయవాది డి.ఎస్.బాబు సమాచార హక్కు చట్టం ద్వారా వీటిపై వివరాలు సేకరించి అవినీతి నిరోధక శాఖ, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ రెండు శాఖల అధికారులు సంబంధిత ఫైళ్లను స్వాధీనం చేసుకుని క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభించడంతో అనుమతులు లేని నిర్మాణాలు, తక్కువ చార్జీలు కట్టించుకోవడం, లేబర్ సెస్, ఎల్ఆర్ఎస్ కింద 14శాతం వదిలేయడం వంటి అవినీతి వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో నివేదికను పురపాలక శాఖకు అందజేయడంతో గత కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఏసీపీ వెంకటేశ్వర్లుపై ప్రభుత్వం చర్యలకు సిద్ధమైంది. కార్పొరేషన్‌కు కలిగిన నష్టాన్ని రికవరీ దిశగా నివేదిక తయారు చేయాలని ఆదేశించింది. అయితే అప్పటివరకు కమిషనరు ఎం.వెంకటేశ్వరరావుకు ఉద్యోగంలో పదోన్నతులు ఆపివేయడంతోపాటు, రిటైర్ అయిన ఏసీపీ కె.వెంకటేశ్వర్లుకు రావాల్సిన బెనిఫిట్స్ నిలిపివేయాలని ఆదేశించినట్లు సమాచారం.

మెడికల్ కాలేజీ పూర్తికి వేగంగా అడుగులు

(5వ పేజీ తరువాయి)

స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రూ.8కోట్లు కేటాయించి ఇప్పటికే ఉన్న 150 పడకలకు తోడు మరో 300 పడకలను తాత్కాలిక పద్ధతిలో నిర్మాణం చేశారు. ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మండలంలోని రాయవరం వద్ద ఉన్న మెడికల్ కాలేజీ నిర్మాణాలను పూర్తిచేసినా ప్రస్తుతానికి వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించుకోవచ్చు. ఈలోగా పట్టణంలోని వైద్యశాలలో ఓపీ సేవలు నిర్వహించుకోవచ్చు. గతంలో ఓపీ సేవలు సక్రమంగా లేకపోవడంతోనే నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు 2024 జూన్‌లో పరిశీలించి అడ్మిషన్‌లకు అనుమతులు ఇవ్వలేదు.

మహిళను హింసించిన కేసులో నలుగురు అరెస్టు

(5వ పేజీ తరువాయి)

పిల్లలను పోషిస్తోంది. ఈతరుణంలో ఈనెల 13వ తేదీ రాత్రి 9.30 సమయంలో భర్త బాలాజీతోపాటు పైముగ్గురు నిందితులు.. ఇంటికెళుతున్న భాగ్యలక్ష్మిని ఆపి రమణమ్మ ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం బాలాజీ భాగ్యలక్ష్మి చేతులు కట్టేసి బెల్ట్‌తో కొడుతూ చిత్రహింసలు గురిచేశారు. అంతటితో ఆగకుండా కత్తితో పొడి చంపుతానని బెదిరించారు. 14వ తేదీ ఉదయం 5.30 గంటలకు భాగ్యలక్ష్మిని ఆమె ఇంటివద్ద వదిలి నిందితులు వెళ్లిపోయారు. మరలా తిరిగి 15వ తేదీ సాయంత్రం బాలాజీ బెదిరించడంతో భయాందోళనకు గురైన భాగ్యలక్ష్మి ఇంటినుంచి వెళ్లిపోయి తర్లుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సీఐ చెప్పారు. వారి వద్ద నుంచి లెదర్‌బెల్ట్, కత్తి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయాధికారి 14 రోజులు రిమాండ్ విధించినట్లు చెప్పారు. దర్శి డీఎస్పీ ఆధ్వర్యంలో పొదిలి సీఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కేసును త్వరగా ఛేదించినందుకు ఎస్ఐ బ్రహ్మనాయుడిని, సిబ్బందిని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రత్యేకంగా అభినందించారు.

వచ్చే ఏడాది ఆగస్టుకు వెలిగొండ నీరు

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. అనంతరం అధికారులు ఏర్పాటు చేసిన వాహనంలో కలెక్టర్ బృందం 2వ సొరంగం అంతర్భాగం లోపలికి వెళ్లి వచ్చారు. తదనంతరం గంటవానిపల్లె చెరువు సమీపంలో ఫీడర్ కెనాల్‌పై నిర్మిస్తున్న బ్రిడ్జిని పరిశీలించారు. అదే క్రమంలో గంటవానిపల్లె గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి తీగలేరు వాగును దాటాల్సిన క్రమంలో వరదనీరు వచ్చినప్పుడు రాకపోకలు నిలిచిపోతాయని ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అక్కడ వాగును పరిశీలించారు. అనంతరం వెలిగొండ విశ్రాంతి భవనంలో విలేకరులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణం దాదాపు పూర్తయిందన్నారు. మొదటి సొరంగం 95శాతం, రెండో సొరంగంలో 25 శాతం లైనింగ్ పనులతో పాటు సాంకేతిక కారణాలతో కొంత జాప్యం జరిగిందని చెప్పారు. ప్రభుత్వం ప్రాజెక్టు పూర్తిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మొదటి దశలో భాగంగా 15లక్షల మంది ప్రజలకు తాగునీరు, 1.90లక్షల ఎకరాలకు సాగునీరందించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 21 కిలోమీటర్ల పొడవున్న ఫీడర్ కెనాల్ పెండింగ్ పనులకుగాను రూ.460కోట్లతో అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. త్వరలోనే పెండింగ్ పనులన్నీ ప్రారంభించడంతో పాటు నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, పునరావాసం ఏర్పాట్లు కూడా చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ త్రివినాగ్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ, సీతారామిరెడ్డి, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఉన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్ఈ సలీమ్, తహసీల్దారు అశోక్ కుమార్‌రెడ్డి, ఎంపీడీవో నాసర్‌రెడ్డి, ప్రాజెక్టు మెగా ప్రతినిధి ఇన్‌చార్జి సతీష్‌బాబు, టీడీపీ నాయకులు సొసైటీ అధ్యక్షుడు బట్టు సుధాకర్ రెడ్డి, షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, కే సుబ్బారెడ్డి, జనసేన నేత మురళి పాల్గొన్నారు.

నేడు క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ రంగ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శనివారం క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎం.కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థులకు మధ్యాహ్నం 11.45 గంటలలోపు మధ్యాహ్న భోజనం అందించి పాఠశాల హెచ్ఎం, టీచర్లందరూ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరు కావాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. మధ్యాహ్నం ఒంటి గంటలోపు ఉపాధ్యాయులందరూ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరైనట్లు ముఖహాజరు వేయాలి. సమావేశాలు సాయంత్రం ఐదు గంటల వరకు జరగనున్నాయి. కాంప్లెక్స్ సమావేశం నిర్వహణలో ఇచ్చిన షెడ్యూల్ పాటించాలని ఆ ఉత్తర్వుల్లో అదేశించారు. వందశాతం మంది టీచర్లు సమావేశాలకు హాజరు కావాలన్నారు. సమావేశం ముగింపులో సాయంత్రం 4.45 గంటల నుంచి 5 గంటల మధ్యలో నోడల్ ఆఫీసర్/ పరిశీలకులు ఫీడ్‌బ్యాక్ ఫారాన్ని పూరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. క్లస్టర్ కాంప్లెక్స్ కేంద్రాల్లో ప్రధానోపాధ్యాయులు డిజిటల్ పరికరాలు, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలి. కాంప్లెక్స్ సమావేశాల్లో అకడమిక్ కార్యక్రమాలు మినహా ఇతర ఎటువంటి కార్యక్రమాలూ నిర్వహించకూడదన్నారు.

అక్టోబరు10లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు విద్య, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు వచ్చేనెల 10వతేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాధికారి కే అంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న జనరల్, ఒకేషనల్ విద్యార్థులు ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు మళ్లీ పరీక్షకు హాజరయ్యేందుకు ఫీజు చెల్లించాలన్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు, ఒకేషనల్ విద్యార్థులు రూ.600 పరీక్ష ఫీజు చెల్లించాలి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ సైన్స్ విద్యార్థులు, ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రాక్టికల్ ఫీజు రూ.275 చెల్లించాలి. జనరల్/ఒకేషనల్ విద్యార్థులు బ్రిడ్జి కోర్సు సబ్జెక్టులకు (బైపీసీ విద్యార్థులు), గణితం పరీక్ష రాసేందుకు రూ.165, ఒకేషనల్ కోర్సు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు రూ.275 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు ఒకేసారి హాజరయ్యే జనరల్/ఒకేషనల్ విద్యార్థులు రూ.1200, ప్రాక్టికల్ పరీక్షలకు రూ.550, బ్రిడ్జికోర్సు పరీక్షలకు రూ.330 చెల్లించాలి. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు ఉత్తీర్ణులై మళ్లీ పరీక్షకు హాజరయ్యే ఆర్ట్స్ విద్యార్థులు రూ.1,350, సైన్స్ విద్యార్థులు రూ.1,600 ఫీజు చెల్లించాలి. ఎటువంటి ఆపరాధ రుసుం లేకుండా విద్యార్థులు వచ్చేనెల 10 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలి. రూ.వెయ్యి అపరాధ రుసుంతో అక్టోబరు 11 నుంచి 21 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని ఆంజనేయులు తెలిపారు.

మత్స్యకారుల లబ్ధి కోసం చర్యలు



మత్స్యకారులకు పలు రకాల యూనిట్లను అందించేందుకు కమిటీ సభ్యులు, ఏజెన్సీల ప్రతినిధులతో సమావేశమైన జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సముద్రతీర ప్రాంత మత్స్యకారులకు పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా తెప్పలు, ఇంజన్లు, వలలు సరఫరా, సీఆర్‌సీవై పథకం ద్వారా కొత్తపట్నం పల్లెపాలెం మత్స్యకారులకు లైఫ్ జాకెట్స్, సీజీఎస్ సెట్స్, ఫస్ట్ ఎయిడ్ కిట్లను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో శుక్రవారం డిస్ట్రిక్ పర్చేజ్ కమిటీ ఛైర్మన్, జేసీ గోపాలకృష్ణ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మెంబర్ కన్వీనర్, జిల్లా మత్స్యశాఖ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, సభ్యులైన జిల్లా ఇండస్ట్రీస్ అధికారి శ్రీనివాసరావు, మార్కెటింగ్ శాఖ ఏడీ ఎం.వరలక్ష్మీ, జిల్లా మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు జీ పేరయ్య, దేశీయ తెప్పల తరుపున కే తిరుపతిరావు, ఇంజన్ తెప్పల ప్రతినిధి ఎం.జక్రయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా పీఎంఎంజేఎస్‌వై, సీఆర్‌సీఎఫ్‌వి పథకాల ద్వారా ఆయా యూనిట్లను అందించేందుకు కమిటీ సభ్యుల సమక్షంలో వాటి ధరలను నిర్ణయించారు. కమిటీ నిర్ణయించిన ధరలకు మత్స్యకారులకు ఆయా యూనిట్లను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఏజెన్సీల ప్రతినిధులను జేసీ గోపాలకృష్ణ అదేశించారు.

బస్సు వెళ్లని పల్లెలు.. ఏళ్ల తరబడి వెతలు



విశ్వనాథపురం వెళ్లే రోడ్డు

● రోడ్లున్నా రాని ఆర్టీసీ బస్సు ● ఆదాయం కోసం చూస్తున్న అధికారులు

కొద్దిరోజుల క్రితం ఎర్రగొండపాలెం మండలంలోని తమ్మడపల్లెకు బస్సు కావాలని ప్రజల విజ్ఞప్తి మేరకు టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు చొరవతో ఆర్టీసీ అధికారులు ఆ గ్రామానికి రెండు ట్రిప్పులు ఆర్టీసీ సర్వీసు నడిచేలా ఏర్పాటు చేశారు. పాతికేళ్లుగా తమ కల నెరవేరిందని ఆ సమయంలో గ్రామ ప్రజల ఆనందానికి అవధులు లేవు. అక్కడి విద్యార్థులు సంతోషంతో కేరింతలు కొట్టారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో నేటికీ ఎర్ర బస్సు ఎరుగని గ్రామాలు ఉన్నాయి. కొన్ని గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోగా, రహదారి బాగానే ఉన్న గ్రామాలకు కూడా బస్సులు వెళ్లని పరిస్థితి. దీనికి ఆర్టీసీ అధికారులు పలు సమస్యలు చెబుతుంటారు. వారి రూట్లకు తగిన ఆదాయ వనరులు లేకపోవటం తదితర కారణాలతో బస్సులు నడపలేకపోతున్నామని చెబుతున్నారు. కానీ గతంలో బస్సులు తిప్పిన కొన్ని గ్రామాలకు కూడా ఇప్పుడు నిలిపివేశారని ప్రజలు చెబుతున్నారు.

త్రిపురాంతకం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): త్రిపురాంతకం మండలంలోనే ఎక్కువగా ఈ సమస్య ఉంది. ఇక్కడ ప్రధానరోడ్డు ఎక్కువ భాగం నేషనల్ హైవే వెళుతుంది. హనుమాన్ జంక్షన్ వద్ద నుంచి వినుకొండ పట్టణం సరిహద్దు వరకు మండల సరిహద్దు మొత్తం హైవే ఉంది. ఈ హైవేపై వెళ్లే గ్రామాలకు తప్ప పక్కన ఉన్న పల్లెలకు బస్సు సౌకర్యం లేదు. ముఖ్యంగా హైవే నుంచి కిలోమీటరులోపు ఉన్న గ్రామాలకు పెద్దగా ఇబ్బంది లేకున్నా మిగిలిన వాటిలో నడిగడ్డ, హస్సానాపురం, విశ్వనాథపురం, లేళ్లపల్లి, దువ్వలి, సోమేపల్లి, సంఘం తాండా, అన్న సముద్రం లాంటి గ్రామాల ప్రజలకు బస్సు సౌకర్యం కావాలని ప్రజలు ఏళ్ల తరబడి కోరుతున్నారు. ఈ గ్రామాలకు వెళ్లాలంటే కాళ్లనడకన వెళ్లే వారు కొందరైతే ఆటోలు ఇతర వాహనాలపై ఆధారపడి వెళుతున్న వారు కొందరున్నారు. వీటిలో కొన్ని గ్రామాలకు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి రోడ్డు నిర్మిస్తున్నారు కానీ బస్సు తిరిగే పరిస్థితి మాత్రం కనిపించటం లేదు. రోడ్లు కూడా లేని గ్రామాల ప్రజల పరిస్థితి ఒకటైతే రోడ్లు ఉన్నా బస్సు రాని గ్రామాల ప్రజల సమస్య మరొకటి.



లేళ్లపల్లి వెళ్లేందుకు ఉన్న రోడ్డు

ఎర్రగొండపాలెం మండలంలోని కొన్నిగ్రామాలది కూడా ఇదే పరిస్థితి. తాండాలు, గిరిజన గూడేలకు మరీ దారుణం. ముఖ్యంగా పాలుట్ల గిరిజనగూడెం ప్రజలకు కనీసం రవాణా సౌకర్యం కూడా లేదు. ఇక్కడకు వెళ్లేందుకు ప్రైవేటు వాహనాలు కమాండర్లు, జీపులను మాట్లాడుకుని బాడుగకు వెళ్లే పరిస్థితి. ప్రస్తుతం ఈ గిరిజన గూడేలలో ప్రధాన మంత్రి జన్‌మన్ పథకం ద్వారా మౌలిక వసతులు ఇళ్ల నిర్మాణం జరుగుతుండగా వాటికి అవసరమైన సామగ్రి తరలించేందుకు కూడా రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని అధికారులు వాపోతున్నారు. పుల్లలచెరువు మండలంలోని గంగవరం గ్రామానికి ఎన్నో ఏళ్లుగా కనీసం రోడ్డు వేయాలనే ఆలోచన కూడా పాలకులకు రావటం లేదు. మండల కేంద్రానికి దగ్గరగా ఉన్న గ్రామానికి బస్సు కావాలని వారి వేదన అరణ్యరోదనగానే మిగిలిపోయింది. సి.కొత్తపల్లి, చెన్నంపల్లి, ఇతర గిరిజన గూడేలకు, తాండాలకు బస్సు సౌకర్యం లేదు. ప్రధానరోడ్డుపై దిగి నడిచే వెళ్లాల్సిన పరిస్థితులే నేటికీ నడుస్తున్నాయి. పెద్దారవీడు మండలంలో రోడ్లు ఉన్నా బస్సులు నడవని పల్లెలకు బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని కల్రేల, తంగిరాలపల్లి, తమ్మడపల్లి, చాట్లమడ అగ్రహారం, మాసిరాజుకుంట, శివాపురం, రాజంపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.దోర్నాల మండలంలో కూడా ఎక్కువగా గిరిజన గ్రామాలకు రవాణా సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు సౌకర్యం ఉండీ బస్సు నడపని చోట్లకు బస్సులు కావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల విజ్ఞప్తిని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ప్రస్తుతానికి కొన్నేళ్లుగా తిరుగుతున్న అన్ని రూట్లకు యథావిధిగా బస్సులు నడుపుతున్నాం. బస్సులు తిరిగేందుకు అనువుగా ఉండి ప్రజలు తమకు బస్సు కావాలని కోరుతున్న చోట నుంచి వచ్చిన విజ్ఞప్తులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి అనుమతి మేరకు నిర్ణయం తీసుకుంటాం.

- నరసింహులు, మార్కాపురం ఆర్టీసీ డీఎం

పాకల, పాతసింగరాయకొండలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతాం

● నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి రూ. 7కోట్ల ప్రతిపాదనలు ● టూరిజం బోర్డు ఛైర్మన్ నూకసాని

సింగరాయకొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, పాకల బీచ్‌లను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర టూరిజం బోర్డు ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పాతసింగరాయకొండ దేవస్థానం, పాకల బీచ్‌ను టూరిజం అధికారులతో కలసి ఆయన సందర్శించారు. తొలుత శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై టూరిజం అధికారులతో చర్చించారు. యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి తూర్పువైపున మెట్లు, ఆర్చీ, ప్రకారం నిర్మాణం, పుష్కరిణి భవనాసి అభివృద్ధి, దేవస్థాన నూతన కార్యాలయం, పార్కు నిర్మాణానికి అంచనాలు తయారుచేయాలని బాలాజీ అధికారులకు సూచించారు. అతి పురాతనమైన వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి దాదాపు రూ.7కోట్ల ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆయన పాకల తీరంలో పర్యటించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆగినపోయిన టూరిజం రెస్టారెంట్‌ను పరిశీలించారు. తీరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గ్రామస్థులతో చర్చించారు. తదనంతరం మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని పూర్తిగా సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ అలివిమాలిన నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం పాకలలోని టూరిజం రెస్టారెంట్ అని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పాకల బీచ్‌లో రూ.5 కోట్ల టూరిజం రెస్టారెంట్ నిర్మాణానికి అప్పటి టీడీపీ ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి నిధులు మంజూరు చేయించినట్లు గుర్తుచేశారు. పనులు ప్రారంభించి అందులో రూ.2కోట్లపైగా పనులు పూర్తిచేశారన్నారు. పాకల తీరంలో పర్యాటకరంగాన్ని అభివృద్ధిచేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని బాలాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మించల బ్రహ్మయ్య, పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు జిల్లా అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు, నేతలు గాలి హరిబాబు, మించల బహ్మయ్య, నక్కా బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.



పాకల తీరంలో ఆగిపోయిన టూరిజం రెస్టారెంట్‌ను పరిశీలిస్తున్న ఛైర్మన్ నూకసాని

చికిత్స పొందుతూ భర్త మృతి

● భార్యను హతమార్చి తానూ గొంతుకోసుకున్న వైనం



నారాయణ (ఫైల్)

మద్దిపాడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేగలగడ్డలో అనుమానం పెనుభూతమై ఈనెల 13న భార్యను హత్యచేసి ఆపైతానూ గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన భర్త నారాయణ (50) గత వారం రోజులుగా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. భార్య జయమ్మపై అనుమానం పెంచుకున్న భర్త వెంకటనారాయణ నిద్రిస్తున్న భార్యను రోకలి బండతో చితకబాది హతమార్చాడు. తాను కూడా బతకూడదని నిర్ణయించుకొని గొంతుకోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మెరుగైన చికిత్సకోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నారాయణ మృతి చెందినట్లు ఎస్‌ఐ టి.రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. 25 ఏళ్ల క్రితం మద్దిపాడుకి చెందిన జయమ్మతో నారాయణకు వివాహం అయ్యింది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. నాలుగు నెలల క్రితం చిన్న కుమార్తెకు వివాహం చేశారు. అనంతరం భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భార్యను హత్యచేసి తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

269 మద్యం బాటిళ్లు ధ్వంసం

సింగరాయకొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో శుక్రవారం 17 కేసుల్లో పట్టుబడిన 269 క్వార్టర్ మద్యం బాటిళ్లను మధ్యవర్తుల సమక్షంలో ఎక్సైజ్ సిబ్బంది ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ అయేషాబేగం మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



మద్యం బాటిళ్లలోని మద్యాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

నేరనియంత్రణకు పటిష్ట చర్యలు

● ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ● సింగరాయకొండ, టంగుటూరు పోలీస్‌స్టేషన్లలో ఆకస్మిక తనిఖీ

సింగరాయకొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యాకాలాపాల కట్టడికి, నేరనియంత్రణకు, రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు సూచించారు. శుక్రవారం సింగరాయకొండ పోలీస్‌స్టేషన్, సర్కిల్‌కార్యాలయం, టంగుటూరు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను, గదులను పరిశీలించారు. నేరాల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులకు పలు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. సింగరాయకొండలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని, జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్ ముమ్మరంచేసి దొంగతనాలు జరగకుండా అరికట్టాలన్నారు. ప్రజా ఫిర్యాదులను జాప్యం లేకుండా తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం సింగరాయకొండ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మామిడి మొక్కను నాటారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఎస్‌బీ సీఐ రాఘవేంద్ర, సీఐ చావా హజరత్తయ్య, ఎస్సైలు బి. మహేంద్ర, నాగమల్లేశ్వరరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

టంగుటూరు పోలీసులపై ఎస్పీ అసంతృప్తి



టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శుక్రవారం తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు వేగంగా అమలు, నేరాలు, ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు ఉన్నారు.

భారీ వర్షంతో పొంగిన వాగులు

● 39.6 మి.మీ. వర్షపాతం నమోదు

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి వాగులు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని వీరయపాలెం - ఎర్రగొండపాలెం వైపు వచ్చే ముట్ల వాగు పొంగి పొర్లింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా వాగు వచ్చిందని వీరయపాలెం ప్రజలు చెబుతున్నారు. ఈ వాగు పొంగటం వలన రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే వీరభద్రాపురం, గంజివారిపల్లి గ్రామాలలో భారీ వర్షం కురిసింది. మండలం మొత్తం 39.6 ఎంఎం వర్షపాతం నమోదు అయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.



వీరయపాలెం వద్ద పొంగుతున్న ముట్లవాగు

వర్షానికి కూలిన మట్టి మిద్దె కప్పు

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెంలో కురిసిన వర్షానికి ఆసీఫ్‌నగర్‌లో లక్ష్మిశెట్టి వీరాంజనేయులు చెందిన మట్టి మిద్దె కప్పు కూలిపోయింది. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని ఇంటి యజమాని తెలిపారు.వీఆర్వో దానం, సర్వేయరు, కూటమి నాయకులు చేదూరి కిశోర్, రమేష్, ఇస్మాయిల్‌లు కూలిన మట్టి మిద్దెను పరిశీలించారు.

వీఆర్‌వో ఇంట్లో చోరీ

● 11 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు అపహరణ

● తీర్థయాత్రలకు వెళ్లగా ఇంటికి కన్నం వేసిన దొంగలు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బంధువులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లిన వీఆర్‌వో ఇంట్లో దొంగలు పడ్డారు. ఇంట్లో ఉన్న బీరువాను పగులగొట్టి అందులో గల 11 తులాల బంగారం, రూ.2 లక్షల నగదును దోచుకెళ్లారు. అందిన సమాచారం మేరకు... గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని కొండపేట గ్రామంలో నివాసం ఉంటున్న వీఆర్‌వో లక్ష్మీ అర్బన్‌కాలనీలోని సచివాలయంలో పనిచేస్తున్నారు. కొండపేట గ్రామంలో నివాసం ఉంటున్న లక్ష్మీ తన బంధువులతో కలిసి 2 రోజుల క్రితం అరుణాచలం, చెన్నై తదితర ప్రాంతాలకు తీర్థయాత్రకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన దొంగలు గురువారం అర్ధరాత్రి ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలోని 11 తులాల బంగారం, రూ.2లక్షల నగదును అపహరించుకెళ్లారు. శుక్రవారం సమీపంలో ఉన్న లక్ష్మీ తల్లి రంగలక్ష్మమ్మ ఇంటి దగ్గరకు వచ్చి చూడగా తలుపు తెరచి ఉండడం గమనించి వస్తువులన్నీ చల్లాచెదురుగా పడిఉండడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. గిద్దలూరు అర్బన్ సీఐ కె.సురేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



చల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

చలో మెడికల్ కాలేజీకి అరకొర స్పందన

మార్కాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా మధ్యలో నిలిచిపోయిన మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ పార్టీ ప్రభుత్వమే మెడికల్ కాలేజీలను పూర్తి చేయాలని కోరుతూ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీల వద్ద ఆందోళన కార్యక్రమాలను నిర్వహించింది. ఈ క్రమంలో ప్రకాశం జిల్లా మార్కాపురంలోని మెడికల్ కాలేజీ వద్ద నిర్వహించిన ఆందోళన కార్యక్రమానికి స్పందన కరవైంది. ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరుకావాలని వైఎస్సార్ పార్టీ పిలుపునిచ్చింది. కేవలం మార్కాపురం నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి తప్పితే రెండు జిల్లాల వ్యాప్తంగా పెద్దగా కార్యకర్తలు హాజరుకాలేదు. నెల్లూరు జిల్లా నుంచి కనీసం నాయకులు కూడా హాజరు కాకపోవడం విశేషం. ప్రకాశం జిల్లాలోని దర్శి, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్, జిల్లా పరిషత్తు ఛైర్మన్ వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యేలు, అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, మండలస్థాయి ముఖ్య నాయకులు మాత్రమే అగ్రనేతల వద్ద మార్కుల కోసం అలా వచ్చి ఇలా వెళ్లారు. మెడికల్ కాలేజీని పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నా కేవలం వైసీపీ రాజకీయ లబ్ధి కోసమే ఆందోళన చేస్తున్నట్లు గుర్తించే పెద్దగా ఆ పార్టీకి చెందిన వాళ్లు హాజరుకానట్లు తెలుస్తోంది.



పలుచగా హాజరైన వైసీపీ కార్యకర్తలు

30 యాక్ట్ ఉల్లంఘించిన వైసీపీ నాయకులపై కేసు

మార్కాపురం రూరల్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం ప్రాంతంలో పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉందని పోలీసులు సమాచారం ఇచ్చినప్పటికీ వారి ఆదేశాలను లెక్కచేయకుండా మెడికల్ కళాశాలలోకి వైసీపీ నాయకులు వేలాదిగా దూసుకెళ్లారు. మెడికల్ కాలేజి వద్ద జాతీయ రహదారిపై వేలాది మంది కార్యకర్తలు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల భవనాలపైకి ఎక్కి వైసీపీ జెండాలను ఊపుతూ పై అంతస్థు భవనంపై కట్టారు. చలో మెడికల్ కాలేజీ కార్యక్రమానికి నాయకత్వం వహించిన 20 మంది వైసీపీ నాయకులపై 30 యాక్ట్ ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు మార్కాపురం రూరల్ ఎస్ఐ అంకమ్మరావు తెలిపారు.



ఎరువులు పంపిణీ చేస్తున్న చైర్మన్ పూనాటి వెంకట్రావు

రైతులకు సరిపడా ఎరువులు

చీమకుర్తి,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): రైతులందరికి సరిపడా ఎరువులను అందిస్తామని, ఎటువంటి ఆందోళన చెందవద్దని చీమకుర్తి విశాలపరపతి సహకార సంఘం చైర్మన్ పూనాటి వెంకట్రావు తెలిపారు.చీమకుర్తి సొసైటీ పరిధిలోని 18 గ్రామాలకు చెందిన రైతులకు యూరియా,డీఏపీ తదితర కాంప్లెక్స్ ఎరువుల పంపిణీ కార్యక్రమానికి శుక్రవారం ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటకాలం పూర్తయ్యే వరకూ రైతులకు ఎరువులు ప్రభుత్వం నిర్ధేశించిన రేట్లకు సొసైటీలో అందుబాటులో ఉంచేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, సొసైటీ డైరెక్టర్లు యానం వెంకటేశ్వర్లు,క్రిస్టిపాటి బాలబ్రహ్మారెడి తదితరులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ రణభేరిలో పాల్గొన్న ఉపాధ్యాయులు

విద్యారంగ సమస్యలతో టీచర్లు సతమతం

ఒంగోలు విద్య, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : టీచర్లు విద్యారంగ సమస్యలతో సతమతం అవుతున్నారని యూటీఎఫ్ రాష్ట్రగౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. రాష్ట్రశాఖపిలుపు మేరకు నిర్వహిస్తున్న రణభేరి బైకు జాతా శుక్రవారం సాయంత్రం ఒంగోలుకు చేరింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై అధ్యక్షత వహించగా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వీరాంజనేయు లు, నాయకులు ఎస్. రవి, ఉమామహేశ్వరి, చిన్నస్వామి, సంధ్యారాణి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

చీమకుర్తిలో బైక్ ర్యాలీ

చీమకుర్తి : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రణభేరి శుక్రవారం చీమకుర్తి పట్టణంలో నిర్వహించారు. బైక్ ర్యాలీకి చీమకుర్తిలో ఘన స్వాగతం పలికారు. నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు,షేక్ సిలార్, శ్రీనివాసరావు,బొందెల అంజనేయులు, జీవీ,పర్వతం వెంకటేశ్వర్లు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ పోటీల్లో క్రీడాకారుల సత్తా

పొన్నలూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండల స్థాయి ఆటల పోటీలను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. వాలీబాల్ అండర్-14 బాలుర విభాగంలో చెరువుకొమ్ముపాలెం జట్టుపై పొన్నలూరు ఉన్నత పాఠశాల జట్టు విజయం సాధించింది. వాలీబాల్ అండర్-17 బాలుర విభాగంలో చెరువుకొమ్ముపాలెం పాఠశాల జట్టుపై పొన్నలూరు జడ్పీ హైస్కూల్ జట్టు గెలుపొందింది. కబడ్డీ అండర్-14 బాలికల విభాగంలో ముళ్లమూరివారిపాలెం జట్టుపై పొన్నలూరు జట్టు విజయం సాధించింది. కబడ్డీ అండర్-17 బాలికల విభాగంలో ముళ్లమూరివారిపాలెంపై పొన్నలూరు హైస్కూల్ జట్టు గెలుపొందింది. యోగా అండర్-14 బాలుర విభాగంలో చెరువుకొమ్ముపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులైన ఎం.గౌతమ్, వి.వి.బాలశశి, షణ్ముఖ, పి.శశి, ఎస్.అభిలాష విజేతలుగా నిలిచారు. ప్రారంభ సభలో టీడీపీ మండల నాయకుడు మండవ మురళీమోహన్ మాట్లాడుతూ ఈ పోటీలు విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాల మెరుగునకు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బెజవాడ వెంకటేశ్వర్లు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వై.వెంకటేశ్వరావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాద్, పల్లపోతు రమేష్‌బాబు, కొమ్మి వెంకట్రావు, నేలపాటి బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పొన్నలూరు హైస్కూల్ మైదానంలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

కె.ఉప్పలపాడులో..

కొండపి : స్కూల్ గేమ్స్ మండల స్థాయి ఆటల పోటీలు కె.ఉప్పలపాడు జడ్పీస్కూల్ ప్లస్ ఆవరణలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, బ్యాడ్మింటన్, యోగాతోపాటు అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. మండలంలోని ఏడు జడ్పీస్కూళ్లు నాలుగు ప్రైవేటు పాఠశాలల నుంచి దాదాపు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని డివిజన్‌స్థాయి పోటీలకు పంపుతామని మండల కోఆర్డినేటర్ జంషీర్ అబ్దుల్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.సురేఖ, పి.రామారావు, కె.ఉప్పలపాడు జడ్పీస్కూల్ హెచ్‌ఎం వి.సుసన్నకుమార్, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ఎస్.రాఘవేంద్రశర్మ పర్యవేక్షించారు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ఇన్‌చార్జి డీపీవో వెంకటేశ్వరరావు హెచ్చరిక

మర్రిపూడి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ విషయంలో పంచాయతీ కార్యదర్శులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి డీపీవో ఎం.వెంకటేశ్వరావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కెల్లంపల్లిలో పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు.

ఈనేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు తడి,పొడి చెత్తను వేరు చేయాలని కోరారు. క్లాప్ మిత్రలు గ్రామంలో ప్రతి రోజూ చెత్తను సేకరించి సంపద సృష్టి కేంద్రాలకు తరలించాలన్నారు. ఎస్సీకాలనీ, లోతట్టు ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆయన జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సందర్శించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వామిత్వ సర్వే బృందాన్ని అడిగి వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జగదీష్, డిప్యూటీ ఎంపీడీవో నాగూర్‌వలి, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.



కెల్లంపల్లిలో ప్రజలకు పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి డీపీవో వెంకటేశ్వరరావు

మద్యం వ్యర్థాల తొలగింపు

కొండపి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కొండపిలోని పలు రోడ్ల కూడళ్లు, పొలాల్లో మద్యం ప్రియులు తాగి పడేసిన వ్యర్థాలను పంచాయతీ సిబ్బంది, స్థానికులతో కలిసి కొండపి పోలీసులు శుక్రవారం తొలగింపజేశారు. మందుబాబులు సీసాలు, వాటర్ బాటిళ్లు, ఆహార ప్యాకెట్లను ఎక్కడపడితే అక్కడ వేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై బి.ప్రేమ్‌కుమార్ హెచ్చరించారు. తొలగింపు కార్యక్రమాన్ని ఏఎస్సై అంకారావు పర్యవేక్షించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పొన్నలూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. స్వస్థనారీ - సశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన స్థానిక పీహెచ్‌సీని పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అనంతరం భోగనంపాడు గ్రామంలో జరుగుతున్న ఫీవర్ సర్వేను పరిశీలించారు.

డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

సంతనూతలపాడు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు మండల డాక్యుమెంట్ రైటర్లు శుక్రవారం పెన్‌డౌన్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆధార్‌లింకుకు సంబంధించి ఓటీపీ సమస్యతో ఇబ్బందిగా ఉందని, ప్రభుత్వం ఈవిధానాన్ని నిరసిస్తూ డాక్యుమెంట్ రైటర్లు పెన్‌డౌన్ చేపట్టారు.

కొండపిలో వర్షం

కొండపి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కొండపి ప్రాంతంలో వరుసగా మూడోరోజైన శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. పెనుగాలులు వీయడంతో కొండపి, జరుగుమల్లి మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షంలోనే విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు.



వివాదాస్పద డెయిరీ భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

వివాదాస్పద డెయిరీ భూముల పరిశీలన

సంతనూతలపాడు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేర్నమిట్ట సమీపంలోని పాలకేంద్రం వద్ద వివాదాస్పదమైన డెయిరీభూములను శుక్రవారం సంతనూతలపాడు తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, మండల సర్వేరు రాజేష్‌లు పరిశీలించారు. 13/1బీలో ఎకరా భూమిని ఐదుగురు వ్యక్తులు కొనుగోలు ద్వారా రిజిస్ట్రేషన్ పొందారు. కాగా ఇవి డెయిరీ భూములని, నిర్వాహకులు అడ్డుపడటంతో భూములను కొనుగోలు చేసిన వ్యక్తులు కోర్టుకు వెళ్లారు. కోర్టు కేసు నేపథ్యంలో మండల రెవెన్యూ అధికారుల బృందం ఆ భూములను పరిశీలించింది.

పోషణ మాసోత్సవ వేడుకలు

మండలంలోని ఎండ్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవ వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా అంగనవాడీ సూపర్వైజరు సావిత్రి గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. అదేవిధంగా చిలకపాడు హైస్కూల్లోనూ సూపర్వైజరు లక్ష్మీబాయ్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు జరిగాయి. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో, ఐసీడీఎస్ అధికారులు

చిరుధాన్యాలతో ఆరోగ్యం

కొండపి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చిరుధాన్యాలను తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చని సీడీపీవో బి.సుశీలాదేవి అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా స్థానిక కామేపల్లి రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, గర్భిణులు, కిశోర బాలికలకు పోషకాహారంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొండపి వైస్ సర్పంచ్ కూనంనేని వాసంతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉన్నం రామ్మోహన్ రావు, సూపర్‌వైజర్ విక్టోరియారాణి, అంగన్‌వాడీ కార్యకర్త రాయపాటి నిర్మల పాల్గొన్నారు.

ఈ వేస్ట్ సేకరణలో ఒంగోలు కార్పొరేషన్‌కు ప్రశంస

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో ఒంగోలు కార్పొరేషన్‌కు ప్రత్యేక గుర్తింపు, ప్రశంస లభించాయి. ప్రతి 3వ శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ (ఈవేస్ట్)ను ఒంగోలులో అత్యధికంగా 6.42 టన్నులు సేకరించడం పట్ల ప్రభుత్వం ప్రత్యేకంగా అభినందించింది. ఈ మేరకు శనివారం మాచర్లలో జరిగే ఎస్ఏఎస్ఏ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననుండగా, ఆ కార్యక్రమంలో నగర కమిషనరు కే. వెంకటేశ్వరరావును ముఖ్యమంత్రి స్వయంగా సన్మానించి, అభినందించనున్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కొద్దిపాటి వర్షానికే ఒంగోలు నగరం జలమయం అవుతోందని, అందువల్ల డ్రైనేజీ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం ఒంగోలు నగరకార్యదర్శి చీకటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గురువారం ఉదయం 8గంటల నుంచి 9 గంటల మధ్య కేవలం గంట పాటు కురిసిన వర్షానికి సరైన డ్రైనేజీ వ్యవస్థ లేని కారణంగా కర్నూలు రోడ్డు, భాగ్యనగర్, మార్కెట్ సెంటర్, కొత్తపట్నం బస్టాండు తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారులు ముంపునకు గురికావడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. వర్షపునీరు, మురుగునీరు బయటకు వెళ్లే సరైన కాలువలు లేని కారణంగానే ఈపరిస్థితి ఏర్పడిందన్నారు. అందువల్ల ఒంగోలు నగరంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి):ఒంగోలు నగరం కొప్పోలు గ్రామంలోని రాధాకృష్ణ మెమోరియల్ మేనేజ్‌మెంట్‌పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పాలకేంద్రం అధ్యక్షుడు కాట్రగడ్డ నాగేశ్వరరావు స్టడీమెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మనవడు కాట్రగడ్డ హర్షత్ పుట్టినరోజు సందర్భంగా 6 ,7 తరగతుల విద్యార్థులకు స్టడీమెటీరియల్‌తోపాటు నోట్ పుస్తకాలు పంపిణీచేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు బి. పద్మ శ్రీహరి, కమ్మ శ్రీనివాసరావు, ఆదినారాయణ రెడ్డి, బి.కొండయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మై టీడీపీ యాప్‌పై అవగాహన

చీమకుర్తి,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి):చీమకుర్తి మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మై టీడీపీ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం చీమకుర్తి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. నూతనంగా అనుబంధ సంఘాల అధ్యక్షులతో పాటు నాయకులకు యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్,పూనాటి వెంకట్రావు, గొట్టిపాటి రాఘవరావు, కూనంనేని లోకేష్, ఇస్తర్ల ఏడుకొండలు,రావిపాటి రాంబాబు, మన్నం శేషయ్య, అత్యాల ఏసోబు, కరిచేటి వెంకటేశ్వర్లు, దొడ్డా వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

కొండపి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కొండపి గ్రామ పంచాయతీలోని దాసరెడ్డిపాలెం ఎంపీ స్కూల్‌లోని విద్యార్థులకు దివంగత ఆర్‌ఎంపీ అవ్వారి వెంకటేశ్వర్లు, రత్నమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు సుబ్బారావు శుక్రవారం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.సురేఖ, పి.రామారావు, హెచ్‌ఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

రేపు జరిగే యజ్ఞాన్ని జయప్రదం చేయాలి

కొండపి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ కొనకనమిట్లలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహిస్తున్న యజ్ఞాన్ని జయప్రదం చేయాలని సంఘ మండల అధ్యక్షుడు చోడా శ్రీనివాసాచారి, బాధ్యుడు మచ్చా సురేష్ ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని వారు తెలిపారు.

చిన్నారుల్లో నూతన ఉత్తేజం కలిగించాలి

రాచర్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ్ తదితర కార్యక్రమాల ద్వారా చిన్నారుల్లో నూతన ఉత్తేజం కలిగించాలని గిద్దలూరు ఐసీడీఎస్ సీడీపీవో మహిత చెప్పారు. రాచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో థీమ్ పురుషుల భాగస్వామ్యంతో శుక్రవారం నిర్వహించిన పోషణ్ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు కూరగాయలతో చేసిన ప్రత్యేక పౌష్టికాహార అలంకరణలను చూసి ఆమె హర్షం వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్ వసంతకుమారి పాల్గొన్నారు.

స్వస్థ్‌నారీ-సశక్త్ పరివార్‌తో అందుబాటులో వైద్యం

రాచర్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా మంచి మెరుగైన వైద్యసేవలు అందించాలని మండల ఎంపీడీవో వెంకట రామిరెడ్డి చెప్పారు. ఆకవీడు పీహెచ్‌సీలో శుక్రవారం ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబాలు సౌభాగ్యంగా ఉంటాయన్నారు. గుడిమెట్ట గ్రామంలో అనుములవీడు పీహెచ్‌సీ వైద్యులు రమేష్, వారి బృందం రోగులకు ప్రత్యేక వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డీ వెంకటేష్, వైద్యాధికారులు ఖాదర్‌బాషా, కరుణ, హెచ్‌వో విజయ్‌కుమార్ ప్రసాద్, సర్పంచ్‌లు కాశిరెడ్డి, దేవదానం పాల్గొన్నారు.

నాగంపల్లిలో...

కొనకనమిట్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగంపల్లి గ్రామ సచివాలయంలో స్వస్థనారీసశక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ఎస్పీ బాలయ్య ఆధ్వర్యంలో శుక్రవారం మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. మొత్తం 154 మందికి చికిత్స అందజేసి మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో నారాయణరెడ్డి, జె.వెంకటేశ్వర్లు, విజయకుమారి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు

బేస్తవారపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట గ్రామ పంచాయతీలో స్వచ్ఛత సేవాలో భాగంగా శుక్రవారం గ్రామ పంచాయతీ సెక్రటరీ పి.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులను ఉచితంగా అందజేశారు.

కంభం చెరువు అభివృద్ధికి 35కోట్లు మంజూరు చేస్తా

కంభం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కంభం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ.35కోట్లు నిధులు మంజూరు చేస్తామని ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ చెప్పారు. శుక్రవారం సాయంత్రం ఆయన కంభం చెరువును సందర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చెరువులో బోటింగ్, రిసార్ట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సహకారంతో ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు.

శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌కు సన్మానం

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రైవేటు వైద్యశాలలో శ్రీశైలం ట్రస్టు బోర్డు నూతన చైర్మన్‌గా ఎంపికయిన పోతుగుంట రమేష్ నాయుడును వైద్యులు లావణ్య, కాశీరావు, ఉదయ్‌కుమార్‌లు శుక్రవారం ఘనంగా సన్మానించారు. శాలువాను కప్పి పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మినుము విత్తనాల పంపిణీ

కొనకనమిట్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అపరాల ఆదర్శ గ్రామం పథకం కింద 350 ఎకరాల్లో సాగుచేయనున్న మినుము పంటకు అవసరమైన విత్తనాలను శుక్రవారం గొట్లగట్టు గ్రామంలో దర్శి ఏడిఏ బాలాజీ నాయక్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త టి.వెంకటేశ్వరెడ్డి, ఏవో ప్రకాష్ రావు, సర్పంచ్ సుఖ్‌దేవ్ పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు

పెద్దదోర్నాల, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడాపోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్యామ్‌ప్రసన్నతాంజలి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో మస్తాన్ నాయక్ విజేతలకు బహుమతులు అందజేశారు.

ఇంటెక్ ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్

వెలిగొండలో భాగంగా పలు పనులపై ఆరా

పురోగతిని వివరించిన అధికారులు

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టులో భాగమైన మార్కాపురం మండలం గొట్టిపడియ గ్యాప్ వద్ద తాగునీటి కోసం నిర్మిస్తున్న ఇంటెక్ పనులను జిల్లా కలెక్టర్ రాజాబాబు శుక్రవారం పరిశీలించారు. అధికారులు తాగునీటి ప్రాజెక్టు వివరాలను వివరించారు. పశ్చిమ ప్రకాశం ప్రాంతంలోని ఆవాసాలకు చేపట్టిన ఆవశ్యకతను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వివరించారు. ప్రాజెక్టు పరిధిలోని పెద్దారవీడు, మార్కాపురం మండలాల్లోని దేవరాజుగట్టు, ఇడుపూరు గ్రామాల పరిధిలో ఉన్న గుండంచర్ల, కలనూతల, పునరావాస కాలనీలను పరిశీలించి అధికారులకు పలు సలహాలు సూచనలు తెలిపారు. అనంతరం రాయవరం వద్ద నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలను కలెక్టర్ పరిలించారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు, ఎస్ఇ బాలశంకరయ్య, ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.



ఛాయచిత్రం ద్వారా ఇంటెక్ వెల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజబాబు

సమస్యలు పరిష్కరించాలని దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

సాఫ్ట్‌వేర్‌సమస్యను పరిష్కరించాలని డిమాండ్

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం దస్తావేజు లేఖరుల సంఘం కార్యదర్శి టి.సుబ్బారావు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన ఈ విధానాల వలన దస్తావేజు లేఖరులు, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.



ఎర్రగొండపాలెంలో నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖరులు

గిద్దలూరులో...

గిద్దలూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలోని రైటర్లు, స్టాంపు వెండర్లు రెండు రోజుల పెన్‌డౌన్ సమ్మె మొదలుపెట్టారు. దీంతో గిద్దలూరు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తొలిరోజు శుక్రవారం రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. కార్డు ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాల వలన దస్తావేజు తయారీ తీవ్రజాప్యానికి గురవుతుండడంతో అటు ప్రజలు, ఇటు దస్తావేజు లేకరులు విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్న పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు శుక్ర, శని వారాలలో పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాలను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు.

ఎర్రగొండపాలెంలో...

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెంలో దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెన్‌డౌన్ చేసి నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ రిజిష్టారు కార్యాలయంలో సీనియర్ సహాయకులు జ్యోత్స్నాబాయ్‌కు వినతిపత్రం అందజేశారు. ర్యాలీలోఅసోసియేషన్ అధ్యక్షుడు కల్యాణ్ చక్రవరి, లేఖరులు వూట్ల సుబ్బారావు, లక్ష్మీనారాయణ, బొర్రారెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక, విద్యారంగ సమస్యలపై రణభేరి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఆర్థిక విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రణభేరీ జాత శుక్రవారం మార్కాపురం పట్టణం చేరింది. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి పూల సుబ్బయ్య కాలనీ వరకు యూటీఎఫ్ నాయకులు బైకు ర్యాలీ నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ హై, రాష్ట్ర నాయకులు వొద్దుల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి జయరాములు, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, పాపయ్య, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, యూటీఎఫ్ నాయకులు రాజేశ్, వెంకటరెడ్డి, జయరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేస్తవారపేటలో...

బేస్తవారపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు అయినప్పటికీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించ లేదని జిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు షేక్ అబ్దుల్‌హై చెప్పారు. యూటీఎఫ్ చేపట్టిన రణభేరి శుక్రవారం బేస్తవారపేటకు వచ్చింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలు నేటికీ కలగానే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.



పొదిలిలో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

పొదిలిలో...

పొదిలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ చేపట్టిన రణభేరి యాత్ర పొదిలికి చేరింది. గౌరవ అధ్యక్షులు రవి, నాయకులు బుజ్జిబాబు, బాలకాశిరెడ్డి, నాగరాజు, శైలజ, ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడేను పరిశీలించిన కమిషనర్

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అర్బన్‌కాలనీ, నల్లబండ బజారులోని జంగాల కాలనీల్లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రమణబాబు పరిశీలించారు. ఆశావర్కర్లు, హెల్త్ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సెక్రటరీలు, శానిటేషన్ సెక్రటరీలతో కలిసి ఆయా ప్రాంతాలలో పరిశీలించారు. సీజనల్ వ్యాధుల సర్వే, ఫీవర్ సర్వే, గర్భిణుల సర్వే, అనీమియా సర్వే, బాలింతల సర్వే, చిన్నపిల్లల టీకాల నమోదుపై ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు.

ప్రజల భద్రత కోసం తనిఖీలు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లలో ఎటువంటి నేరపూరిత అంశాలు జరుగకుండా ముందు జాగ్రత్తగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌టీఎఫ్ సీఐ బాలనరసింహారెడ్డి, ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు చెప్పారు. గురువారం అర్ధరాత్రి పట్టణంలోని గిద్దలూరు రైల్వేస్టేషన్‌ను సిబ్బందితో కలిసి ప్లాట్‌ఫారాలను, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ఎన్‌సీసీకి 30 మంది విద్యార్థులు ఎంపిక

మార్కాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జి ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన సెలక్షన్స్‌లో 30 విద్యార్థులు ఎన్‌సీసీకి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రాజబాబు తెలిపారు. కాలేజీనిలోని 186 సీటవై నందు 34 (ఎ) ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో 2025 విద్యా సంవత్సరానికి సెలక్షన్స్ నిర్వహించారు. ఏఎన్‌వో కెప్టెన్ అనిల్ నేతృత్వంలో నిర్వహించిన ఎంపికల్లో 100 మంది పాల్గొనగా 19 మంది విద్యార్థులు, 11 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ వి.మోహన్, పీఏ స్టాఫ్ సత్నాంసింగ్, సంతోష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారన్నారు.

నూతన ఈ పోస్ మిషన్లతో రేషన్ పంపిణీ వేగవంతం

పొదిలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నూతనంగా రేషన్ డీలర్లకు అందచేసిన ఈపోస్ మిషన్లతో సరుకులు పంపిణీ వేగవంతంగా జరుగుతుందని జిల్లా అధికారిణి పద్మశ్రీ చెప్పారు. పొదిలి రేషన్ డిపోలో శుక్రవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గతంలో పాతమిషన్‌ల వలన సమయం చాలా ఆలస్యం అవుతుందని, అందువల్లే ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించిందని చెప్పారు. అనంతరం డీలర్లకు మిషన్లు పంపిణీ చేశారు.

జాబ్ మేళాకు స్పందన

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నైపుణ్యం పోర్టల్ ద్వారా శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. మార్కాపురం ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఇందిరా దేవి మాట్లాడుతూ ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తోందని, ఇటువంటి జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 248 మంది హాజరయ్యారని, వారిలో 94 మంది ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ తెలిపారు. ఫిరోజ్ గాంధీ, శ్రీనివాసాచారి, నందన్, అజయ్ పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధిపై అవగాహన

తర్లుపాడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీ మేకలవారిపల్లెలో పశువులకు గాలికుంటు వ్యాధిపై రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారిణి సౌజన్య, వీఏ కవిత, మనోజ్, గురవయ్య, గోపాలమిత్ర రామయ్య, కోటిరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఇరిగినేని జయంతి


తిరుపతినాయుడు (ఫైల్)

పామూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపాడు, బొట్లగూడూరు గ్రామాల్లో శనివారం మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ ఇరిగినేని తిరుపతినాయుడు 87వ జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆయన కుటుంబసభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మోపాడులోని ఇరిగినేని ఘాట్ వద్ద, బొట్లగూడూరు విగ్రహం వద్ద జరిగే కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు పాల్గొంటారని తెలిపారు.

ఎంపీడీవోగా కృష్ణారావు బాధ్యతల స్వీకరణ

పీసీపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి ఎంపీడీవోగా జీవీ కృష్ణారావు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. శింగరాయకొండలో అడ్మినిస్ట్రేటర్ అధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై పీసీపల్లి ఎంపీడీవోగా నియమితులయ్యారు.

ఓట్ల జాబితా సిద్ధం చేయాలి

కనిగిరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఎల్‌వోలు మ్యాచింగ్ ఓట్ల జాబితా అందజేయాలని తహసీల్దార్ రవిశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో జరిగిన సమావేశంలో ఆయనమాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల ప్రకారం 2002 జాబితాలోని ఓటర్లు ఎంతమంది 2025లో ఉన్నారో పరిశీలించి మ్యాచింగ్ జాబితా ఈనెల 28లోగా అందజేయాలన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

దర్శి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జామ, మామిడి తోటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రవీంద్రబాబు సూచించారు. శుక్రవారం మండలంలోని తిమ్మాయిపాలెంలో సాగుచేస్తున్న జామ, మామిడి తోటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు.

మండల స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

తాళ్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగంగవరం హైస్కూల్ ప్రాంగణంలో శుక్రవారం మండల స్థాయి పాఠశాలల క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. ఎంఈవో సుబ్బయ్య,హెచ్ఎం ప్రసాద్ విద్యార్థినులతో కబడ్డీ ఆడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఎంఈవో -2 ఎల్.సుధాకర్‌రావు, స్కూల్‌కమిటీ చైర్మన్ షంషాద్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు 2న

అన్నా క్యాంటీన్ ప్రారంభానికి సన్నాహాలు

» మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య


అన్నా క్యాంటీన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య, కమిషనర్ మహేశ్వరరావు తదితరులు

దర్శి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అన్నా క్యాంటీన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అన్నారు. దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డులో నిర్మిస్తున్న అన్నా క్యాంటీన్‌ను కమిషనర్ మహేశ్వరరావుతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా పిచ్చయ్య మాట్లాడుతూ వచ్చే గాంధీ జయంతి రోజున అన్నా క్యాంటీన్ ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నట్టు చెప్పారు. ఈలోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్నా క్యాంటీన్ నిర్మాణాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. కొంతమేర పనులు జరిగేలోపు 2019 ఎన్నికలు వచ్చాయి. ఆతర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఇది మూలనపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చొరవ తీసుకొని పునర్నిర్మాణానికి నిధులు విడుదల చేయించారు. దీంతో ఇటీవల పనులు పునఃప్రారంభమయ్యాయి.

ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య మాట్లాడుతూ అక్టోబరు 2న అన్నా క్యాంటీన్ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ మస్తాన్, టీడీపీ నాయకుడు శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న దోర్నపు వాగు

» పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

తాళ్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో దోర్నపు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో పలుగ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని తాళ్లూరు-విఠలాపురం, దోసకాలయపాడు-తోటవెంగన్నపాలెం, తాళ్లూరు- మల్కాపురం గ్రామాల మధ్య దోర్నపువాగు చప్టాలపై శుక్రవారం ఉదయం నుంచి ఉధృతంగా నీరు ప్రవహించింది. దీంతో ఆగ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఆయాప్రాంతాల్లో తహసీల్దార్ బీవీ రమణారావు, ఎస్‌ఐ ఎస్.మల్లికార్జునరావు ప్రజలు రాకపోకలు సాగించకుండా బందోబస్తు ఏర్పాటుచేశారు. మల్కాపురం సచివాలయ సిబ్బంది వాగు వద్దే పడిగాపులు కాశారు. రజానగరం వెళ్లే మార్గంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును ఎంపీడీవో సత్యం పరిశీలించారు. ఈసందర్భంగా సచివాలయ సిబ్బందిని తాళ్లూరు వెళ్లాలని సూచించారు. వాగు ఉధృతి తగ్గిన తరువాత సచివాలయానికి వెళ్లాలని తెలిపారు. ఈవర్షం మొక్కజొన్న పంటకు మేలు చేకూర్చింది.

దర్శిలో భారీ వర్షం

దర్శి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దర్శిలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పట్టణంలో రోడ్లపై వర్షపునీరు ప్రవహించింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మురుగు కాల్వలు సక్రమంగా లేకపోవటంతో వర్షపునీరు రోడ్లపైకి చేరింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.


తాళ్లూరు-విఠలాపురం మార్గంలో ఉధృతంగా ప్రవహిస్తున్న దోర్నపువాగు


ముండ్లమూరు: ఉల్లగల్లు వద్ద నీటమునిగిన వరి పైరు

నీటమునిగిన వరి

ముండ్లమూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, చెక్ డ్యామ్‌లు పొంగి ప్రవహించాయి. చిలకలేరు, నక్కల వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. బసవాపురంలో వీధులు జలమయమయ్యాయి. రెడ్డినగర్‌లో వరి పొలాలు నీట మునిగాయి. ఉల్లగల్లు, పులిపాడు వద్ద అద్దంకి - దర్శి ప్రధాన రహదారిపై నీరు ప్రవ హించింది. ముండ్లమూరు - వేంపాడు వద్ద చిలక లేరు వాగుకు భారీగా నీరు చేరటంతో బ్రిడ్జిపైగా నీరు ప్రవహించింది.

ప్రకృతి సాగుతో ఆదాయం

తాళ్లూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పొలం గట్లపై మొక్కలు సాగు చేసి ఆదాయం పొందవచ్చునని వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు తెలిపారు. రామభద్రాపురం గ్రామంలో పొలంగట్లపై సాగు చేస్తున్న పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గట్లపై ప్రకృతి సాగు పద్ధతిలో బంతి, బొప్పాయి, ఇతర మొక్కలను సాగు చేయటంవల్ల చీడపీడలు రావన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను సన్మానించడం ప్రతిఒక్కరి బాధ్యత అని ఎంఈవో జె.ప్రసాదరావు అన్నారు. సీఎస్‌పురం మొయిన్ పాఠశాలలో శుక్రవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న జి.వెంకటేశ్వర్లు, జె.భారతిలను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు టి.శ్రీనివాసులు, ఆనంద్, హెచ్ఎం ఒంగోలు వెంకటేశ్వర్లు, కేశినేని వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాలను తనిఖీచేసిన డీఎంహెచ్‌వో

కనిగిరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ ఆరోగ్య పథకం నిర్వహణపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని మాచవరం, బొమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లో జరుగుతున్న శిబిరం వద్దకు వెళ్లి మహిళలకు అందించిన వైద్య సేవలపై విచారించారు. మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు, రక్తపరీక్షలు మందులు పంపిణీపై అందిన సేవలను అడిగి తెలుసుకున్నారు.

బొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో పారిశుధ్య సమస్యలు, జ్వరాలు వంటి వాటిపై గ్రామస్థులను డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు విచారించారు. గ్రామంలో అపరిశుభ్రతపై అవగాహన కల్పించారు. జిల్లా పంచాయతీ అధికారితో మాట్లాడి గ్రామంలో నెలకొన్న పారిశుధ్య సమస్యలను వివరించారు. పంచాయతీ సిబ్బందితో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

కార్యక్రమంలో డాక్టర్ షరీఫ్, మెడికల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శి, గ్రామసర్పంచ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభచాటిన ఎల్ఎన్‌పురం విద్యార్థులు

పామూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వగ్గంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన స్కూల్‌గేమ్‌ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆటల పోటీల్లో మండలంలోని లక్ష్మీనరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారు. కబడ్డీ, ఖోఖో జూనియర్ బాలుర, బాలికల విభాగాల్లో విజేతలుగా నిలిచారు. ఖోఖో సీనియర్స్ బాలికల విభాగంలో రన్నర్స్‌గా నిలిచారు. ఈసందర్భంగా శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ ఖాజామస్తాన్‌ను, విజేతలను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం తిరుపతయ్య, ఉపాధ్యాయులు సయ్యద్ ఖాదర్‌వలి, ఆర్.సుబ్బరాజు, మచ్చా ఖాజాహుసేన్, గాయత్రి, శోభకుమారి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు. అలాగే, కబడ్డీ అండర్ 14,17 బాలికల విభాగంలో వగ్గంపల్లి హైస్కూల్ విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించారు. కబడ్డీ అండర్ 17 బాలుర విభాగంలో ద్వితీయ, అండర్ 14 విభాగంలో మొదటి స్థానంలో నిలిచారు. ఖోఖో అండర్14 బాలికల విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. ఈసందర్భంగా హెచ్ఎం వీవీ నరసరాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.నరసింహా రావు క్రీడాకారులను అభినందించారు.

పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి

దొనకొండ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పోషక విలువలతో కూడిన ఆహారం శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీవో ఆర్.పరిమళ పేర్కొన్నారు. దొనకొండ 1, 2 సచివాలయాల పరిధిలో 8వ రాష్ట్రీయ పోషణ మహోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ప్రశాంత్‌కుమార్, డాక్టర్ చంద్రమౌళి సంపూర్ణ ఆరోగ్యకరంగా ఉండేందుకు తీసుకోవాల్సిన ఆహార పదార్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో దావూద్, ఐటీసీ ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటరావు, ఏపీఎం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు బాలింతలు, చిన్నపిల్లలు సరైన పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ వగ్గం పల్లి సెక్టార్ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని మాచ్చొండాపురం అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్ర మంలో భాగంగా శుక్రవారం పోషణ, సంరక్షణలో పురుషుల భాగస్వామ్యం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే బలిజపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

ముండ్లమూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరుపున వాలీబాల్, బాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో-1 ఎస్‌కే కాలేషావలి, హెచ్ఎం మాధవీ లత, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరరావు, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు టాన్యా, ఎన్.వెంకటసుబ్బయ్య, మాధవి తదితరులు పాల్గొన్నారు.




● తెనాలి : కొలకలూరులో నిర్మించిన 60 మీటర్ల మ్యాజిక్ డ్రైయిన్

వాహన మిత్ర.. నత్తనడక

- నిర్దేశించిన గడువుకు పూర్తి కాని ఈ-కేవైసీ
- ఉమ్మడి జిల్లాలో 8333 మంది పెండింగ్
- టెలీ కాన్ఫరెన్స్ పెట్టి సమీక్ష చేసినా చలనం లేదు

దసరా నాటికి ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ. 15 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా కింద స్థాయి సిబ్బందిలో పెద్దగా చలనం కనిపించడం లేదు. పెద్దగా కష్ట పడకుండా పాత జాబితా ప్రకారమే అర్హులైన వారితో ఈ-కేవైసీ పూర్తి చేయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ పని చేయడానికి కూడా క్షేత్ర స్థాయిలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. అదేమంటే మీటింగ్‌లు, ట్రైనింగ్‌లు అని చెబుతున్నారు. ఫలితం గా ఉమ్మడి గుంటూరు జిల్లాలో వాహన మిత్ర లబ్ధిదారుల ఈ-కేవైసీ భారీ గానే పెండింగ్‌లో ఉంది. సెప్టెంబరు 19 నాటికి ఈ-కేవైసీ సంపూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ కేవలం 60 శాతం మాత్రమే అయినట్లు లెక్కలు చెబుతున్నాయి.


తాడికొండ : పొన్నెకల్లులో వాహన మిత్ర ఈ-కేవైసీ కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ

(రేపల్లె- ఆంధ్రజ్యోతి)

గుంటూరు జిల్లాలో వాహన మిత్ర కింద లబ్ధి పొందేందుకు 10146 మంది ఉన్నట్లు గుర్తించారు. వారిలో 6065 మంది ఈ-కేవైసీ పూర్తి అయ్యింది. ఇంకా 4024 మంది పెండింగ్‌లో ఉన్నారు. వాళ్లని కూడా కార్యాలయానికి పిలిపించి ఈ-కేవైసీ పూర్తి చేయించాలని జిల్లా అధికారులు ఆదేశించారు. అయినా గురు, శుక్రవారాల్లో కొన్ని మండలాల్లో కేవలం ఒకటీ, రెండు ఈ-కేవైసీ మాత్రమే పూర్తి చేశారు. ఈ పరిస్థితి పై సీరియస్ అయిన జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ ఈ-కేవైసీ పూర్తి చేయించేందుకు గ్రామాల్లో పర్యటించారు. పల్నాడు జిల్లాలో మొత్తం 6834 మంది అర్హులైన వారుండగా, 4385 మందికి ఈ-కేవైసీ పూర్తి అయ్యింది. అక్కడ ఇంకా 2421 మంది ఈ-కేవైసీ పెండింగ్ లో ఉంది. బాపట్ల జిల్లా లో 5744 మంది వాహన మిత్ర కు అర్హులైన వారుండగా 3816 మంది ఈ-కేవైసీ పూర్తి అయ్యింది. అక్కడ 1888 మంది ఈ-కేవైసీ చేయించాల్సి ఉంది. వీళ్ల కాక గుంటూరు జిల్లాలో కొత్తగా అర్హులైన వారు 2156 మంది, పల్నాడులో 1444 మంది, బాపట్ల జిల్లాలో 984 మంది ఉన్నారు. వారిలో కూడా ఇంకా చాలా మంది ఈ - కేవైసీ పెండింగ్ లో ఉన్నట్లు తెలుస్తుంది.

ఈ-కేవైసీ కాకపోతే...

వాహన మిత్ర లబ్ధిదారులకు ప్రభుత్వం రూ. 15 వేలు చెల్లించనుంది. ప్రతి ఏడాది దసరా నాటికి ఈ చెల్లింపులు చేస్తామని సీఎం చంద్రబాబు స్వయంగా ప్రకటించారు .ప్రభుత్వం నిధులు జమ చేయాలంటే ఖచ్చితంగా ఈ-కేవైసీ పూర్తి చేసి ఉండాలి. ఎవరికైతే ఈ-కేవైసీ పూర్తి కాదో వారికి నిధులు జమ కావటం ఆలస్యం అవుతుంది. అటువంటి పరిస్థితిలో కొందరికి నిధులు జమ అయ్యి.. కొందరికి కాకపోతే ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉంటుంది. ఇదే విషయం గురించి జిల్లా అధికారులు పదే పదే చెబుతున్నా కింద స్థాయి సిబ్బందిలో మాత్రం పెద్దగా చలనం కనిపించడం లేదు.


6లో..
బీచ్ రిసార్ట్స్‌కు భలే గిరాకి!
ఏడాది పొడువున బుకింగ్‌లే
హైదరాబాద్ వాసులే అత్యధికం

మురుగుతో మ్యాజిక్

పర్యావరణ హితం.. ఖర్చు తక్కువ

సాంప్రదాయ కాంక్రీట్ డ్రెయిన్‌కు ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో పర్యావరణహితంగా మ్యాజిక్ డ్రెయిన్లు దోహదపడనున్నాయి. కాంక్రీట్ డ్రెయిన్ నిర్మాణానికి 100 మీటర్లకు రూ.4 లక్షలు వ్యయం అవుతుంది. అదే మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణం 100 మీటర్లకు రూ.90,000 వ్యయం కానున్నది. పైగా నిర్వహణ ఖర్చు ఉండదు. వ్యర్థ జలాలు భూగర్భంలోకి ఇంకడంతో పాటు కాలుష్యాన్ని తగ్గిస్తుంది.

వానొస్తే వరద.. బురద. ఆపై కాలాలతో సంబంధం లేకుండా మురుగు.. అపరిశుభ్రత. ఆ వెంటే దోమలు.. వ్యాధులు. ఇదీ పల్లె జనాన్ని పట్టి పీడిస్తోన్న ప్రధాన సమస్య. నిర్వహణా లోపం.. నిధుల లేమి.. పట్టించుకోని అధికారులు.. ప్రజల్లో లోపించిన అవగాహనతో పల్లెలను మురుగు సమస్య వెంటాడుతోంది. డ్రెయిన్లు నిర్మించినా నిరుపయోగంగా మారి.. మురుగుతో ప్రజలు అల్లాడుతున్నారు. ఈ సమస్యకు చెక్ పెట్టేలా ప్రభుత్వం మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రజారోగ్యానికి ఈ డ్రెయిన్లు దోహదపడనున్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం వాన నీటి సంరక్షణకు ఓ ఉద్యమంలా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టినట్లుగానే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణాన్ని చేపడుతోంది. మురుగు సమస్యలు తీరడంతో పాటు దోమల వ్యాప్తి నిర్మూలన తదితర బహుళ ప్రయోజనాలే లక్ష్యంగా మ్యాజిక్ డ్రెయిన్లు పల్లె ప్రజలకు మేలు చేకూర్చనున్నాయి. వ్యర్థ జలాలతో పాటు రోడ్లపై వాన నీరు నిలవకుండా వేగంగా.. సులభంగా భూమిలోకి ఇంకిపోయేలా ఈ మ్యాజిక్ డ్రెయిన్లను ప్రయోగాత్మకంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని 12 గ్రామాల్లో నిర్మిస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మూడు జిల్లాల పరిధిలో 4,345 మీటర్ల పొడవున నిర్మాణం చేపట్టారు.

ఇక మురుగు మాయం

- పల్లెల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం
- దోమలు, పారిశుధ్య సమస్యలకు చెక్
- తొలిదశలో 12 గ్రామాల్లో 4,345 మీటర్లు

(బాపట- ఆంధ్రజ్యోతి)

గ్రామాల్లో పెద్దఎత్తున సిమెంట్ రోడ్లు నిర్మించారు కానీ చాలా చోట్ల మురుగు కాల్వలు నిర్మించలేదు. దీంతో ఎక్కడికక్కడ మురుగు నీరు రహదారుల్లో నిలిచిపోయి ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. దోమల వ్యాప్తితో పల్లెవాసులు రోగాల భారీ పడుతున్నారు. రోజుల తరబడి రోడ్ల పై మురుగు, వ్యర్థాలతో కూడిన మురుగు నిలిచి తీవ్రమైన దుర్వాసన అపరిశుభ్రతకు పల్లెలు కేంద్రాలుగా మారుతున్నాయి. వర్షాల సమయంలో నీటి పారుదల లేక పల్లపు ప్రాంతాల్లోని ఇళ్లు కూడా మునిగిపోతున్నాయి. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం వినూత్న మ్యాజిక్ డ్రెయిన్లకు శ్రీకారం చుట్టింది. గతంలో ఇంకుడు గుంతలను విస్తృతంగా నిర్మించినట్లుగానే ప్రస్తుతం మురుగు సమస్యకు చెక్ పెట్టేందుకు.. వ్యర్థ జలాలతో పాటు వాన నీటిని భూమిలోకి ఇంకేలా మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణాన్ని పలు గ్రామాల్లో చేపడుతోంది. ఈ తరహా డ్రెయిన్లతో ప్రభుత్వానికి నిధుల ఆదాతో పాటు భూగర్భ జలాలు పెరుగుదల, పారిశుధ్య నిర్వహణ భారం తగ్గనున్నది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్ల ఫలితాలు ఆశాజనకంగా కనిపించాయి. దీంతో ఈ తరహా డ్రెయిన్లను అన్ని గ్రామాలకు విస్తరించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇళ్లలో నుంచి వచ్చే మురుగు, వర్షపు నీరు మ్యాజిక్ డ్రెయిన్‌లోకి చేరిన తర్వాత వడపోత అనంతరం భూమిలోకి ఇంకుతుంది. తద్వారా భూగర్భజలాలు కూడా వృద్ధి చెందనున్నాయి. పైలెట్ ప్రాజెక్టు కింద మూడు జిల్లాల్లోని 12 గ్రామాల్లో జిల్లా నీటి (మిగతా 6వ పేజీలో)


అద్దంకి మండలం విప్పర్లవారిపాలెంలో నిర్మిస్తున్న మ్యాజిక్ డ్రెయిన్


నిషేధిత జాబితాలో అద్దంకి నడిమధ్యన 120 ఎకరాలు

నిషేధం నుంచి ఊరట

అద్దంకి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణ నడి మధ్య ప్రాంతమది. ఏళ్ల తరబడి పలువురు నివాసాలు ఉంటున్నారు. అయితే ఆ భూములను దేవస్థాన భూములుగా పేర్కొంటూ నిషేధిత జాబితాలో చేర్చారు. దీంతో క్రయవిక్రయాలు లేక ఆ ప్రాంతవాసులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, పాలకులు చుట్టూ తిరిగినా వారి సమస్యకు పరిష్కారం దొరకలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ నిషేధిత సమస్య పరిష్కారంపై దృష్టి సారించడంతో బాధితులకు ఊరట ఇస్తోంది. ఇప్పటికే 1038 సర్వే నెంబర్ సమస్య చివరి దశకు చేరుకోగా, 1096 సర్వే నెంబరు ఫైల్ కదలిక వచ్చింది. త్వరలో దేవదాయశాఖ భూమిని మినహాయించి మిగిలిన విస్తీర్ణం మొత్తాన్ని నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఆస్తులు ఉన్నా అప్పులు పాలు

పట్టణ నడిబొడ్డున ఉన్న సుమారు 120 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల లో నిషేధిత జాబితాలో చేరడంతో రిజిస్ట్రేషన్లు నిలిచి యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్థలాలను అమ్ముకునే అవకాశం లేక, అప్పులు చేసి అవసరాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఉత్తర అద్దంకి రెవెన్యూ పరిధిలోని 1096 సర్వే నెంబరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ రోడ్డుకు ఇరువైపులా, గీతామందిరం రోడ్డు, పాత ఆంధ్రాబ్యాంక్ వెనుక ప్రాంతంలోని సుమారు 60 ఎకరాలలో రాజిగారితోట ప్రాంతం, 1038 సర్వే నెంబరులో మరో 60 ఎకరాలు దేవదాయశాఖ భూమిగా రికార్డుల్లో అధికారులు చేర్చారు. రెండు సర్వే నెంబర్లలోని 120 ఎకరాలు కాకానిపాలెం, భవానిసెంటర్, పోతురాజు గండి, కమఠేశ్వరస్వామి దేవాలయాలకు సంబంధించిన భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయి. దీంతో ఈ భూములకు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక టీడీపీ నేతలు విషయాన్ని మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకుపోయారు. దీంతో మంత్రి జిల్లా, డివిజన్ స్థాయి అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడటంతో సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి.

సీఎం కోసం సర్వం సిద్ధం

◆ నేడు మాచర్లలో చంద్రబాబు పర్యటన ◆ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తి

మాచర్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాచర్ల పట్టణంలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ కృష్ణారావు ఉదయం నుంచి సీఎం పర్యటించనున్న ప్రాంతాలను పరిశీలించారు. హెలికాప్టర్ ట్రయిల్ రన్ నిర్వహించారు. బంగ్లా గ్రౌండ్‌లో బహిరంగ సభా వేదిక ఏర్పాట్లను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం పరిశీలించారు. కార్యకర్తల సమావేశానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక పనులను కూడా పూర్తి చేయించారు. సెయింట్ ఆన్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను స్పెషల్ పార్టీ పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. 1132 మంది పోలీసులతో సీఎం పర్యటనకు అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.


● హెలిప్యాడ్ ప్రాంతాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

పర్యటన ఇలా..

మాచర్లలో సీఎం చంద్రబాబు పర్యటన షెడ్యూల్‌ను అధికారులు శుక్రవారం ప్రకటించారు. శనివారం ఉదయం 10:30 గంటలకు మాచర్ల - సాగర్ రోడ్డులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం వద్దకు తాడేపల్లి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో చేరుకుంటారు. 10:45 నుంచి 11:05 వరకు 23వ వార్డు యాదవబజారులో జరిగే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారు. 11:10 నుంచి 11:28 గంటల వరకు ఆర్టీసీ గ్యారేజీ వద్ద సఫాయి కార్మికులు, వైద్య సిబ్బందితో మాటామంతి కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడే స్వచ్ఛతా రథాలను ప్రారంభిస్తారు. 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు ప్రజావేదిక వద్ద ఉన్న స్టాల్స్‌ను సందర్శించి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. భోజన విరామం తర్వాత 3:35 వరకు ఆటోనగర్ సమీపం లో కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. 3:40 నుంచి సాయంత్రం 4 వరకు యాదవబజారులో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. 4:10 గంటలకు తిరిగి హెలి కాప్టర్‌లో ఉండవల్లికి వెళ్తారని అధికారులు తెలిపారు.


కలెక్టర్, ఎస్పీలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి


సిద్ధమవుతున్న సభా వేదిక

కారు డ్రైవర్ నిర్లక్ష్యం.. కూలీ మృతి

బైక్‌పై వెళ్తున్న ఇద్దరు, కారులో మరో ఇద్దరికి గాయాలు

కారులో కుక్క హడావుడితో ప్రమాదం


అంజిరెడ్డి (పాతచిత్రం)

తోటవారిపాలెం (చీరాల), సెప్టెంబరు 19 (ఆంధ్ర జ్యోతి): ఓ కారు డ్రైవర్ నిర్లక్ష్యం వ్యవసాయ కూలీ మృతి చెందిన ఘటన శుక్రవారం చీరాల కొత్త నందాయపాలెం మార్గంలో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. కర్లపాలెం మండలం కొత్తనందాయపాలేనికి చెందిన ఆట్ల అంజిరెడ్డి(54) అనారోగ్యం కారణంగా చికిత్స నిమిత్తం శుక్రవారం చీరాలకు వచ్చాడు. హాస్పిటల్లో వైద్య సేవల అనంతరం సాయంత్రం ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళుతున్నాడు. ఈ సమయంలో బాపట్లకు చెందిన ఓ వ్యక్తి కారులో కుక్కతో ఒంగోలు వైపు వెళ్తున్నాడు. 216 జాతీయ రహదారిలో తోటవారిపాలెం సమీపంలో కారులోని కుక్క ఒక్కసారిగా ముందు సీటులోకి దూకింది. డ్రైవర్ ఆందోళనకు గురవడంతో అదుపుతప్పిన కారు కుడివైపునకు దూసుకెళ్లి అటుగా బైక్‌పై వస్తున్న అంజిరెడ్డిని ఢీ కొట్టింది. దీంతో అతడు అక్కడిక్కడే మృతి చెందాడు. అలాగే మరో స్కూటీపై వెళుతున్న ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. అలాగే కారులో ఉన్న ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. అంజిరెడ్డి తమ్ముడు వెంకట సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

నిషేధం నిల్.. తవ్వకాలు ఫుల్

● గ్రామాభివృద్ధి పేరిట అక్రమంగా వసూలు ● రెవెన్యూ అధికారులకు బెదిరింపులు.. చోద్యం చూస్తున్న పోలీసులు

కొల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిషేధం ఉన్నా కొల్లూరు మండలంలో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. అక్టోబరు 15 వరకు అమల్లో ఉన్న నిషేధాన్ని అమలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. వరద కొద్దిగా తగ్గినప్పుడల్లా చింతల్లంక, పెసర్లంక అరవింద వారధి, గాజుల్లంక, జువ్వలపాలెం, భట్టిప్రోలు మండలం పెదలంక చెంత ఉన్న కృష్ణాజిల్లా ఆముదాల లంక సమీపంలోని నదిలో ఇసుక తవ్వి తరలిస్తున్నారు. చింతల్లంక పరిధిలో కొన్ని రోజులుగా ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అక్రమంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలపై ప్రశ్నిస్తే వాహనదారులు ట్రాక్టర్లతో తొక్కించంపుతామని బెదిరిస్తున్నారని గ్రామ రెవెన్యూ అధికారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. పోలీసులు కూడా ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోకుండా సహకరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకు వారికి ప్రత్యేకంగా ముడుపులు ముట్టజెబుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం చింతల్లంక నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్లు డొంక మార్గం పక్కనున్న పశుగ్రాసం తొక్కించేశారు. దీంతో రైతులు ప్రశ్నించగా ఇసుక అక్రమార్కులు వారిపై దౌర్జన్యానికి దిగారు. వారిని వారించేందుకు వెళ్లిన ఓ వ్యక్తి గాయపడగా స్థానికులు, కుటుంబ సభ్యులు అతడ్ని తెనాలి వైద్యశాలకు తరలించారు. డొంకరోడ్ల అభివృద్ధి, ఇతర త్రా పనులకు అక్రమ వసూళ్లు చేస్తున్నట్లుగా బహిర్గతమైంది. ఇందుకు సంబంధించి గురువారం సాయంత్రం గ్రామంలో కొందరు సమావేశమై ఇసుక నింపుకునేందుకు వచ్చిన ట్రాక్టర్ల యజమానుల నుంచి మరో వంద అదనంగా తీసుకోవాలని తీర్మానం చేసుకున్నట్లు సమాచారం. ఇది కూడా రాత్రి 10 నుంచి పగలు 10 గంటల వరకు ఇసుక తవ్వకాలు చేసుకునేందుకు మాట్లాడుకున్నారని సమాచారం. అక్రమ వసూళ్ల గురించి ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నారంటూ లంక గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. చింతల్లంకలోని ఘర్షణ గురించి పోలీసులు ఆరా తీసే క్రమంలో ట్రాక్టర్లు నదిలో సుమారు 50 వరకు ఉన్నా అటు వైపు కన్నెత్తి చూడలేదు. ఇసుక అక్రమాలపై ఉన్నతాధికారులకు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు లిఖిత పూర్వకంగా సమాచారం ఇచ్చారని తెలిసింది. రెవెన్యూ, పోలీసు సిబ్బందితో పికెటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అక్రమార్కుల బెదిరింపులకు లొంగేది లేదన్నారు.


● చింతల్లంక వద్ద నదిలో ఇసుక నింపుకుని వస్తున్న ట్రాక్టర్లు


ఘర్షణ గురించి ఆరా తీస్తున్న పోలీసులు

తుషార్‌డూడి సేవలు అభినందనీయం

● సత్కార సభలో నూతన ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాపట్ల ఎస్పీగా తుషార్‌డూడి జిల్లాలో అందించిన సేవలు అభినందనీయమని నూతన ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. బాపట్ల నుంచి చిత్తూరు జిల్లాకు బదిలీ అయిన తుషార్‌డూడికి శుక్రవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, సమస్యాత్మక విషయాలను సున్నిత దృక్పథంతో తుషార్‌డూడి పరిష్కరించారన్నారు. సన్మానగ్రహీత ఎస్పీ తుషార్‌డూడి మాట్లాడుతూ జిల్లాలోని పోలీసు యంత్రాంగం వారికి అప్పజెప్పిన విధులను నిబద్ధతతో నిర్వహించిన ఫలితంగానే శాంతిభద్రతలను సమర్థంగా పరిరక్షించగలిగినట్లు తెలిపారు. కృష్ణానది వరదల సమయంలో పోలీసుయంత్రాంగం ఎంతో సమర్థంగా విధులు నిర్వహించిందని తెలిపారు. వీఐపీ బందోబస్తు విధుల్లో, నేరాల కట్టడిలో అనుకున్న దాని కన్నా మెరుగ్గా పని చేసి తనకు సహకరించారని తెలిపారు. అనంతరం అధికారులు, సిబ్బంది తుషార్‌డూడిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు పి.జగదీష్‌నాయక్, బాలమురళీకృష్ణ, శ్రీనివాసరావు, జి.రామాంజనేయులు, ఎండి.మోయిన్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


బదిలీపై వెళ్తున్న ఎస్పీ తుషార్‌డూడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బీచ్ రిసార్ట్స్‌కు భలే గిరాకీ!



● హరితా బీచ్ రిసార్ట్స్ కాటేజీలు

ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్య లంక సముద్ర తీరంలోని ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు సంబంధించిన హరితా బీచ్ రిసార్ట్స్‌కు నానాటికి డిమాండ్ పెరిగిపోతోంది. ఏడాది పొడువునా ఆన్‌లైన్ బుకింగ్‌లతోనే కాటేజీలు నిండి పోతున్నాయి. అందులో అత్యధిక శాతం హైద రాబాద్ వాసులే ఉంటు న్నారు. అప్పడప్పుడు మాత్రమే ఆంధ్ర ప్రాంత పర్యాటకులకు అవ కాశం లభిస్తోంది. ఇక్కడ కాటేజీలు తక్కువ... డిమాండ్ ఎక్కువ.



● ఏడాది పొడువునా బుకింగ్‌లే
● హైదరాబాద్ వాసులే అత్యధికం
● కుటుంబంతో సేద తీరేందుకు వసతులు..

బాపట్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని బాపట్ల మండలం సూర్యలంక సము ద్రతీరంలోని హరితా బీచ్ రిసార్ట్‌లో 30 ఏసీ కాటేజీలు ఉన్నాయి. వీటిల్లో 10 డీలక్స్ ఉ న్నాయి. వీటికి అత్యధిక డిమాండ్ ఉంటుంది. సముద్రానికి ఎదురుగా ఉండే ఈ కాటేజీలు శుక్ర, శని ఆదివారాలలో రూ.6 వేలు, మిగిలిన రోజులు రూ.4,500 బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. అదే విధంగా ఏసీ స్టాండెడ్ కాటేజీలు 20 ఉన్నాయి. ఇవి శుక్ర, శని ఆదివా రాల్లో రూ.3,500, మిగిలిన రోజుల్లో రూ.2,500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. న్యూస్టాం డెడ్ కాటేజీలు 3 ఉన్నాయి ఇవి శుక్ర, శని ఆదివారాల్లో రూ.4,500, మిగిలిన రోజుల్లో రూ.3,600 బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ కాటేజీలు ఎక్కువ మొత్తంలో హైదరాబాద్ పరిసర ప్రాంతాల వారే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుం టారు. అప్పడప్పుడు మాత్రమే ఆంధ్రప్రాంత ప్రజలకు అవకాశం ఉంటుంది. దీనిని బట్టి కాటేజీలకు ఎంత డిమాండ్ ఉందో తెలుస్తుంది. కాటేజీల డిమాం డ్‌ను బట్టి ధరల హెచ్చుతగ్గులు ఉంటాయి.



బీచ్ రిసార్ట్స్‌లోని ఏసి డైనింగ్ హాలు

దారి పొడవునా ఆహ్లాదమే..

బాపట్ల నుంచి సూర్యంక సముద్ర తీరానికి 8 కిలోమీటర్లు ఉంటుంది. తీరానికి నాలుగు కిలోమీటర్ల వరకు రోడ్డుకు ఇరువైపు లా పచ్చనిచెట్లు పెరిగి ఆహ్లాదాన్ని పంచుతాయి. సూర్యలంక స ముద్రతీర ప్రాంతం దినదినాభివృద్ధి చెందుతోంది. దీనికి అనుబం ధంగా పర్యాటకులను ఆకట్టుకునేలా పర్యాటకశాఖ అనేక చర్యలు చేపట్టింది. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్ల నీడన పర్యాటకులు సేద తీరుతుంటారు. కార్తీకమాసంలో భక్తులు వనభోజనాలు ఇక్కడే చేస్తారు. జీడిమామిడి, జామాయిల్ తోటలు ఆహ్లాదకరం గా ఉంటాయి. కొన్ని వేల ఎకరాలలో చూడ ముచ్చటగా ఉండే ఈ తోటల మధ్య పర్యాటకులు కూర్చొని కుటుంబంతో సరదాగా గడుపుతూ భోజనాలు చేస్తూ ఆటపాటలతో ఆ నందిస్తారు. ఈ తోటల నుంచి ప్రభుత్వానికి ఆ దాయం కూడా వస్తుంది. బాపట్ల సబ్ డివిజన్ ప రిధిలో 1,366 హెక్టార్లలో జీడిమామిడి తోటలు వి స్తరించి ఉన్నాయి. వీటిని మరింత అభివృద్ధి చేసేం దుకు అటవీశాఖాధికారు లు చర్యలు చేపట్టాల్సిన అసరం ఉంది. అదేవిధం గా యూక లిప్టస్ తోట లు విస్తరించాయి.



తీరంలో జామాయిల్ తోటలు



ఆధునీకరించిన డీలక్స్ ఏసి స్టాండెడ్ కాటేజీలు



● సైబర్ దొంగలతో జాగ్రత్త

పర్యాటకంలో సైబర్ దొంగలతో జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది. గతంలో రెండు రా ష్ట్రాల పర్యాటక ప్రదేశాలే లక్ష్యంగా మోసాలు జరిగాయి. సూర్యలంక హరితా బీచ్ రిసార్ట్స్ పే రిట సైబర్ మోసం జరిగింది. మేనేజర్ పేరిట హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఓ ప్రైవేట్ ఉ ద్యోగి కుటుంబంతో కలిసి సెలవుల్లో సూర్యలంకలో గడపటానికి ఏ ర్పాట్లు చేసుకున్నారు. ఆన్‌లైన్ వెబ్ సైట్‌ను ఆశ్రయించారు. హరితా బీచ్ రిసార్ట్స్ పేరిట ఉన్న వెబ్‌సైట్‌లో కాంటాక్ట్ నంబరుకు ఫోన్ చే శారు. దీంతో మేనేజర్ తానేనంటూ సంజయ్‌గుప్తా అనే వ్యక్తి పరిచ యం చేసుకొని.. నగదు బదిలి చేయాల్సిన ఖాతా వివరాలు వాట్సప్ చేశాడు. ఇక్కడ బ్యాంకింగ్ సిస్టంలో ఉండే లొసుగులను ఆసరాగా చేసు కున్నారు. నకిలీ నంబర్‌తో డబ్బులు స్వాహ చేశారు. కాబట్టి పర్యాటకు లు ప్రభుత్వ వైబ్‌సైట్‌నే నమ్మాల్సిన అవసరం ఉంది. హరితా రీసార్ట్స్‌కే డబ్బులు జమ చేయాల్సి ఉంటుంది. లేకుంటే మోసపోయినట్లే.



బీచ్‌రిసార్ట్స్‌లోని బార్ అండ్ రెస్టారెంట్

● రిసార్ట్స్‌లో సౌకర్యాలు

సూర్యలంకలోని బీచ్ రిసార్ట్స్‌లో పర్యాట కులకు అందుబాటులో బార్ అండ్ రెస్టా రెంట్ ఉంది. ఫ్యామిలితో భోజనాలు చేసేం దుకు ఏసీ డైనింగ్ హాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. వన భోజనాలు చేసేం దుకు కాటేజీలకు ఎదురుగా ఆహ్లాదక రంగా చెట్లు పెంచారు. కాటేజీల బయ ట కూర్చొని తీరాన్ని వీక్షించే విధంగా ఏర్పాట్లు చేశారు. పర్యాటకులకు కా వాల్సిన అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు రిసార్ట్స్‌లు ఆధునీకరించారు.

పోలిరెడ్డి ఎత్తిపోతలను త్వరగా పూర్తి చేయాలి



కొరిశపాడు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

మేదరమెట్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): యర్రం చిన్నపోలిరెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం త్వరగా పూర్తి చేయాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని యర్రం చిన్నపోలిరెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన కొరిశపాడు రిజర్వాయర్‌ను సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మోంద్రు ఆంజనేయులు, సీనియర్ నాయకులు దశరథ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ 2007లో 177 కోట్ల అంచనాలతో ప్రారంభమైన ఎత్తిపోతల పథకం 17 ఏళ్లు పూర్తయినా, ఇప్పటికి పూర్తి కాలేదన్నారు. 12 గ్రామాలలోని భూములకు సాగునీరు అందించే ఈ పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కోరారు. ఈ అసెంబ్లీ సమావేశాలల్లో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి నిధులు మంజూరుచేయించి పనులు పూర్తి చేయించాలని కోరారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం, పునరావాసాస పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటి సభ్యులు రవీంద్రబాబు, సుధాకర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● న్యాయవాది అనూషా



న్యాయవాది అనుషాను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళల కోసం ఏర్పాటు చేసిన చట్టాలు, వాటి అమలుపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని, న్యాయవాది టి.అనూషా అన్నారు. శుక్రవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్నేహిత కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయవాది అనుషా పాల్గొని మహిళల కోసం కేటాయించిన చట్టలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల యాజమాన్యం సన్మానించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు, డాక్టర్ ఎన్.షర్మిలారాణి, డి. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ)లకు పే స్కేల్ అమలు చేయాలని ప్రకాశం జిల్లా వీఆర్‌ఏల సంఘం కార్యదర్శి పాలడుగు వివేకానంద డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వివేకనంద మాట్లాడుతూ నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలని, అర్హులకు ప్రమోషన్లు, కారుణ్య నియమకాలు వంటి సమస్యలు నేటి పరిష్కారం కాలేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం దశల వారి పోరాటాలకు వీఆర్‌ఏలు సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీచరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు మర్రిపూడి నరసింహరావు, కార్యదర్శి కనపర్తి స్వాములు, ఎం. ఆదినారాయణ, రుద్రు శ్రీనివాసరావు, జే.నాగేశ్వరరావు, వీరయ్య, కోటేశ్వరరావు, మండలంలోని అన్ని గ్రామాల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

● మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు ● పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్యం పనిచేసే పారిశుధ్య కార్మికులు విధు లతోపాటు వ్యక్తిగత ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని, అందరూ ఆరో గ్యంగా ఉండాలని నగర కమిషనరు కే. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్, ఈఎస్ఐ సంయుక్త నిర్వహణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కమిషనరు మాట్లాడుతూ ప్రతి కార్మికుడు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. మత్తుపానీయాలకు దూరంగా ఉండాలని, అలాగే ఆహారపు అలవాట్లలో జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లా



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న కమిషనర్

డుతూ నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దేందుకు నిరంతరం కాలుష్యంలోనూ పనిచేస్తున్న కార్మి కుల సేవలు అభినందనీయం అన్నారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసినా, చెత్తా, చెదారం మధ్య పనిచేస్తున్న కార్మికులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి మాట్లా డుతూ పారిశుధ్య కార్మికుల ఆరో గ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కార్పొ రేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం సంతో షంగా ఉందన్నారు. ప్రజారోగ్యం పనిచేసే కార్మికులు, వ్యక్తిగత ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చూపడకూ డదన్నారు. ఈ శిబిరంలో శాని టరీ విభాగం కార్మికులతోపాటు, పలు సెక్షన్‌ల సిబ్బంది వైద్య పరీక్షలు చేయిం చుకోగా, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంతః ఐశయ్యతోపాటు, కార్పొరేటర్లు ఆదిపూడి గిరిజా శాండిల్య, చింతపల్లి గోపితోపాటు శాని టరీ సూపర్ వైజర్ షేక్ బాబ్జి, ఎన్. పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రెయిన్ పనులను పరిశీలించిన పీడీ

రాచర్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మ్యాజిక్ డ్రెయిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధిహామీ పథకం పీడీ జోసఫ్ కుమార్ చెప్పారు. మండలంలోని గౌతవరం గ్రామంలో జరుగుతున్న మ్యాజిక్ డ్రెయిన్ పను లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కేవలం 6గ్రామాలు మాత్రమే ఈ కార్యక్రమా నికి ఎంపికయ్యాయని, అందులో గిద్దలూరు నియోజకవర్గంలో గౌతవరం మాత్రమే ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట రామిరెడ్డి, ఉపాధి హామీ ఏపీఏ మహాలక్ష్మీ, ఈసీ నాగేశ్వరరావు, టీఏ కోటిలింగా రెడ్డి, కార్యదర్శి అనిల్ కుమార్, సొసైటీ బ్యాంక్ చైర్మన్ జీవనే శ్వరరెడ్డి, టీడీపీ మండల అధ్య క్షుడు కె.యోగానంద్, సనవుల్లా ఖాన్, మురళి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న పీడీ జోసెఫ్ కుమార్

రేపు నేతల విగ్రహాల ఆవిష్కణ

● కార్యక్రమ ఏర్పాట్లు పరిశీలించిన దామచర్ల సత్య
● హాజరుకానున్న మంత్రులు, ఎంపీలు

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు నాయుడుపాలెంలో ఆదివారం జరిగే అభివృద్ధి పనులు, విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాలను ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య శుక్రవారం పరిశీలించారు. మర్లపాడులో దివంగత నేతలు ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు, పరిటాల రవి విగ్రహాల ప్రారంభోత్సవాలు జరగనున్నాయి. వాహనాల పార్కింగ్, భోజన ఏర్పాట్లు, సభ జరిగే ప్రదేశాలను సత్య పరిశీలించి, ఏర్పాట్లపై నాయకులతో చర్చించారు. భారీగా జరిగే కార్యక్రమానికి వచ్చే జనం, వాహనాల రద్దీ లేకుండా ఉండే విధంగా ఏర్పాట్లను పథకం ప్రకారం నిర్వహించాలని నాయకులు, పోలీసు అధికారులతో చర్చించారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, ఎంపీల తోపాటు, ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు, కార్పొరేషన్‌ల చైర్మన్లు, డైరెక్టర్లు హాజరుకానుండటంతో ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్సైలు నాగమల్లేశ్వరరావు, మహేంద్ర, టీడీపీ మండల నాయకులు ఈదర ప్రభాకర్, రామా గోపి, మక్కెన వెంకటరావు మర్లపాడు గ్రామ టీడీపీ నాయకులు హరిబాబు, వేణు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు

● జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి తీర్పు

సింగరాయకొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దొంగతనం కేసులో నిందితుడికి స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి వి.లీలాశ్యాంసుందరి శుక్రవారం ఏడాది జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. గత ఏడాది డిసెంబర్ 22వ తేదీన శ్రీకాకుళం జిల్లా పలసా గ్రామానికి చెందిన గొల్లంగి ప్రవీణ్‌కుమార్ సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని కందుకూరు రోడ్డు సెంటర్‌లోని పాత ఇనుము దుకాణం షెట్టర్ పగలకొట్టి క్యాష్ కౌంటర్‌లోని రూ.5వేలు అపహరించాడు. దుకాణానికి చెందిన షేక్ ముజీబ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. దుకాణంలో సీసీ కెమెరాల్లో నమోదైన సీసీఫుటేజ్ ఆధారంగా నిందితుడిని గుర్తించి గత ఏడాది డిసెంబర్ 25 తేదీన అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా నిందితుడికి న్యాయస్థానం రిమాండ్ విధించింది. విచారణలో భాగంగా నిందితుడు దొంగతనానికి పాల్పడిపట్లు నిర్ధారణ కావడంతో న్యాయాధికారి నిందితుడికి ఏడాది జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

ఎన్‌హెచ్‌వీ అప్‌లోడ్ చేయని హెచ్‌ఎంలపై చర్యలు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛహరిత విద్యాలయ(ఎన్‌హెచ్‌వీ) వివరాలు లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయని పాఠశాల ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని పాఠశాల విద్యా గుంటూరు ఆర్‌జేడీ బి.లింగేశ్వరరెడ్డి హెచ్చరించారు. అందుకు సంబంధించి 60 ప్రశ్నలకు సమాధానాలు రాసి వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. శుక్రవారం ఎంఈవోలు, హెచ్‌ఎంలతో నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలకు హాజరవుతూ ఆన్‌లైన్‌లో పేరులేని విద్యార్థుల పేర్లు వెంటనే ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈనెలాఖరు హైస్కూళ్లలో ఖాళీల వివరాలు తెలియజేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేసిన విద్యా కిట్లకు పాఠశాలలకు అందజేసిన కిట్ల సంఖ్యలో తేడా ఉంటే సంబంధిత హెచ్‌ఎంలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

● విద్యుత్‌శాఖ జేఏసీ నాయకుల పిలుపు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రపవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు డిమాండ్ చేశారు. గత ఐదు రోజులుగా స్థానిక విద్యుత్ భవన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి రిలేదీక్షలు చేస్తున్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఇలా 21 డిమాండ్ల పరిష్కారం కోసం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్యారంలో రిలే దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ శ్రీహరికృష్ణ, కన్వీనర్ కె.వెంకటరవి, రాఘవరెడ్డి, దుర్గాప్రసాద్, జబ్బార్‌తోపాటు అనేక సంఘాల నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనర్థాలు

మద్దిపాడు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):మత్తు పదార్థాలు వినియో గిస్తే ఆరోగ్యానికి చేటుచేస్తుందని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు అన్నారు. శుక్రవారం వెల్లంపల్లి యాదవ బజార్‌లో నిర్వహించిన అవగా హన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా కొత్త వ్యక్తులు గంజాయి వంటి మత్తు పదార్థాలు తీసుకువస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎస్సై సైదులు మాట్లాడుతూ అసాం ఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

మురుగుతో.. మ్యాజిక్

(5వ పేజీ తరువాయి)

యాజమన్య సంస్థ పర్యవేక్షణలో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టారు.

పైలెట్ ప్రాజెక్టు కింద ఈ గ్రామాల్లో..

పల్నాడు జిల్లా: దుర్గి మండలం ఓబులేసునిపల్లెలో రెండు చోట్ల మూడు వందల మీటర్ల పొడవున నిర్మిస్తున్నారు. ఈపూరు మండలం గుండేపల్లిలో 200 మీటర్లలో రెండు కాల్వలు, క్రోసూరు మండలం గాదివారిపాలెంలో 166 మీటర్లలో మూడు, నాదెండ్ల మండలం బుక్కాపురంలో 150 మీటర్లలో ఒక డ్రెయిన్ నిర్మాణం చేపట్టారు.

- బాపట్ల జిల్లా: అద్దంకి మండలం విప్పర్లవారిపాలెంలో 410 మీటర్లలో నాలుగు కాల్వలు, చినగంజాం మండలం నీలయ్యపాలెంలో 600 మీటర్లలో ఐదు, మార్టూరు మండలం చిమ్మిరిబండలో 700 మీటర్లలో ఏడు, వేమూరు మండలం పోతుమర్రులో 885 మీటర్లలో తొమ్మిది పనులు చేపట్టారు.

- గుంటూరు జిల్లా: దుగ్గిరాల మండలం చింతలపూడిలో 350 మీటర్లలో నాలుగు డ్రెయిన్లను నిర్మిస్తున్నారు. మేడికొండూరు మండలం మంగళగిరిపాడులో 334 మీటర్లలో ఐదు, ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెంలో 190 మీటర్లలో రెండు, తెనాలి మండలం కొలకలూరులో 60 మీటర్ల పొడవున ఒక మ్యాజిక్ డ్రెయిన్ చేపట్టారు.

నిర్మాణం ఇలా..

గ్రామాల్లో రోడ్డుకు పక్కన మురుగు కాల్వ స్థానంలో మ్యాజిక్ డ్రెయిన్ నిర్మిస్తారు. ఇళ్లలో నుంచి వచ్చే వ్యర్థపు నీరు నేరుగా భూమిలోకి ఇంకేవిధంగా ఈ కాల్వ నిర్మిస్తారు. వ్యర్థపు నీరు ఆ ఇంటి సమీపంలో నిల్వకుండా మరో చోటకు ప్రవహించకుండా చేస్తారు. ఇందుకోసం మ్యాజిక్ డ్రెయిన్‌లో రెండు అడుగుల లోతు, అరమీటరు వెడల్పుతో కాల్వ తవ్వుతారు. కాల్వకు 50 మీటర్లకు ఒక ఇంకుడు గుంతను ఏర్పాటు చేస్తారు. కాల్వలో కింద నుంచి పైకి గ్రేడెడ్ రాళ్లు, కంకర, ఇసుక వంటి పొరలను ఏర్పాటు చేస్తారు. ఇందులోకి ఇళ్ల నుంచి వచ్చే నీటిని మళ్లిస్తారు. వ్యర్థ జలాలు సహజంగా వడకట్టుతో భూమిలోకి ఇంకుతాయి.

విద్యార్థులు లక్ష్యాలతో ముందుకు సాగాలి

● జిల్లా పోలీసు కళాశాల ప్రిన్సిపాల్ రాధిక
● కేఆర్‌కే కళాశాలలో విద్యార్థులకు భవిష్యత్ నిర్దేశంపై శిక్షణ



మాట్లాడుతున్న పీటీసీ ప్రిన్సిపాల్ రాధిక

అద్దంకిటౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జీవిత లక్ష్యాలను నిర్ణయించుకుని, ఎదురైయే సవాళ్లను అధిగమిస్తూ ముందుకు పోవాలని, జిల్లా పోలీస్ కళాశాల ప్రిన్సిపల్ జి. రాధిక అన్నారు. శుక్రవారం స్థానిక కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం, సీజీసీ ఎస్‌డీసీ, మహిళ సాధికారక విభాగం, ఇన్‌క్లూజివ్ సెంటర్, ఎన్ఎస్ఎస్-1, 2 విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల భవిషత్ లక్ష్యాలను నిర్ణయించుకొనేలా స్ఫూర్తి కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. మోహనరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఐపీఎస్ జి. రాధిక మాట్లాడుతూ లైంగిక వేధింపులు, సైబర్ నేరాలు, మత్తుమందుల వినియోగం, ఇతర అ సాంఘిక కార్యక్రమాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కళాశాలల్లో జరుగుతున్న ర్యాగింగ్ వంటి దుశ్చర్యలు, ఫలితంగా విద్యార్థుల జీవితాలు ఎలా వినాశనమవుతున్నాయో తెలియజేశారు. ప్రతి రోజు జరుగుతున్న కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

● ఎస్పీ హర్షవర్ధనరాజు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. ఒంగోలు నగరంలోని ఒంగోలుతాలుకా, ఒంగోలు వన్‌టౌన్, ఒంగోలు రూరల్ సర్కిల్ ఆఫీసులను ఎస్పీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. పోలీసుస్టేషన్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. పలుకేసులకు సంబంధించి ఏళ్ల తరబడి ఉన్న వాహనాలను అనుమతి తీసుకొని వేలం వేయాలని కోరారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే అల్లరి మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో విజిబుల్ పోలీసింగ్ ఉండేలా చూడాలని కోరారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే ప్రాంతాలపై డ్రోన్‌ల ద్వారా నిఘా పెట్టాలని అన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరించి చట్టపరిధిలో సత్వర న్యాయం అందించాలని, తద్వారా పోలీసుశాఖ ప్రతిష్ట పెరుగుతుందని చెప్పారు. ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్ బయిట ఉన్న ఫిర్యాదిదారులతో ఎస్పీ మాట్లాడి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ కే.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఉన్నారు.

అవీ..ఇవీ..

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

● టీడీపీ యువనాయకులు గౌరీఅమర్నాథ్



అర్జీలను స్వీకరిస్తున్న గౌరీ అమర్నాథ్

చీరాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు టీడీపీ యువనాయకులు గౌరీఅమర్నాథ్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో అమర్నాథ్ పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు వివరించారు. 95 అర్జీలు రాగా వాటిల్లో నివేశన స్థలాలకు సంబంధించి 75, పెన్షన్ సమస్యలు 15, 5 ఇతర సమస్యలు ఉన్నట్లు వివరించారు. కొన్నింటిని తక్షణమే పరష్కారాలకు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జనార్దనరావు, టీడీపీ మండల అధ్యక్షులు పురుషోత్తం, కూటమి నాయకులు శివ నాగమల్లేశ్వరీ, పద్మినీ, నాగలక్ష్మీ, గాయత్రి తదితరులు ఉన్నారు.

సమాజ హితమే పట్టభద్రుల సంఘు లక్ష్యం



ఆర్థిక సహకారం అందిస్తున్న పట్టభద్రులు సంఘు నేతలు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సమాజ హితమే పట్టభద్రుల సంఘం లక్ష్యమని అధ్యక్షులు ప్రత్తి వెంకటసుబ్బారావు అన్నారు. శుక్రవారం నలుగురు నిరుపేద విద్యార్థులకు రూ.27వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలన్నారు. అలాగే క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి దేశానికి వెన్నెముకలా నిలవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని చెప్పారు. సంఘం ఉపాధ్యక్షులు బుర్రా సాంబశివరావు, నాగాంజనేయులు, శేఖర్‌బాబు, నాగరాజు, లక్ష్మణస్వామి, శ్రీమన్నారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు అంచులోకి దూసుకుపోయిన ఆటో



రహదారి అంచులోనికి దూసుకుపోయిన ట్రాలీ ఆటో

బల్లికురవ, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని నక్కబొక్కలపాడు చప్టాలో శుక్రవారం నాలుగు చక్రాల ఆటో ప్రమాదవశాత్తు రోడ్డు అంచులోనికి దూసుకుపోయింది. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. అద్దంకి వైపు నుంచి నాలుగు చక్రాల ఆటో కొత్తగా తయారు చేసిన ట్రాక్టర్ ట్రక్కును వెనక కట్టుకొని నక్కబొక్కలపాడు వైపునకు వెళుతోంది. ప్రమాదవ శాత్తు చప్టాపక్కన ఉన్న అంచులోనికి దూసుకు పోయింది. వెంటనే ట్రక్కు యజమానులు ఎక్స్‌కవేటర్‌తో వాహనాన్ని బయటకు తీశారు.

మెయిన్ డ్రెయిన్‌లో పూడికతీత



పూడికతీత పనులను పరిశీలిస్తున్న లక్ష్మీశ్రీనివాసరావు

అద్దంకి,సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 11వ వార్డు పరిధిలో ఉన్న మెయిన్ డ్రెయిన్‌లో శుక్రవారం పూడికతీత పనులు చేపట్టారు. పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులను స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కమిటీ

యద్దనపూడి,(మార్టూరు) సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని పూనూరు సొసైటీ అధ్యక్షునిగా వంకాయలపాటి వెంకటేశ్వర్లు శుక్రవారం ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు.అదేవిధంగా ఇద్దరు సభ్యులుగా బట్టు శ్రీనివాసరావు, కోటగిరి హనుమంతరావు లు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బోయపాటి సాంబశి వరావు,రావిపాటి సీతయ్య,గుదే తారకరామారావు,ఈదల అనిల్ కుమార్ ,దుర్గినేని కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

ఆటో అదుపుతప్పి భార్యాభర్తలకు గాయాలు

● మరో ఘటనలో మోటారు సైకిల్‌ను ఢీకొన్న కారు

● రెండు ప్రమాదాలలో నలుగురికి గాయాలు

అద్దంకి, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు ప్రమాదాలలో నలుగురికి గాయాలయ్యాయి. పొదిలి నుంచి గుంటూరుకు సొంత ఆటోలో వెళ్తున్న మరియదాసు, లక్ష్మమ్మలు వెళ్తుండగా శుక్రవారం రాత్రి అద్దంకి మండలం తిమ్మాయపాలెంలో వర్షానికి ఆటో జారి పడిపోయింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న భార్యభర్తలు గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అద్దంకి పట్టణంలోని పెరికపాలేనికి చెందిన వృద్ధ దంపతులు ప్రసన్నాంజ నేయులు, పార్వతిలు గడ్డి మోపుతో మోటార్‌సైకిల్‌పై దర్శి రోడ్డులోకి వచ్చే సమయంలో తిమ్మాయపాలెం వైపు నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. గాయాలైన ప్రసన్నాంజనేయులు, పార్వతీలను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం పార్వతిని ఒంగోలు తరలించారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

బల్లికురవ, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ విధిగా వైద్య పరీక్షలు చేయించుకోని అరోగ్యవంతులుగా జీవించాలని గుంటుపల్లి ప్రాథమిక అరోగ్యకేంద్రం వైద్యాధికారి రమీజ్ అహ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' అనే కార్యక్రమంపై విద్యార్థులకు మహిళకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య అరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పశుగ్రాసంగా మినుము పైరు

- అనుకూలించని అధిక వర్షం
- తెగుళ్లతో నష్టం
- రబీలో సాగుచేసే పైరుపైనే ఆశ అంటున్న రైతు



మినుముపైరును మేస్తున్న గొర్రెలు

పంగులూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలు తెగుళ్ల పూత పిందె దశలోని మినుము పశుగ్రాసంగా మారింది. మండలంలోని కొండమూరులో ఖరీఫ్ పంటగా ఇంచుమించు 1250 ఎకరాలలో రైతులు మినుముసాగు చేపట్టారు. ప్రస్తుతం పైరు వివిధ దశలలో ఉన్నాయి. ఈ ఏడాది జూలై మాసాంతంలో సాగుచేసిన మినుము పైరు ఆశాజనకంగా లేదని రైతులు వాపోతున్నారు. విత్తనం వేసిన అనంతరం పైరు మొలకదశకు చేరిననాటి నుంచి చాలినంత వర్షంపడక పైరు ఏపుగా ఎదగని పరిస్థితి నెలకొంది. అడపాదడపా పడిన వర్షపు జల్లులతో ఆశించినమేర ఎదుగుదలకు నోచుకోలేదు. పైరుపూతదశకు చేరుకుని కొద్దోగొప్పో కాయఏర్పడే సమయానికి కురిసిన అధిక వర్షంతో పైరుకు ఏర్పడిన పూత, పిందే రాలి నేలపాలయింది. ఉన్నకొద్దిపాటి పూత, కాయ పక్వానికి చేరుకుని కాయ గింజపోసుకనే సమయం వరకు పెట్టేఖర్చుకు సరిపడా దిగుబడి వచ్చే పరిస్థితి లేదని భావించిన రైతులు ఉన్నపైరును గొర్రెల మేతగా వచ్చిన కాడకి అమ్ము కుంటున్నారు.

13ఎకరాల పైరు రూ.30 వేలకు అమ్మేశా : బండారు వెంకటేశ్వర్లు, కౌలురైతు



నాకున్న ఎకరం పొలంతో పాటు మరో 12 ఎకరాలు కౌలుకు తీసుకుని ఖరీఫ్ పంటగా మినుము సాగు చేశా. ఎకరాకు కౌలు రూ.20వేలు చెల్లించా. తొలిపంటగా 13ఎకరాలలో మినుముసాగు చేపట్టి లక్షకు పైగా ఖర్చుపెట్టా. మొక్కమొలిచిన నాటి నుంచి ఆశించిన మేర వర్షం పడక పైరు ఏపుగా పెరగలేదు. ఉన్న పైరుకు పూత, పిందె ఏర్పడిన దశలో వర్షంపడి పంటంతా దెబ్బతింది. దీంతో 13ఎకరాల పైరును రూ.30వేల మొత్తానికి గొర్రెల మేతకు అమ్మేశా. ఖరీఫ్‌లో మినుము సాగు కొంపముంచింది. రబీలో సాగుచేసే మొక్కజొన్నపైనే ఆశపెట్టుకున్నా.

గ్రానైట్ ఫ్యాక్టరీలో క్రేన్ వైరు తెగి పడి కూలి మృతి

బల్లికురవ, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి ఉప్పుమాగులూరు గ్రామ సమీపంలోని గ్రానైట్ ఫ్యాక్టరీలో ప్రమాదవశాత్తు ఎక్స్‌కవేటర్ తీగ తెగి పనులు చేస్తున్న కూలీ రాకేష్‌కుమార్(29) మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు ఉప్పుమాగులూరు గ్రామ పరిధిలో ఉన్న హర్షిత గ్రానైట్ ఫ్యాక్టరీకి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీర్జాపూర్ జిల్లా చున్నూర్ గ్రామానికి చెందిన రాకేష్‌కుమార్ ఇటీవల ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ పనుల నిమిత్తం వచ్చాడు. రోజు మాదిరిగానే పనులు చేస్తుండగా శుక్రవారం ఉదయం ఒక్కసారిగా ఎక్స్‌కవేటర్ తీగ తెగింది. దీంతో పక్కనే ఉన్న గ్రానైట్ స్లాబు లు కూలీ కాలిపై పడ్డాయి. వెంటనే క్షతగాత్రుడిని వైద్యం కోసం చిలక లూరి పేట వైద్యశాలకు తరలి స్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాద ఘటనపై గ్రామ రెవెన్యూ అధికారి ఆశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో తెగి పడిన ఎక్స్‌కవేటర్ తీగ



చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యం

● డీఈవో పురుషోత్తం ● డివిజన్ క్రీడలు ప్రారంభం

పందిళ్లపల్లి (చీరాల), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు ఆటలకు కూడా ప్రాధాన్యతను ఇవ్వాలని, తద్వారా లక్ష్యసాధన సులువని డీఈవో శ్రీరాం పురుషోత్తం పేర్కొన్నారు. చీరాల డివిజన్ స్థాయి పోటీలు శుక్రవారం వేటపాలెం మండలం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు జే.సుబ్బయ్య, పి.పురుషోత్తంలతో కలిసి ప్రారంభించారు. అలాగే ముందుగా పరుగుపందెం పోటీల్లో అధికారులు స్వయంగా పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. అనంతరం మాట్లాడుతూ పోటీల్లో పాల్గొని ఆల్‌రౌండర్ ప్రతిభ కనబరచాలని చెప్పారు. మొదటిరోజు అథ్లెటిక్స్ పోటీలలో విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీవైఈవో గంగాధర్, ప్రధానోపాధ్యాయు రాలు దీప్తి, కో-ఆర్డినేటర్ కర్ణ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హైజంప్ దూకుతున్న విద్యార్థిని



పరుగుపోటీలలో పాల్గొన్న డీఈవో పురుషోత్తం

స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న

పర్చూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రం పర్చూరులో నేడు జిల్లా కలెక్టర్ బి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న అన్నారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. తగు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.వెంకటస్వామి, తహసీల్దార్ బ్రహ్మయ్య, సీఐ జివిఎల్.శ్రీనివాసరావు, ఎస్సై జీవీ.చౌదరి, ఈవోఆర్‌డీ కొసనా సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు : పొదుపు సంఘాలలో ఉన్న సభ్యుల జీవనోపాదుల పెంపుదలకు సంఘాల అధ్యక్షులు పనిచేయాలని డీఆర్‌డీఏ పీడీ లవన్న అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతి మహిళకు రుణాలు అందించి వారు ఉన్నత స్దితిలో ఉండేలా వారిని పోత్సహించాలన్నారు. స్త్రీనిధి, ఉన్నతి వంటి స్కీంల ద్వారా రుణాలను అందిస్తున్న ట్లు తెలిపారు. అనంతరం సంఘాలకు బయోమెట్రిక్ డివైస్‌లను అందజేశారు. ఈ సమావేశంలో స్త్రీనిధి మేనేజర్ రామకృష్ణ, ఏపీఎం కామేశ్వరి, సీసీలు కురుణాకర్, శ్రీనివాసమూర్తి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్‌డీసీ లవన్న

స్మార్ట్ కార్డులతో పారదర్శకంగా రేషన్



స్మార్ట్‌కార్డులు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ లక్ష్మీ

చినగంజాం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : చౌకధరల దుకాణాల ద్వారా సరఫరా చేసే బియ్యం, సరుకులు పక్కదారి పట్టకుండా స్మార్ట్‌కార్డులు పంపిణీ చేసి పారదర్శకంగా జరిగేలా కూటమి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటున్నట్లు సంతరావూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ లక్ష్మీ, పెదగంజాం గ్రామ సర్పంచ్ నక్కల కృష్ణలు అన్నారు. మండలంలోని సంతరావూరు, చినగంజాం, మున్నంవారిపాలెం, పెదగంజాం తదితర గ్రామాల్లో టీడీపీ నాయకులు గ్రామ కార్యదర్శులు, రేషన్ డీలర్ల, గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు కే.కృపారావు, కె.సునీత, టీడీపీ నాయకులు అబ్దుల్‌కలాం అజాద్, సందు శ్రీనివాసరావు, ఆసోది అంజిరెడ్డి, పల్లపట్ల శ్రీనివాసరెడ్డి, కుక్కల వెంకటేశ్వరరెడ్డి, బి.సతీష్, దేవతోటి నాగరాజు, ఆతిన సురేష్, కే.శ్యాంబాబు, దొడ్డి పవన్, గోవిందు సుబ్బారావు, షేక్.జిలాని, టి.దుర్గాప్రసాద్, ఆయా గ్రామాల రేషన్ డీలర్ల పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో చందుకు సత్కారం



చందును సత్కరిస్తున్న మోర్ధ సంస్థ నిర్వాహకులతో హైదరాబాద్ సిటీ డీసీపీ రామదాసు తదితరులు

మార్టూరు, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ ఆడిటోరియంలో మోర్ధ ఆర్గనైజేషన్ 28వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం రాత్రి మార్టూరులోని అమ్మ ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందును సత్కరించారు. అంతేగాకుండా చందు సేవలను గుర్తించి వారు ఉత్తమ సేవారత్న పురస్కారంతో శాలువాకప్పి జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు శ్రీనివాస్ వంశీకృష్ణ, హైదరాబాద్ సిటీ డీసీపీ రామదాసు, పలువురు సినీ రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి


- ఘనంగా పోషణ మాసోత్సవం

చీరాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని సీడీపీవో ఝాన్సీ పిలుపునిచ్చారు. శుక్రవారం 8వ రాష్ట్రీయ పోషణమాసం కార్యక్రమాన్ని రామకృష్ణాపురం, గాంధీనగర్, మున్సిపల్ పరిధిలోని శ్రీరాంనగర్ ప్రాంతాలలో ఘనంగా నిర్వహించారు. పిల్లలపోషణ బాధ్యత, ఆరోగ్య నిబంధన కేవలం తల్లికి మాత్రమే కాదు తండ్రి బాధ్యత కూడా అని చెప్పారు. సమాజంలో లింగసమానత్వం పెరుగుతోందన్నారు. ఇది అత్యంత మేలైన వాతావరణమని వివరించారు. ఆరోగ్యసూత్రాలను సూచించారు. కార్యక్రమంలో డా.జ్యోతి, సెక్రటరీలు ప్రభాకర్‌రావు, నక్కల శ్రీనివాసరావు, సూపర్‌వైజర్‌లు కముద్వతి, ప్రసన్నకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ మార్తమ్మ, ఏఎన్‌ఎం అలివేలు, మాధవి, సత్యవేదం, ఎంటీ కుమారి, అంగన్వాడీ ఇంద్రాణి, రోజా, గ్లోరీ, విజయకుమారి, ఆశ శివపార్వతి సిబ్బంది పాల్గొన్నారు.

శిశు సంరక్షణ అందరి బాధ్యత

బల్లికురవ : సమాజంలో శిశుసంరక్షణ అనేది మహిళలతో పాటు పురుషుల బాధ్యత అని ఐసీడీఎస్ సీడీపీవో సుధా పేర్కొన్నారు. మండలంలోని ఎస్ఎల్.గుడిపాడు గ్రామంలో పోషణ, సంరక్షణలో పురుషుల చురుకైన పాత్ర అనే అంశంపై సమావేశం నిర్వహించారు.

యద్దనపూడి,(మార్టూరు): పురుషులకు వంట పై అవగాహన కలిగించడమే పోషణ యొక్క ముఖ్య ఉద్దేశ్యమని సూపర్ వైజరు సుజాత అన్నారు.పోషణ మహా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యద్దనపూడి మండలంలోని జాగర్లమూడి గ్రామంలో ఆమె పర్యటించారు.



పోషణ మాసోత్సవంలో పాల్గొన్న సీడీపీవో సుధ

మాదక ద్రవ్యాలపై విస్తృత తనిఖీలు

● చీరాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన డీఎస్పీ మొయిన్



బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎస్పీ మొయిన్

చీరాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, ఇతర మాదకద్రవ్యాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇటీవల రైళ్లల్లో పెద్దమొత్తంలో గంజాయిని పట్టుకున్నారు. ఈక్రమంలోనే శుక్రవారం రాత్రి డీఎస్పీ ఎండీ మొయిన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈగల్ టీం, డాగ్ స్క్వాడ్‌తో చీరాల రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. రైళ్లల్లో, బస్‌లలో సోదాలు చేశారు. అనుమానితుల వివరాలు సేకరించారు. లగేజీ పరిశీలించారు. అసాంఘిక శక్తులపై చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. ఆయన వెంట వన్‌టౌన్ సీఐ సుబ్బారావు ఉన్నారు.

రిజిస్ట్రేషన్లలో నూతన విధానంపై అసహనం

● పునఃపరిశీలన చేయాలని వినతి

● చీరాలలో దస్తావేజులేఖర్ల పెన్‌డౌన్



సబ్‌రిజిస్ట్రారు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న లేఖర్లు

చీరాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశ పెట్టిన విధానాలతో దస్తావేజు లేఖర్లు, సహాయకులతో పాటు పరోక్షంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆ సంఘం ప్రతినిధులు అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం పెన్‌డౌన్ నిర్వహించి సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలకు తాము వ్యతిరేకం కాదన్నారు. అయితే నూతన విధానంలో కొన్ని సాంకేతిక సమస్యలతో సేవలు ఆలస్యంగా నడుస్తున్నట్లు వివరించారు. వెంటనే పునఃపరిశీలన చేయాలని కోరారు. కార్యక్రమంలో విజయ భాస్కరరెడ్డి, జగదీష్, సలీమ్, చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

మార్టూరులో దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

మార్టూరు : మార్టూరులో దస్తావేజులేఖర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఓటీపీ విధానానికి వ్యతిరేకంగా, ఇంకా తదితర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సహకరించాలని కోరుతూ వారు పెన్‌డౌన్ చేశారు. దీంతో వారి కార్యాలయాలు మూతపడ్డాయి. ఈ కారణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎలాంటి రిజిస్ట్రేషన్ జరగలేదని తెలిసింది.

పర్చూరు : పర్చూరు నియోజకవర్గ కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యలయం ఎదుట దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం అన్ని గ్రామాలలోని దస్తావేజు లేఖర్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు వచ్చి తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు కాల్వ సత్యనారాయణ, ఆదిపూడి మోహనకృష్ణ, తులసి శ్రీనివాసరావు, కారంపూడి సందీప్‌తేజ, యర్రా శ్రీనివాసరావు, రంగాశెట్టి రవికుమార్, పరిటాల రాజేష్, శ్రీరామచంద్రమూర్తి లింగారావు, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై భార్య ఫిర్యాదు

అద్దంకి,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులపై భార్య ఫిర్యాదు మేరకు శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన బత్తుల సంధ్యారాణికి క్రోసూరు మండలం ఊటుకూరుకు చెందిన స్వామితో రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. స్వామి నర్సరావుపేటలో ఫుడ్‌కార్పొరేషన్ కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. పెళ్లి జరిగిన మొదట్లో భర్త తనను బాగా చూసుకున్నారని, తన భర్త ఫోన్‌లో మహిళల ఫోటోలు కనిపించడంతో అడిగినప్పటి నుండి శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. అత్తమామలు కూడా భర్తకు మద్దతు ఇస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై నాగేశ్వరరావు తెలిపారు.

అద్దంకి ఆర్టీసీ డీఎం బదిలీ

అద్దంకి, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): అద్దంకి ఆర్టీసీ డీఎం బెల్లం రామ్మోహనరావు పుట్టపర్తి డిపోకు బదిలీ అయ్యారు. డిపో మేనేజర్ రామ్మోహనరావు పక్షం రోజుల కితం బదిలీ అయినప్పటికీ ఇటీవల ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు పర్యటన ఉన్న నేపథ్యంలో ఇప్పటి వరకు అద్దంకిలోనే విధులు నిర్వహించి గురువారం రాత్రి రిలీవ్ అయ్యారు. ఇన్‌చార్జ్‌గా చీరాల డిఎం శ్యామలను నియమించారు. అసిస్టెంట్ డీఎంగా పనిచేస్తున్న మహబూబి ఒంగోలు కార్గో ఇన్‌చార్జ్ డీఎంగా బదిలీ అయ్యారు. అయితే ప్రస్తుతం అద్దంకి అసిస్టెంట్ డీఎంగానే పనిచేస్తున్నారు. ఆర్టీసీలో ఇద్దరు కీలక అధికారులు బదిలీ కావడంతో కొత్త అధికారులను నియమించాల్సి ఉంది.

'రాయల్'గా బైకు కొట్టేశాడు..!

● వన్‌టౌన్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

చీరాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణంలో అర్ధరాత్రి దర్జాగా ఓ దుండగుడు రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాన్ని అపహరించాడు. వాహన యజమాని తన దుకాణం ముందు పార్కింగ్ చేసుకున్న వాహనాన్ని హ్యాండిల్ లాక్‌ను చాకిచక్యంగా తొలగించాడు. ఆ తర్వాత వచ్చి దర్జాగా బండిపై వెళ్లాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సీసీ కెమెరా ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నారు.




హ్యాండిల్ లాక్ తొలగిస్తున్న దుండగుడు

మా మనోభావాలు దెబ్బతిన్నాయి..!

● మహిళా పోలీసులు

సంతమాగులూరు సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి) గ్రామాల్లోని సచివాలయంలో పనిచేస్తున్న మహిళా పోలీసులను ఉద్దేశించి, వారి మనోభావాలు దెబ్బతినేలా ప్రకాశం జిల్లా జేసీ రోలంకి గోపాలకృష్ణ మాట్లాడడం తగదని వారు ఆరోపించారు. ఆమేరకు మండలంలోని పలువురు మహిళా పోలీసులు ఎంపీడీవో జ్యోతిర్మయికి వినతిపత్రం అందజేశారు. మహిళ పోలీసులమైన తమను ఉద్దేశించి, ప్రకాశం జేసీ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ.., గ్రామ మహిళా పోలీసులకు పనిఏమి ఉండదని చులకనగా మాట్లాడారన్నారు. కేవలం ఒక డిపార్ట్మెంట్ సిబ్బందికే పని ఉంటుందని, 'మహిళా పోలీసులు ఏం చేస్తున్నారో..? అర్థం కావడం లేదంటూ, ఏకవచనంతో మహిళ పోలీసులను అగౌరవపరిచారన్నారు. ఈ వ్యాఖ్యలపై తాము పూర్తిగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో నుండి డిపార్ట్మెంట్ వారికి అవసరమైన కీలక సమాచారాన్ని అందిస్తూ నేర నియంత్రణలో తాము భాగస్వాములవుతున్నట్లు తెలిపారు. ప్రజలకు చట్టాల మధ్య అవగాహన కల్పించడంలోనూ క్షేత్రస్థాయిలో క్రియశీలకంగా అనునిత్యంతాము కష్టపడుతున్నామన్నారు. తమకు సంబంధం లేని అనేక పనులు చేస్తున్నప్పటికీ ఇటువంటి వివక్షకు గురి చేసే మాటలు తమ మనోభావాలను దెబ్బతీశాయన్నారు. జిల్లా స్థాయి అధికారులు నోటి దురుసుతనము మూలంగా ప్రభుత్వాన్ని కూడా చెడ్డ పేరు వస్తుంది. అంతేకాకుండా మహిళా సాధికారతను ఇలాంటి వ్యాఖ్యలు విఘాతమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, కార్యక్రమంలో సంతమాగులూరు మహిళ పోలీసులు పాల్గొన్నారు.



జిల్లా ప్రధాన న్యాయాధికారితో ఎస్పీ భేటీ



నెల్లూరు (క్రైం): జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ శ్రీనివాస్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై ఇద్దరు సంభాషించుకున్నారు.

'పర్యాటకం'పై బకాయిల బండ!

- ఉమ్మడి జిల్లాలో బీచ్ రిసార్ట్స్
- ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో నిర్వహణ
- సుమారు రూ.80 కోట్ల వరకు అప్పు



నెల్లూరులోని హరితా హోటల్

ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఒకప్పుడు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రూ.కోట్లు ఖర్చు చేసి బీచ్ రిసార్ట్స్ నిర్మించింది. నిర్వహణ బాధ్యతలు మాత్రం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. ఆ వచ్చే ఆదాయంతో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయొచ్చని పాలకులు, అధికారులు భావించారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఇప్పుడు ఆ నిర్ణయమే గుదిబండగా మారింది. ప్రైవేటు వ్యక్తులు ఏళ్ల తరబడి అద్దె చెల్లించడం లేదు. పైగా వచ్చే పర్యాటకులకు కనీస వసతులు కూడా కల్పించడం లేదనే వాదనలు వినబడుతున్నాయి.

- వివరాలు 8లో..



వెంకటాచలం : కసుమూరులో భక్తుల రద్దీ

వేడుకగా గంధమహోత్సవం



ఏఎస్‌పేటలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వెంకటాచలం మండలం కసుమూరు, ఏఎస్‌పేటలలో శుక్రవారం గంధమహోత్సవం వేడుకగా జరిగింది. కసుమూరులోని మస్తాన్ వలి దర్గాలో కడప పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ, ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏఎస్‌పేటలోని హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా గంధమహోత్సవం కూడా వేడుకగా జరగింది. భక్తులు భారీగా తరలివచ్చారు.

- వివరాలు 8లో..

'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో

గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

అనంతసాగరం సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షానికి సోమశిల జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. గురువారం 18,715 క్యూసెక్కుల ప్రవాహం రాగా, శుక్రవారం 25,449 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో నీటి నిల్వ 73.866 టీఎంసీలకు చేరుకుంది. 5, 6 గేట్లు ఎత్తి దిగువ డెల్టాకు 19,650 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 400, కండలేరుకు వరద కాలువ ద్వారా 10,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

- **రాపూరు** : కండలేరు డ్యాంకు 10,100 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుతం 49.386 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 1330 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తు చేసుకుంటారా..

ధ్వంసం చేయమంటారా!?

'ఎల్ఆర్ఎస్'పై ఇంత లెక్కలేనితనమా!?

రియల్టర్లపై నుడా చైర్మన్ కోటంరెడ్డి ఆగ్రహం



'రాష్ట్ర ప్రభుత్వం సదుద్దేశంతో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు (ఎల్ఆర్ఎస్) అవకాశం ఇచ్చింది. కానీ చాలామంది రియల్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 437 అక్రమ లేఅవుట్లను గుర్తిస్తే కేవలం 23 లేఅవుట్ల యజమానులు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఇది ఎంతవరకు సబబు. ఇకపై ఉపేక్షించే ప్రసక్తే లేదు. గడువులోగా దరఖాస్తు చేసుకుంటే సరే. లేదా సదరు లే అవుట్లను ధ్వంసం చేస్తాం. వారికి వత్తాసు పలికే పంచాయతీ కార్యదర్శులు, అధికారులపైనా చర్యలు ఉంటాయి.'

- విలేకరుల సమావేశంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

- వివరాలు 8లో..

రిలయన్స్ భూముల్లో పరిశ్రమల ఏర్పాటు ఎప్పుడు?

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



ముత్తుకూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రిలయన్స్ భూముల్లో పరిశ్రమలను ఎప్పుడు ఏర్పాటు చేస్తారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి శుక్రవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలో రిలయన్స్ కంపెనీకి 2007లో ఎకరా రూ.7.5 లక్షల చొప్పున 2700 ఎకరాలు తీసుకున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు దాటుతున్నా ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయలేదని, అసలు ఆ కంపెనీ పరిశ్రమలు పెట్టగలదా, లేదా తెలియడం లేదన్నారు. కిసాన్ సెజ్‌లో 2600, రిలయన్స్ కోసం తీసుకున్న 2700 ఎకరాలు ఖాళీగా ఉన్నాయన్నారు. కృష్ణపట్నం సెజ్ కోసం రైతులకు ఎకరాకు రూ.4లక్షలు, ప్రభుత్వ భూమికి రూ.1లక్ష చెల్లించి 6వేల ఎకరాలకు పైగా సేకరించారన్నారు. దశాబ్దాలుగా ఈ భూములు ఖాళీగా మిగిలిపోయాయని, స్థానిక రైతు కూలీలకు కూడా ఉపాధి లేకుండా పోయిందన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయని భూములను వెనక్కు తీసుకుని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సమాధానమిస్తూ రిలయన్స్ భూముల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు ప్రకటించారు.



కనిగిరి రిజర్వాయర్‌ను ఆధునీకరించండి

- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, సెప్టెంబరు19, (ఆంధ్రజ్యోతి) : కనిగిరి రిజర్వాయర్ ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శుక్రవారం అసెంబ్లీలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. క్రస్ట్‌గేట్లు తుప్పు పట్టడంతో డ్యాంలో నీటి నిల్వ ఉండటంలేదన్నారు. 1.30 లక్షల ఎకరాలకు సాగునీరందించే రిజర్వాయర్‌ను



ఆధునీకరించి డెల్టా రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. అలాగే 2021లో వచ్చిన వరదలకు పెన్నానది పొర్లుకట్టలు ధ్వంసమై, పల్లిపాడులోని గాంధీ ఆశ్రమం వరద కోతకు గురైనట్లు తెలిపారు. అప్పటి ప్రభుత్వం దీనిని పూర్తిగా విస్మరించిందని చెప్పారు. పెనుబల్లి, పోతిరెడ్డిపాళెం, జమ్మిపాళెం, ముదివర్తి వద్ద పొర్లుకట్టలను బలోపేతం చర్యలు తీసుకోవాలన్నారు. 2,776 ఎకరాల్లో ఉన్న ఇఫ్కో సెజ్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించి, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కోరారు. అదేవిధంగా కొడవలూరు మండలం రాచర్లపాడు, బొడ్డువారిపాళెంలో ఉన్న ఏపీఐఐసీ పార్కులో పరిశ్రమలు నెలకొల్పేలా చూడాలని కోరారు.

రెవెన్యూ తీరు మారేనా!?

- పీజీఆర్ఎస్‌లో సగం రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు
- కొత్త కలెక్టర్‌కు సవాల్‌గా రెవెన్యూ శాఖ

రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే అర్జీల్లో 60 శాతం రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉంటున్నాయి. ఎక్కువ సవాళ్లు ఈ శాఖలోనే ఉన్నాయి. ఏ జిల్లాలో రెవెన్యూ సమస్యలు తక్కువగా వస్తే ఆ జిల్లా అధికారులు బాగా పనిచేస్తున్నట్లు లెక్క. ఎక్కడ ఎక్కువ సమస్యలు వస్తే అక్కడ కలెక్టర్ సహా జిల్లా యంత్రాంగం సరిగా పనిచేయడం లేదని అర్థం. రెవెన్యూ శాఖ పనితీరు మారాలి. ఇకపై నేను కూడా ఎక్కువగా రెవెన్యూ శాఖపై దృష్టి పెడతా.

- కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

మా భూమిని నిబంధనలకు విరుద్ధంగా మ్యుటేషన్ చేశారు. హైకోర్టును కూడా తప్పుదారి పట్టిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ కూడా ఈ మ్యుటేషన్‌ను డిస్ప్యూట్‌లో పెట్టమ ని ఉత్తర్వులిచ్చారు. కానీ అవతల వ్యక్తులు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునే వరకూ జేసీ ఉత్తర్వులు అమలు చేయలేదు. గతంలో అర్జీ ఇచ్చినప్పుడు మండలాధికారులపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. అయినా మాకు ఎటువంటి న్యాయం చేయలేదు. 104 రోజులు ఆర్డీవో తన లాగిన్‌లో మా అర్జీను ఉంచుకొని మళ్లీ పాత కథ మాదిరిగానే మండలాధికారులు ఇచ్చిన తప్పుడు సమాచారాన్ని మాకు ఇచ్చి అర్జీ క్లోజ్ చేశారు.

- ఇది ఇటీవల గ్రీవెన్స్‌లో ఓ బాధితుడి ఆవేదన

- సీఎం ఆదేశాలతోనైనా గాడిన పడేనా..!
- ప్రహసనంలా భూ సమస్యల పరిష్కారం
- మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ బాధితులు



ఎన్ని గ్రామసభలు నిర్వహించినా.. మరిన్ని సమావేశాల ద్వారా అర్జీలు స్వీకరించినా.. రెవెన్యూ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ఈ ప్రభావం ప్రజలపై తీవ్రంగా పడుతోంది. ఒకసారి వచ్చిన అర్జీదారుడే మళ్లీ అదే సమస్యతో ఉన్నతాధికారుల వద్దకు వస్తున్నారు. మరోవైపు ఈ అర్జీల పరిష్కా రంపై ఆడిట్ నిర్వహిస్తు న్నా పరిస్థితిలో మార్పు రాకపోతుం డడం ఆందోళన కలిగిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూ సమస్యలపై దృష్టి పెట్టింది. గత ప్రభుత్వంలో నిర్దిష్ట విధానం అంటూ లేకుండా చేపట్టిన రీసర్వే ద్వారా అనేక కొత్త సమస్యలు వచ్చాయని గుర్తించిన ప్రభుత్వం.. తొలుత రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సదస్సులు నిర్వ హించింది. 300లకుపైగా గ్రామాల్లో గతేడాది అక్టోబరు 19 నుంచి నవంబరు 14వ తేదీ వ రకూ రెవెన్యూ సదస్సులు జరిగాయి. అప్పుడు 8406 అర్జీలు ప్రజల నుంచి అందాయి. ఆ తర్వాత మరోసారి గతేడాది డిసెంబరు 6 నుంచి ఈ ఏడాది జనవరి 8వ తేదీ వర కూ జిల్లాలో 731 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈదఫా 8132 అర్జీలు భూ సమస్యలకు సంబంధించి అధికారులకు అందాయి. వీటన్నిటినీ పరిష్కరించినట్లు లెక్కలు చూపిస్తున్నారు. అయినా ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా విజ్ఞప్తుల కార్యక్ర మం (గ్రీవెన్స్)లో భూ సమస్యలకు సంబంధిం చిన అర్జీల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. గత నెల రోజుల్లో వచ్చిన అర్జీలను పరిశీలి స్తే.. ఆగస్టు 11న పీజీఆర్ఎస్‌లో 411 అర్జీలు రాగా అందులో 160 రెవెన్యూ, సర్వే శాఖలకు చెందినవే ఉన్నాయి. ఆగస్టు 18న పీజీఆర్ఎస్‌లో 426 అర్జీలు రాగా అందులో 163, ఆగస్టు 25న 426 అర్జీలు రాగా ఇందులో 212, సెప్టెంబరు 1న 436 అర్జీలు రాగా ఇందులో 192, సెప్టెంబరు 8న 515 అర్జీలు రాగా అందులో 252 అర్జీలు రెవెన్యూ, సర్వే శాఖలకు చెందినవే ఉండటం గమనార్హం. దీనిని బట్టి క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సమస్య పరిష్కారం కాలేదంటూ రీఓపెన్ అవుతున్న అర్జీల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోంది. మిగిలిన జిల్లాలతో పోలిస్తే రీఓపెన్ అర్జీల శాతం జిల్లాలో ఎక్కువగా ఉంటున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది.

తప్పులు తేలినా చర్యల్లేవు!

గత ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాలు అన్నీ ఇన్నీ కాదు. పేదల ఇళ్లకు భూమి కొనుగోలు, ఫ్రీహోల్డ్ పేరుతో అసైన్‌మెంట్ భూములు కొట్టేయడం వంటి అక్రమాలు ఇప్పటికే బయటపడ్డాయి. అయితే ఈ కుంభకోణాలపై ప్రభుత్వ నిర్ణయం కావాలంటూ జిల్లా అధికారులు తప్పించు కుంటున్నారు. పోనీ జిల్లాస్థాయిలో తీసు కోవాల్సిన చర్యలపైనా తగిన విధంగా స్పందిస్తున్నారా.. అంటే అదీ లేదు. జిల్లాలో అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ వ్యవహారంపై మాత్రం ఇంతవరకూ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. పేదలు కాకపోయినా వైసీపీ నాయకులు అనే అర్హతతో గత ప్రభుత్వంలో ప్రభుత్వ భూములను ధారాదత్తం చేశారు. కొండ పోరంబోకులు, చెరువు పోరంబోకులు వంటి భూములనూ కట్టబెట్టారు. ఇంకొందరైతే ఏకంగా ప్రభుత్వ భూములను వారి పేర్లపైకి మార్చుకున్నారు. ఒక్కొక్కటిగా ఇటువంటి అక్రమాలు వెలుగులోకి వస్తున్నా రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకోవడంలో విఫల మవుతోంది. ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనంలో చేసుకోవడం లేదు. నూరా యపాలెంలోని మేత పోరంబోకు భూములే ఇందుకు ఒక ఉదాహరణ. ఈ పరిస్థితుల నేపథ్యంలో జిల్లా నూతన కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా బాధ్యతలు చేపట్టారు. ఆయన వచ్చీ రాగానే జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో కూడా రెవెన్యూ శాఖ పనితీరుపై సీఎం చంద్రబా బు దిశానిర్దేశం చేసి పంపారు. మరి రెవెన్యూ శాఖను గాడిలో పెట్టేందుకు కొత్త కలెక్టర్ ఎటువంటి ప్రణాళికలు రూపొందించుకుంటారన్నది చూడాలి.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

ఇక క్రీడా సంబరం!

ప్రతిష్టాత్మకంగా సంసద్ ఖేల్ మహోత్సవ్-2025

జిల్లాలో 100 రోజులపాటు నిర్వహణ

ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం

వివరాలు 8లో..

ఈ ఏడాది పన్ను లక్ష్యం రూ.100 కోట్లు

- రెవెన్యూ అధికారులతో ఆర్డీఎంఏ హరికృష్ణ

నెల్లూరు(సిటీ),సెప్టెంబరు 19,(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ఈ ఏడాది రూ.100 కోట్లు పన్ను వసూళ్ల లక్ష్యంగా రెవెన్యూ అధికారులు పని చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీఎంఏ) హరికృష్ణ ఆదేశించారు. శుక్రవారం ఎన్ఎంసీలో రెవెన్యూ విభాగంతో కమిషనర్ నందన్‌తో కలిసి ఆయన సమీక్షించారు. రాష్ట్రంలోని 15 కార్పొరేషన్‌లతో పోటీపడుతున్న తొలి నాలుగు స్థానాల్లో నిలిచే విధంగా పన్ను వసూళ్లు చేయాలని సూచించారు. వాణిజ్యపరంగా మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. గతేడాది వీఎల్టీల ద్వారా వచ్చిన పన్నులను ఈ ఏడాది కూడా వసూళ్లు చేయాలని, ఆ దిశగా సచివాలయ అడ్మిన్లు చొరవ చూపాలని సూచించారు. లేకపోతే శాఖపరమైన చర్యలు తప్పని హెచ్చరించారు. కొత్త భవనాల్లో అదనపు అంతస్తులు, రెసిడెన్షియల్ నుంచి కమర్షియల్‌కు మారిన భవనాల పన్నులను నిష్పక్షపాతంగా వేయాలన్నారు. ఈ సమీక్షలో డీసీ చెన్నుడు, ఆర్వోలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

గుడ్లూరులో ఇండస్ట్రియల్ హబ్

- వేగవంతంగా భూసేకరణ : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గుడ్లూరు మండలం చేవూరు గ్రామంలో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వం వేగవంతంగా చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. 15090 ఎరాకలు ఈ హబ్‌కు అవసరం కాగా ఇప్పటి వరకు 1875 ఎకరాలు భూసేకరణ పూర్తయి, పరిశ్రమల కోసం సిద్ధంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో మరింత వేగవంతంగా భూసేకరణ జరుగుతుందని వివరించారు. ఈ హబ్‌లో భారత పెట్రోలియం కార్పొరేషన్ వంటి ప్రధాన పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని, వీటిద్వారా ప్రత్యక్షంగా వేలాది మంది యువతకు ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం న్యాయపరమైన పరిహారం అందజేస్తుందని తెలిపారు.

'వాహన మిత్ర' గడువు పెంపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : వాహన మిత్ర పథకం దరఖాస్తు గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. వాహన రిజిస్ట్రేషన్ కార్డు, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ తదితర సర్టిఫికెట్స్‌తో అర్హులైన వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గతంలో 2023 ఈ పథకం కోసం దరఖాస్తు చేసిన వారు మరలా చేసుకోవాల్సిన అవసరం లేదని, ఇప్పటి వరకు దరఖాస్తు చేయని వారు మాత్రమే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


మబ్బులు పట్టి... వాన కురిసి!

ఉదయం నుంచి సెగలు కక్కిన భానుడిని మబ్బులు కమ్మేశాయి. ఆ తర్వాత మధ్యాహ్నం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వాతావరణాన్ని చలబరిచింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి జిల్లాలోని పలుప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కోతలు పూర్తయి, ధాన్యాన్ని ఆరబెట్టుకున్న రైతులు ఇబ్బందులకు గురయ్యాయి. ఇక నగరంలోని లోతట్టు ప్రాంతాలు, రోడ్లపై నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



నెల్లూరు నగరాన్ని కమ్మేసిన కారు మబ్బులు, వర్షంలో మోటారు సైకిలిస్ట్



యూరియా పంపిణీకి

యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి

రైతుల అవసరాలను గుర్తించాలి

వ్యవసాయ అధికారులతో కలెక్టర్ శుక్లా

నెల్లూరు (వ్యవసాయం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): యూరియా అవసరాలు, పంపిణీకి సంబంధించి మండలాల వారీగా రైతుల అవసరాలను గుర్తించి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వ్యవసాయ, అనుబంధ శాఖలతో కలెక్టర్ సమీక్షించారు. ప్రతి రైతుకు నిర్ణీత కార్డులను అందజేసి యూరియా పంపిణీ వివరాలను అందులో నమోదు చేయాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతుల అవసరాలకు అనువైన యంత్రాలను గుర్తించాలని వాటి ఖరీదు, కూలీల ద్వారా అయ్యే ఖర్చులు రెండింటినీ బేరీజు వేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. యంత్రాల కొనుగోలుకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించాలని సూచించారు. మైక్రో ఇరిగేషన్‌కు సంబంధించి ఈ ఏడాదికి నిర్దేశించిన 6వేల హెక్టార్లకు సంబంధించి పరిపాలన అనుమతులను అక్టోబరు మొదటి వారంలోపు మంజూరు చేయాలని సూచించారు. ఈ సమీక్షలో జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి, డీసీఓ గురప్ప, మత్స్యశాఖ జేడీ శాంతి, పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	138
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	272

కోడిగుడ్ల ధర (100): 560

స్వచ్ఛతా సేవా కార్యక్రమంపై అవగాహన

కావలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా సేవా కార్యక్రమంపై శుక్రవారం కావలి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ అధికారులు, సిబ్బందికి మున్సిపల్ కమిసనర్ జీ. శ్రావణ్‌కుమార్ అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కార్మికులకు పీపీ కిట్లు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులు ఎన్‌జీవోలతో కలిసి కావలి పట్టణం వెంగళరావునగర్‌లోని అమృత్‌పార్కును శుభ్రం చేయించారు. అనంతరం నలందస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు స్వచ్ఛతపై మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించి వారిచేత ప్రతిజ్ఞ చేయించారు.



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్

న్యూస్ బాక్స్

అల్లూరులో దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

అల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖ ప్రవేశపెట్టిన ఓటీపీ ప్రక్రియను రద్దుచేయాలంటూ దస్తావేజు లేఖరులు చేపట్టిన రాష్ట్రవ్యాప్త పెన్‌డౌన్ కార్యక్రమాన్ని అల్లూరులో శుక్రవారం స్థానిక దస్తావేజు లేఖరులు చేపట్టారు. ఈ సందర్భంగా సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలో ఎటువంటి రిజిస్ట్రేషన్లు జరగలేదు. దీంతో వచ్చిన కక్షిదారులు వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్, గోపీనాథ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితోనే సమాజాభివృద్ధి



వాల్మీకి

కావలి (టౌన్) సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమని ప్రముఖ మోటివేటర్ వ్యాస చంద్రశేఖర్ వాల్మీకి పేర్కొన్నారు. శుక్రవారం మద్దూరుపాడులోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, నైపుణ్యాభివృద్ధిపై మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమస్యలను అధిగమించి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు, ప్రిన్సిపాల్ టీవీ రావు, డిప్లమా ప్రిన్సిపాల్ రమణయ్య, ఏవో రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి

కావలి (టౌన్) సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మొక్కలు నాటారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధుకర్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అనీల్‌కుమార్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు భావితరాలకు మేలు చేస్తాయని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు.

17వ వార్డులో డ్రై డే!

కందుకూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 17వ వార్డులో మున్సిపల్ కమీషనర్ కె అనూష ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యసిబ్బంది డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు శుభ్రం చేయటంతో పాటు దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్, అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గృహాల పరిసరాల్లో కూలర్లు, నీటితొట్టెలు, పాత టైర్లు, కుండీలలో తాగిపడేసిన కొబ్బరిబోండాలలో వర్షపునీరు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాటిలో పెరిగే దోమలతో డెంగ్యూ, మలేరియా లాంటి విష జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



అంటువ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

కమ్ముకున్న కారుమబ్బులు

బిట్రగుంట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చి కారుమబ్బులు కమ్ముకున్నాయి, అల్పపీడనం వలన కురిసిన వర్షాలకు వరి పైరులో నీరుచేరి ఇప్పుడిపుడే కోలుకుంటున్న రైతన్నకు కారుమబ్బులు చూసి గుండెల్లో గుబులు రేగింది. కాగా, చిరుజల్లులకు పరిమితమైన వరుణుడు శాంతించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.





దస్తావేజు లేఖర్ల నిరసన

కావలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ విధానంలో నూతనంగా ప్రవేశపెట్టిన విధానాల వలన రిజిస్ట్రేషన్ చేయించుకునే వారు, చేసేవారు, డాక్యుమెంట్ రైటర్లు ఇబ్బందులు పడుతున్నారని, దానిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కావలిలో శుక్రవారం డాక్యుమెంట్ రైటర్స్, స్టాంప్ వెండర్స్ పెన్‌డౌన్ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్‌లో ఉన్న లోపాలను సరిచేయాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పాత విధానంలో రిజిస్ట్రేషన్‌లు కొనసాగించాలని కోరారు. ఈ స్టాంప్ విధానాన్ని తొలగించి నాన్‌జ్యుడిషియల్ స్టాంప్‌లను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చలంచర్ల నాగరాజు, పీడీఎం ప్రసాద్, స్టాంప్ వెండర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషయ్య, షేక్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రంలో దంచికొట్టిన వాన

లింగసముద్రం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం సాయంత్రం లింగసముద్రంతో పాటు పలు గ్రామాలలో వర్షం దంచి కొట్టింది. సుమారు అరగంట పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి రోడ్లు, వీదులు జలమయమయ్యాయి. లింగసముద్రంలోని ఆర్ అండ్‌బీ రోడ్డుపై వర్షపు నీరు భారీగా ప్రవహించింది. మండలంలో ఇటీవల సాగు చేస్తున్న పొగనార్లు, జొన్నమేత, పత్తి పైర్లకు వర్షం మేలు చేకూరుస్తుందని రైతులు చెబుతున్నారు.





మా సమస్యలు పరిష్కరించండి

- మున్సిపల్ కార్మికుల ధర్నా

కావలి (టౌన్) సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పట్టణ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందని, ఎన్నికల హామీలు విస్మరించిందన్నారు. జులై నెల సమ్మె కాలం జీతం ఇవ్వాల్సి వుందని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.7లక్షలు, మట్టి ఖర్చులు రూ.20,000, వయసు, పేరుతో తొలగించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి పని ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి ప్రవీణ్, యూనియన్ అధ్యక్షుడు బాబు, కార్యదర్శి క్రాంతికుమార్, తురకా శీనయ్య, రమేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీజు పనులు త్వరగా పూర్తి చేయండి

- రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించిన ఈఈ మునిరత్నం

లింగసముద్రం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో పాత, కొత్త స్పిల్‌వేలలో గేట్లకు గ్రీజు పెట్టే పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రాజెక్టు ఈఈ జి మునిరత్నం సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన డీఈఈలు ఎం వెంకటేశ్వర్లు, పి శేషయ్యలతో కలిసి ప్రాజెక్టును తనిఖీ చేశారు. అలాగే రెండు స్పిల్‌వేలలోని గేర్ బాక్స్‌లు, గేట్ల రోప్‌లకు గ్రీజు, క్యాడ్మియమ్ కాంపౌండ్ పెట్టే పనులను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రాజెక్టు నిండి గేట్లు ఎత్తాల్సిన పరిస్థితి వస్తే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గేట్లు ఎత్తడంలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికారులు, సిబ్బంది గ్రీజు పెట్టే పనులు పూర్తి చేయాలన్నారు.









కొండాపురంలో కేకును తినిపించుకుంటున్న టీడీపీ నాయకులు, మక్కెనవారిపాలెంలో పూజలు

కలిగిరిలో కేకు కట్ చేస్తున్న బిజ్జం కృష్ణారెడ్డి

ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల జన్మదిన వేడుకలు

కావలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలను శుక్రవారం సాయంత్రం ఆయన అభిమానులు కావలిలో ఘనంగా నిర్వహించారు. రైతుసంఘం నాయకుడు రామిరెడ్డి క్రిష్టారెడ్డి ఆధ్వర్యంలో కావలి కలుగోళ్ల శాంభవి అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే కాకర్ల పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడకు వచ్చిన వారికి మిఠాయిలు పంపిణీ చేశారు.

● **కొండాపురం :** ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలు శుక్రవారం మండలంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో బస్టాండు సెంటర్లో 20 కేజీల భారీ కేకును కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈకార్యక్రమంలో మండలపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పోలినేని చంద్రబాబునాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు గంటా లక్ష్మీనరసింహులు, యారవ క్రిష్ణయ్య, బొట్లగుంట హరిబాబు, పోలినేని రమేష్, తెలుగు యువత అధ్యక్షుడు దాసరి అశోక్, జాగర్లమూడి శ్రీనివాసులు, దామా శివబాబు, మండల మహిళా అధ్యక్షురాలు చిమ్మిలి శ్రీదేవి, పలుగ్రామాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మక్కెనవారిపాలెంలో..

మండలంలోని సాయిపేట పంచాయతీ



జలదంకి : వేడుకల్లో కాకర్ల

మక్కెనవారిపాలెంలో మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, టెలికాం బోర్డు అడ్వైజరీ మెంబరు తాటికొండ అనూషల ఆధ్వర్యంలో స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కాకర్ల సురేష్ పుట్టినరోజును పురస్కరించుకొని ప్రత్యేక పూజలుచేశారు. వికలాంగులకు పండ్లు పంపిణీచేసి మొక్కలు నాటారు. వెల్లటూరివారిపాలెం గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు స్వీట్లు, చాక్లెట్లు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

జలదంకి, జమ్మలపాలెంలో...

జలదంకి : ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలు శుక్రవారం రాత్రి జలదంకి, జమ్మలపాలెం గ్రామాల్లో జరిగాయి. అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న ఎమ్మెల్యే రాత్రి జలదంకి మండలానికి చేరుకొని పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన బర్త్‌డే కేకును కట్ చేసి అభిమానుల మధ్య వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి కేకులు తినిపించారు. ఈ వేడుకల్లో మండల పార్టీ అధ్యక్షుడు మధురెడ్డి, నాయకులు జయచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అప్పలనాయుడు, పెంచలనాయుడు వినోద్, మందపల్లి మాల్యాద్రి, ఎం సుబ్బారెడ్డి, మధునాయుడు, హరిబాబు, తిరుమలరెడ్డి, రఘు పాల్గొన్నారు.

● **కలిగిరి :** ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదినాన్ని శుక్రవారం టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాసిం నరసింహులు నాయుడు, గన్నమనేని శ్రీనివాసులు, చేరెడ్డి సుబ్బారెడ్డి, మాదాల శ్రీనివాసులు, స్వర్ణ కొండయ్య, పార్టీ సీనియర్ నాయకులు, బూత్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలను తరచూ తనిఖీ చేయాలి

- జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

కావలి రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎంఈవోలు తరచూ పాఠశాలలను తనిఖీలు చేస్తూ ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సూచించారు. కావలి పట్టణ ముసునూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటూ తమ దృష్టికి తీసుకురావాలని ఎంఈవోలు గోవిందయ్య, వెంకట సుబ్బయ్యలకు సూచించారు. పాఠశాలలో నూతన మరుగుదొడ్ల నిర్మాణాని కి, మరమ్మతులకు రూ.3.30 లక్షలు నిధులు మంజూరు చెయ్యటం జరిగిందన్నారు. అనంతరం విద్యా ర్థుల హాజరు తనిఖీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జంపాని రాఘవులు, ఎమ్పీడీవో శ్రీదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగన్నాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మరుగుదొడ్లు పరిశీలిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

దేశాభివృద్ధిలో స్త్రీశక్తి కీలకం : డిప్యూటీ డీఎంహెచ్‌వో

కావలి,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో స్త్రీశక్తి కీలకం అని, మహిళల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను ప్రవేశపెడుతున్నాయని కావలి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత తెలిపారు. కావలి పట్టణం రాజీవ్‌నగర్ అర్బన్‌హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ సహకారంతో శుక్రవారం ఆ హెల్త్ సెంటర్‌లో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం జరిగింది. డాక్టర్ బ్రిజిత మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలోని మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా దేశంలోని ప్రజలందరికీ మెరుగైన సేవలు అందించేందుకు కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత

అనంతరం డాక్టర్ రామ్‌సెంటర్ వారు ఐరన్, పొలిక్, కాల్షియం సిరప్‌లు పిల్లలకు మల్టీవిటమిన్ సిరప్‌లు పం పిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్‌హెల్త్ సెంటర్ డాక్టర్ మేఘనాధచౌదరి, గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీ, ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య, డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ముడిగండ్ల మాలకొండారెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణీ, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఉలవపాడులో...

ఉలవపాడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉలవపాడు సచివాలయం1 పరిధిలోని జనరల్ ప్రాథమిక పాఠశాలలో 'స్వస్త్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ అనిల్‌కుమార్, సిబ్బంది రోగులకు వైద్యసేవలు అందించారు. స్త్రీలకు సంబంధించిన క్యాన్సర్, మాతాశిశు సంరక్షణ వ్యాక్సీన్‌లపై అవగాహన కల్పించారు. వాతావరణ మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధుల నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. వైద్యశిబిరంలో 153 మందికి బీపీ, షుగర్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది పోషక పదార్థాలతో కూడిన వంటకాలు చేసి స్టాల్ నిర్వహించారు. తల్లులు, పిల్లలకు పాలు, గుడ్లు తదితర పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచు నాగలక్ష్మి, కమ్యూనిటీ హెల్త్ అధికారులు, గ్రామీణ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సీఎల్‌పురంలో...

బిట్రగుంట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలోని నాగులవరం పీఏసీఎస్ ఆవరణంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా కోవూరుపల్లి వైద్యులు రామకృష్ణ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల టీడీపీ కన్వినర్ ఎం.నాగేశ్వరరావు, సింగల్ విండో అధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిధులుగా హాజరై ప్రారంభించారు. నోటి, గర్భాశయ క్యాన్సర్లకు, గుండె సంబంధిత వ్యాధులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమం లో పీఏసీఎస్ డైరెక్టర్లు ఎల్.మాధవరావు, వీ.సుధాకర్, సీహెచ్‌వో నజీమున్నీసా, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



ఉలవపాడులో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

రైతులు మట్టి ఆరోగ్య కార్డులు కలిగి ఉండాలి



ఉలవపాడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ రైతు మట్టి ఆరోగ్య కార్డు కలిగి ఉండాలని, అందులోని వ్యవసాయ పద్ధతులను పాటించాలని కందుకూరు భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయాధికారిణి గీతాప్రకాష్ సూచించారు. మండలంలోని వీరేపల్లి మోడల్ పాఠశాలలో నేల ఆరోగ్యంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ భూమిలోని పోషకాల స్థితిని బట్టి ఎరువులు, సూక్ష్మ పోషకాలను వాడటం వల్ల పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చన్నారు. కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వెంకటేష్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికను ఉపయోగించి నేల పరీక్షలు ఎలా చేయాలి? ఎలాంటి పద్ధతులను అనుసరించాలనే విషయాలపై ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మంజుల, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్లకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి

- సీఐటీయూ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్

లింగసముద్రం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం లింగసముద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో సీఐటీయూ మండల మహాసభ కన్వీనర్ బి మార్తమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్కీం వర్కర్లయిన అంగన్‌వాడీ, ఆశా, మిడ్ డే మీల్స్ తదితర కార్మికులకు జీతాలు పెంచకుండా, వెట్టి చాకిరీ చేయిస్తున్నారన్నారు. కార్మిక హక్కులను కాలరాసి నాలుగు లేబర్ కోడ్లు విధించి, కార్మికులను వీధుల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, రాయితీలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్‌గా బి మార్తమ్మ, కో కన్వీనర్‌గా షేక్ ఆలీషా, మరో 19 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె వెంకయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు ఫరీమా, ప్రమీల, సుగుణ, ప్రభావతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం

దగదర్తి (బిట్రగుంట) సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఎంఈవో భాస్కర్ ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంఈవోలు ఎం.భాస్కర్, జి.విజయత్నం మాట్లాడుతూ 19, 20 తేదీల్లో మండల స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. కోకో, కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ బ్యాట్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు అండర్-14, అండర్-17 విద్యార్థులకు నిర్వహిస్తునట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ ఎస్.శ్రీనివాసులు, పీడీ, పీఈటిలు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభంలో త్రోబాల్ వేస్తున్న హెచ్ఎం మారుతి

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'పోషణ్ మహా'

కందుకూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో సీడీపీఓ ఉషారాణి ఆదేశాలతో శుక్రవారం 'పోషణ్ మహా' కార్యక్రమాన్ని నిర్వహించారు. మోపాడు 2 అంగన్‌వాడీ సెంటర్‌లో సూపర్‌వైజరు యు ప్రభావతి ఆధ్వర్యంలో, శ్రీనగర్‌కాలనీ 2 అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజరు ఎస్‌కే షకీలాబేగం ఆధ్వర్యంలో, ఖాజీపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజరు ఎల్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో 'పోషణ్ మహా' కార్యక్రమం నిర్వహించి పౌష్టికాహార ఆవశ్యకతను వివరించారు. మోపాడులో అంగన్‌వాడీ కేంద్రాలకు తమసంస్థ సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని వరల్డ్‌విజన్ సంస్థ మేనేజరు యాషియ్య కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుభాషిణి, లలితలక్ష్మి, శ్రీలక్ష్మి, కేశవకుమారి, శ్రీదేవి, శ్రీలక్ష్మి, రమాదేవి, కోటిరత్నం, యాస్మిన్, విజయకుమారి, నూర్జహాన్, రహంతున్నీషా, నసీమ్, షైమూన్, కె ఇందిర తదితరులు పాల్గొన్నారు.



పోషకాహార ప్రమాణం చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు



నిరసన తెలుపుతున్న మజ్దూర్ యూనియన్ సభ్యులు

రైల్వే కార్మికులకు పే కమిషన్ కమిటీ వేయాలి

బిట్రగుంట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైల్వే కార్మికులకు పేకమిషన్ కమిటీని ఏర్పాటు చేయాలని సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బిట్రగుంట బ్రాంచ్ చైర్మన్ మద్దిబోయిన శేఖర్ డిమాండ్ చేశారు. ఏఐఆర్ఎఫ్ మరియూ ఎస్‌సీఆర్ఎంయు ఆదేశాల మేరకు బిట్రగుంట పీడబ్ల్యూపీవే కార్యాలయం ఎదుట రైల్వే కార్మికులతో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కమిటీ సభ్యులు వీఎస్.బాబు, ఆర్వీ.నరసయ్య, పీఆర్.బాబు, రైల్వే రిటైర్డ్ అసోసియేషన్ చైర్మన్ ఎస్.శ్రీనివాసులు, కార్యదర్శి టీ.రామయ్య, రైల్వే కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వరుణదేవా.. రావొద్దు స్వామీ!

రోడ్ల పక్కన ధాన్యపు రాశులు

ఆందోళనలో అన్నదాతలు



కోవూరు పరిసర గ్రామాల్లో పలు చోట్ల శుక్రవారం వర్షం పడటంతో అప్పుడే కోసిన వరిధాన్యం తడిసిపోయింది. పొలం నుంచి వరి కోత యంత్రం ద్వారా వెలుపలికి వచ్చిన ధాన్యం తడవడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారు. వెంటనే టార్పాలిన్ పట్టల్ని కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు. పలుచోట్ల వరికోత యంత్రాల్లో చేరిన వరిధాన్యం తడవడంతో మిల్లర్లు ధాన్యాన్ని తమ వెంట లారీల్లో తీసుకువెళ్ళేందుకు నిరాకరించారు. రైతుల అభ్యర్థన మేరకు ధర తరువాత చెబుతామంటూ ధాన్యాన్ని తరలించారు. కోవూరు, గంగవరం, పాటూరు, మోడేగుంట, వేగూరు గ్రామాల్లో ధాన్యంలో నెమ్ముశాతం తక్కువగా ఉందని గట్లపైనా, రోడ్ల పక్కనే వదిలేసి వెళ్ళారు. పొలాల్లో కల్లాలు లేకపోవడంతో ధాన్యం వర్షానికి తడవకుండా పట్టలు కప్పి రైతులు జాగ్రత్తలు తీసుకున్నారు.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)

ప్రకృతి వైపరీత్యాల్లో ప్రజలను కాపాడటమే ప్రథమ కర్తవ్యం : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలను కాపాడటమే జిల్లా యంత్రాంగం ప్రథమ కర్తవ్యం కావాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. కలెక్టరేట్ శంకరన్ హాల్లో శుక్రవారం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తుల సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సురక్షితంగా కాపాడేందుకు ముందస్తు ప్రణాళిక అవసరమన్నారు. వైద్యశాలలు, తదితర వివరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అధికారులందరూ తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ పాల్గొన్నారు.



ఇది.. కూడా రోడ్డేనట!



గుంతలుమిట్టలుగా పైచిత్రంలో కనిపిస్తున్నది రోడ్డునట. దీనిపై నిత్యం వాహనచోదకులు అవస్థలు పడుతూ ముందుకుసాగుతున్నారు. అనంతసాగరం మండలం సోమశిల ప్రధాన రహదారికి పట్టిన గతి ఇది. ఉప్పలపాడు నుంచి సోమశిల వరకు రోడ్డుపై మోకాలు లోతు గుంతలు ఉన్నాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు దుస్థితిని గమనించి, అధికారులు మరమ్మతులు చేయించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)

'పర్యాటకం'పై బకాయిల బండ!

- ఉమ్మడి జిల్లాలో 9చోట్ల బీచ్ రిసార్ట్స్
- నిర్వహణ అంతా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి
- ఏళ్ల తరబడి వసూలుకాని అద్దెలు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ నిర్వహణ లోపం కారణంగా జిల్లాలో పర్యాటక అభివృద్ధి పడకేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన బీచ్ రిసార్ట్స్‌ను ఆ సంస్థ ప్రైవేటు వ్యక్తులకు లీజుకి ఇచ్చి, పర్యాటకులకు సేవలు, సౌకర్యాలు అందించడం మానుకుంది. లీజుకి తీసుకున్న ప్రైవేటు వ్యక్తులు పర్యాటకులకు సరైన వసతులు కల్పించకుండా అధిక ధరలు వసూలు చేసుకుంటూ ఆ సంస్థకు లీజు బకాయిలు చెల్లించడంలేదని తెలిసింది. ఆ లీజు బకాయిలు ఇప్పుడు రూ.80 కోట్లకుపైగా పేరుకున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవపోవడంతో జిల్లాస్థాయి అధికారులు బీచ్ రిసార్ట్‌ల (ప్రైవేటు) యజమానుల అక్రమాలకు తలలు ఊపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

రిసార్ట్స్‌లకు రూ. కోట్ల వ్యయం

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 9 బీచ్ రిసార్ట్స్‌ను ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ రూ.కోట్లు వ్యయం చేసి నిర్మించింది. ఆ సంస్థ వాటిని నిర్వహించకుండా ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చింది. లీజులు వసూలు కాక బకాయిలు పేరుకుపోయాయి.

- **మైపాడు బీచ్ రిసార్ట్ :** హోటల్ కం బార్‌ను 15 ఏళ్లకు లీజుకి ఇచ్చింది. నెలకు రూ.2.50లక్షలకు లీజుదారుడు పర్యాటకాభివృద్ధి సంస్థకు చెల్లించాలి. లీజుకు తీసుకున్నప్పటి నుంచి ఆ వ్యక్తి సక్రమంగా చెల్లించడంలేదు. కాగా విద్యుత్ శాఖకు రూ.2.50 లక్షలు కరెంటు బిల్లు బకాయి పెట్టడంతో 15రోజులకుపైగా విద్యుత్‌ను ఆ శాఖ కట్ చేసింది. మైపాడు బీచ్, రిసార్ట్, హోటల్, బార్ల నిర్వహణ అత్యంత అధ్వానంగా ఉందని పర్యాటకులు చేసిన ఫిర్యాదుపై జిల్లాస్థాయి అధికారి పరిశీలించి లీజుదారుడికి గట్టి హెచ్చరికలు చేశారు.
- 2023లో కొత్త కోడూరు బీచ్ రిసార్ట్స్‌ను నెలకి రూ.50వేలు చొప్పున లీజుకి ఇచ్చింది. 2024లో ఇస్కపల్లి బీచ్, రామతీర్థం రిసార్టును 15 ఏళ్లకు, 2009లో తుమ్మలపెంట బీచ్, రిసార్టును 33 ఏళ్లకు లీజుకి ఇచ్చారు. ప్రతి నెలా రూ.1.30 లక్షలు చెల్లించాలి. నెలనెలా లీజు మాత్రం చెల్లించడంలేదు. ఏటా లీజును 5 శాతం పెంచాలి.
- రామాయపట్నం బీచ్ రాసార్ట్స్‌ను 2022లో 1 ఏళ్లకు లీజుకి ఇచ్చారు. లీజుకి తీసుకున్న వ్యక్తి నెలకి రూ.95వేలు లీజు చెల్లించాలి. అయితే లీజును సక్రమంగా చెల్లించడంలేదని తెలిసింది.
- నేలపట్టు బీచ్ రిసార్ట్‌ను నెలకి రూ.73వేలు లీజు చొప్పున 2022లో 15 ఏళ్లకు ప్రైవేటు వ్యక్తులకు లీజుకి ఇచ్చారు. సక్రమంగా లీజు చెల్లించకపోగా వేరే వ్యక్తికి యోగా కేంద్రం సబ్ లీజుకి ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు.
- 2022లో దొరవారిసత్రం బీచ్ రిసార్టును ప్రైవేటు వ్యక్తులకు నెలకి రూ.97వేల చొప్పున అద్దెకు 15 ఏళ్లపాటు పర్యాటకాభివృద్ధి సంస్థ లీజుకి ఇచ్చింది. లీజులు మాత్రం సక్రమంగా వసూలు కావడంలేదు.
- బీవీపాలెం బీచ్ రిసార్టును 2023లో నెలకి రూ.2లక్షలు అద్దె ప్రాతిపదికన 20 ఏళ్లకు లీజుకి ఇచ్చారు.


ఈ బీచ్ రిసార్టుల్లో వీకెండ్, ఇతర ప్రత్యేక దినాలతోపాటు ప్రతి రోజూ పర్యాటకులు విడిది చేస్తున్నారు. వ్యాపారం సాగుతున్నా లీజుదారులు మాత్రం సక్రమంగా నెలవారీ అద్దెలు చెల్లించలేదు. దీంతో బకాయిలు పేరుకుపోయాయి. దాదాపు రూ.80కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయి. అయితే ఈ విషయాన్ని గోప్యంగా ఉంచింది.



రామాయపట్నం బీచ్ రిసార్ట్ (ఫైల్)

- **తాగాజా ప్రైవేటుకు 'హరితా'**

తాజాగా రాష్ట్రంలోని 23 హరితా హోటళ్లను ప్రైవేటు పరం చేసేందుకు ఆ సంస్థ ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇందుకుగాను ఆ సంస్థ రూ.150కోట్లు అప్పు చేసి హరితా హోటళ్లను మరమ్మతులు చేస్తున్నారు. అయితే లీజుల బకాయిల వసూళ్లపై ప్రభుత్వం పెద్దలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



మైపాడు బీచ్ రిసార్ట్ (ఫైల్)

హ్యాపీ బర్త్‌డే సురేష్!

ఎమ్మెల్యే కాకర్లకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం, మంత్రులు

ఉదయగిరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అమరావతిలోని శాసనసభ మందిరంలో సురేష్‌కు మిఠాయిలు తినిపించారు. అలాగే మంత్రి నారా లోకేష్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



దరఖాస్తు చేసుకుంటారా.. ధ్వంసం చేయమంటారా!?

- 'ఎల్‌ఆర్‌ఎస్'పై ఇంత లెక్కలేనితనమా!?
- అక్రమ లేఅవుట్లపై ఇక ఉపేక్షించే ప్రసక్తే లేదు!
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపైనా చర్యలు
- నుడా చైర్మన్ కోటంరెడ్డి ఆగ్రహం



విలేకరులతో మాట్లాడుతున్న కోటంరెడ్డి

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : 'జిల్లాలో అక్రమ లేఅవుట్ దారులు లెక్కలేనితనంగా వ్యవహరిస్తూ క్రమబద్ధీకరణకు (ఎల్‌ఆర్‌ఎస్) ముందుకు రావడంలేదు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం.' అని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని నుడా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీతో అవకాశం కల్పించదన్నారు. అయితే దీనిని రియల్టర్లు వినియోగించుకోవడం లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 14శాతం మార్కెట్ విలువను చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవాల్సి ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రతి ఒక్కరికీ మేలు జరగాలన్న ఉద్దేశంతో 7శాతం మార్కెట్ విలువ చెల్లిస్తే క్రమబద్ధీకరణ చేసుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. అయితే జిల్లాలో 437 అక్రమ లేఅవుట్లు ఉండగా, కేవలం 23 లేఅవుట్ల యజమానులు మాత్రమే క్రమబద్ధీకరణకు ముందు కు వచ్చారని తెలిపారు. ఇంకా 414 లేఅవుట్ల యజమానులు దరఖాస్తులు చేసుకో కుండా, లెక్కలేని తనంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తమకు ఎవరో ఒకరి అండ ఉం టుందన్న దీమాతో నిర్లక్ష్యంగా ఉంటున్నారని, అలాంటి వారిని ఇక ఉపే క్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇక నెల రోజులు మాత్రమే గడువు ఉందని, ఈ లోపు దరఖాస్తులు చేసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి లేఅవుట్‌ను ధ్వంసం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మరోసారి ఎల్ఆర్ ఎస్‌కు అవకాశం ఉండదని తెలిపారు. అక్రమ లేఅవుట్లు వేయకుండా కఠినంగా వ్య వహరిస్తుంటే విజమూరు, వరికుంటపాడు మండలాల్లో కొంతమంది అక్రమ లేఅ వుట్లు వేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. తమను ఎవరో ఒకరు కాపాడుతారన్న ధైర్యంతో ఉంటున్నారని, అలాంటివారిపై తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. అలాగే అక్రమ లేఅవుట్లకు విద్యుత్ సౌక ర్యం కల్పించిన ఏఈలు, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామన్నారు. నుడా పరిధిలో అక్రమ లేఅవుట్లకు నోటీసులు ఇవ్వమంటే చాలాచోట్ల పంచాయతీ కార్యదర్శులు యజమానుల చిరునామాలు తెలియవంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వారందరిపై చర్యలు తప్పవ న్నారు. ఇప్పటికైనా లేఅవుట్లు యజమానులు మర్యాదగా దరఖాస్తు చేసుకోవాలని, లేదంటే ఆ లేఅవుట్లకు భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. ఈ సమావేశంలో నుడా అధికారులు పెంచల్‌రెడ్డి, హిమబిందు, ఖాలేషా తదితరులు పాల్గొన్నారు.

ఈసీ, టీఏలపై ఏపీడీ ఆగ్రహం

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్యాలయంలో విచక్షణ మరిచి బూతులు తిట్టుకున్న ఈసీ హజరత్తయ్య, సాంకేతిక సహాయకుడు సునీల్‌పై ఉదయగిరి క్లస్టర్ ఏపీడీ మృదుల శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వారు కార్యాలయంలో బూతులు తిట్టుకుంటూ తీవ్ర వాగ్వివాదానికి దిగడంపై వివిధ పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీంతో డ్వామా పీడీ గంగాభవాని విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని సూచించడంతో వారిని ఏపీడీ కావలికి పిలిపించి విచారణ జరిపినట్లు సమాచారం. ఈమేరకు వారిని ఆమె తీవ్రంగా మందలించి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

జడ్పీ చైర్‌పర్సన్ వస్తున్నారనీ..

- **విద్యార్థులతో వెట్టిచాకిరీ**

జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కావలిలోని ముసునూరు పాఠశాల సందర్శన కు వస్తున్నారని తెలిసింది. అంతే.. ఉపాధ్యాయులు ఏర్పాట్లకు పూనుకున్నారు. విద్యార్థులతో పాఠశాల గదులను శుభ్రం చేయించారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఆ తర్వాత వెళ్లిన అరుణమ్మకు ఈ విషయం తెలిసి టీచర్లను మందలించారు.

- కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి)



గదిని శుభ్రం చేసి నీటిని కింద పోస్తున్న విద్యార్థి

వేడుకగా మస్తాన్‌వలి గంధమహోత్సవం



దర్గాలో కడప పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ, పక్కన ఏఆర్ రెహమాన్



భక్తులకు గంధాన్ని పంచిపెడుతున్న దర్గా ముజావర్లు

వెంకటాచలం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కసుమూరులోని మస్తాన్ వలి 248వ గంధమహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. గురువారం అర్ధరాత్రి బంగ్లా (చందన్ మహల్)లో గంధాన్ని ఉంచి ముజావర్లతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం గంధాన్ని గుర్రంపై ఉంచి, సంప్రదాయ వాయిద్యాలైన మేళతాళాలు, ఫకీర్ల జర్బ, కొమ్ము బూర వంటి వాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు. గుర్రాన్ని మొక్కేందుకు భక్తులు పోటీ పడ్డారు. శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో దర్గా వద్దకు గంధం చేరింది. అనంతరం మస్తాన్‌వలి సమాధిపై పూల చద్దర్లు, దుప్పట్లను కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కడప పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ సిజారా (వంశస్థుల పేర్లు) చదివి, గంధాన్ని స్వామి సమాధికి పూశారు. అనంతరం దర్గా ముజావర్లు గంధాన్ని భక్తులకు పంచి పెట్టారు. పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టడంతో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలగలేదు. విద్యుత్, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య శాఖ భక్తతలకు విస్తృత సేవలు అందించారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాసరావు, వెంకటాచలం సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

- **ఏఆర్ రెహమాన్ ప్రార్థనలు**

ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ గంధమహోత్సవంలో పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన్ను చూసేందుకు భక్తులు పోటీ పడ్డారు. అనంతరం కడప పీఠాధిపతితో కలిసి వెళ్లి స్వామివా రి సమాధికి గంధం పూశారు. జిల్లా అడిషనల్ ఎస్పీ సౌజన్య కూడా దర్గాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

- **నేడు చిన్నగంధం**

శనివారం ఉదయం గ్రామంలో చిన్నగంధం జరుగుతుందని జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఖుదావన్, దర్గా ఈఓ షేక్ షరీఫ్, కేర్ టేకర్ పఠాన్ అస్లాం ఖాన్ వెల్లడించారు. కడప పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ చిన్న గంధానికి (తహలీల్ ఫాతెహా) చదివింపులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసుల ప్రత్యేక దృష్టి

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 19 (ఆంధ్ర జ్యోతి): జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణపై జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 9 మందిపై కేసులు నమోదు చేశారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన 87 మందికి రూ. 33,135 జరినామానా విధించి, రెండు వాహనాలు సీజ్ చేశారు. రోడ్డు భద్రత నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. బహిరంగ మద్య సేవనం చేస్తున్న పది మందిపై కేసులు నమోదు చేశారు. జిల్లాలోని 31 లాడ్జీలను తనిఖీలు చేశారు. లాడ్జీల్లో గదిని అద్దెకు తీసుకునేవారి వివరాలను ప్రతిరోజు పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని సూచించారు.

ఏఎస్‌పేటకు పోటెత్తిన భక్తజనం



ఏఎస్‌పేటలో గంధ లేపనం చేస్తున్న మత పెద్ద

ఏఎస్‌పేట : శ్రీశ్రీశ్రీ హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా 252వ గంధమహోత్సవాన్ని రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో గురువారం అర్ధరాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహల్‌లో మహిళలు దంచి తయారు చేసి గంధంకు సుగంధ తైలాలు కలిపి కలశాలలో నింపారు. అనంతరం దర్గా ఈవో మహమ్మద్ హుసేన్ సమక్షంలో కలశాన్ని దర్గా సజ్జాద షాగులంమ్ నక్షబంద్ ఫయాబ్ అహ్మద్ తలపై ఎత్తుకొని ఊరేగింపుగా దర్గాకు తరలించారు. దర్గాలోని నాయబ్ రసూల్ స్వామి సమాధికి లేపనం చేసి, స్వామి,అమ్మవార్ల సమాధులపై గలేఫాలు, పూల దుప్పట్లు కప్పి ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు. ఈ వేడుకలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. మెయిన్ బజారులోని రాజా బాలాజీ, రాజా శ్రీనివాసులు, రాజా సుధీర్‌ల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అదేవిధంగా బస్టాండ్ సెంటర్, బజారు వీధి తదితర ప్రాంతాలలో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

భక్తిశ్రద్ధలతో చిరాగా

గంధమహోత్సవంలో భాగంగా భక్తిశ్రద్ధలతో చిరాగా (దీపారాధన) కార్యక్రమన్ని నిర్వహించారు. దర్గా ఈవో మహమ్మద్ హుసేన్ దర్గా ప్రంగణంలోని కోనేరును ప్రత్యేకంగా దీపాలతో అలంకరించారు. అనంతరం దర్గాలో దీపాలు వెలిగించారు. భక్తులు కూడా నూనె, మైనం దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.



దీపాలతో అలంకరించిన కోనేరు

ఇక క్రీడా సంబరం!

- ప్రతిష్టాత్మకంగా సంసద్ ఖేల్ మహోత్సవ్-2025
- క్రీడా సంస్కృతిని పెంపొందించి ప్రోత్సహించడమే లక్ష్యం
- జిల్లాలో 100 రోజులపాటు నిర్వహణ
- ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సంసద్ ఖేల్ మహోత్సవ్ 2025.. యువత క్రీడలు, ఫిట్‌నెస్ ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వందరోజుల కార్యక్రమం. ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో ఎంపీలతో నిర్వహించే ఈ కార్యక్రమంలో గ్రాస్‌రూట్‌స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం, ప్రతిభ కలిగిన యువతను గుర్తించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతోపాటు ఫిట్‌నెస్ అలవాట్లను ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశంగా నిర్వహణ ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆగస్టు 29న కేంద్రం ఈ కార్యక్రమాన్ని ప్రకటించింది. అన్ని రకాల క్రీడలతోపాటు సామూహికంగా పాల్గొనే సరదా క్రీడలను నిర్వహించనున్నారు. దీనికోసంగా జిల్లాలో ఇప్పటికే విద్యా, క్రీడాశాఖ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ కార్యక్రమ నిర్వహణ, ఏర్పాట్లపై చర్చిస్తున్నారు. క్రీడా సంఘాలు, ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులతోపాటు కోచ్‌లను, స్థానికులను సంసిద్ధం చేస్తున్నారు. గ్రామ, పంచాయతీ, వార్డు, కార్పొరేషన్, పార్లమెంట్ నియోజకవర్గం, డివిజన్, జిల్లాస్థాయిల్లో పోటీలను నిర్వహించనున్నారు. అన్ని రకాల వసతులతో పోటీలను నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు వేగవంతం చేస్తున్నారు.



- **నమోదుకు ప్రత్యేక పోర్టల్**

క్రీడల్లో పాల్గొనేందుకు ప్రత్యేకంగా సన్‌సద్‌ఖేల్‌మహోత్సవ్ డాట్ ఇన్ పేరుతో అధికారిక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికే దీనికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. దరఖాస్తులు పూర్తయిన వెంటనే (100 రోజులు) క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. ఎప్పటి కప్పుడు క్రీడాపోటీలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడంతోపాటు ఉత్తమ క్రీడాకారుల జాబితాలను సిద్ధం చేస్తారు. కబడ్డీ, ఖోఖో, రెజ్లింగ్ వంటి వాటితో పాటు ప్రముఖ క్రీడలైన ఫుట్‌బాల్, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్, యోగా, టేబుల్ టెన్నిస్, హాకీ వంటి క్రీడల పోటీలు నిర్వహిస్తారు. జిల్లా పరిస్థితులు, కార్యక్రమాల నిర్వహణకు అనుగుణంగా పోటీల నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామని అధికారులు పేర్కొన్నారు.